భారత

కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు)

# 24వ మహాసభ

# నిర్మాణ నివేదిక

2025 ఏప్రిల్ 2–6 తేదీలలో మదురై, తమిళనాడులో
జరిగిన అఖిల భారత మహాసభ ఆమోదించినది

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ కమిటీ

# 24వ మహాసభ

# నిర్మాణ నివేదిక

2025 ఏప్రిల్ 2-6 తేదీలలో మదురై, తమిళనాడులో
జరిగిన అఖిల భారత మహాసభ ఆమోదించినది

ప్రచురణ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

**27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2,**

**ఫోన్ నెం. 0866-2577202**

ప్రతులు : 1000 ప్రచురణ కాలం : మే, 2025 వెల : ₹ .60/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2,

ఫోన్ నెం. 0866-2577202

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

# నిర్మాణ నివేదిక

## సిపిఐ(ఎం) 24వ మహాసభ, మదురైలో

## (ఏప్రిల్ 2-6, 2025) ఆమోదించినది.

## పార్ట్ - I

### 1. పరిచయం

24వ మహాసభ రాజకీయ తీర్మానం బిజెపి-ఆరెస్సెస్‌లపై పోరాడి, ఓడించడం, దానికి వెన్నుదన్నుగా ఉన్న హిందూత్వ, కార్పొరేట్ బంధాన్ని ఛేదించడం ప్రధాన కర్తవ్యంగా నిర్దేశించింది. ఆ కర్తవ్య సాధన కోసం శ్రామికవర్గంపై తీవ్రమౌతున్న దోపిడీకి వ్యతిరేకంగా వర్గ, ప్రజా పోరాటాలను నిర్వహించడం, అదే సమయంలో హిందూత్వ భావజాలానికి, మతోన్మాద శక్తుల కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగించడం అవసరం. దీనికోసం పార్టీ స్వతంత్రబలం బాగా పెరగడం, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు బలపడటం కీలకమైనది. అది అన్ని ప్రజాతంత్ర, లౌకిక శక్తులను ఏకం చేయడానికి దోహదపడుతుంది. ఈ రాజకీయ ఎత్తుగడల విధానాన్ని నెరవేర్చడానికి పార్టీ నిర్మాణం సన్నద్ధం అవ్వాలి.

ఈ కాలంలో పార్టీ, ప్రజాసంఘాలు అనేక పోరాటాలు, ఉద్యమాలు, క్యాంపెయిన్లు స్వంతంగాను, ఐక్యంగాను నిర్వహించాయి. ఈ పోరాటాలు ప్రభుత్వాల నుండి కొన్ని రాయితీలు రాబట్టడానికి విజయవంతంగా వత్తిడి తీసుకు వచ్చాయి. వీటికి సంబంధించిన వివరాలు రాజకీయ సమీక్షా నివేదికలోను, ప్రజాసంఘాల

నివేదికల్లోను ఉన్నాయి. సరైన నాయకత్వాన్ని అందిస్తే ప్రజలు తమ హక్కుల కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. అయినప్పటికీ ఈ కృషి ప్రస్తుతం దేశంలో నెలకొని ఉన్న సవాళ్ళతో కూడిన పరిస్థితిని ఎదుర్కొనడానికి సరిపోదు. బిజెపి ప్రభుత్వ నాయకత్వంలోని కార్పొరేట్, మతోన్మాద బంధాన్ని ఎదుర్కొనడానికి మరింత విస్తృతమైన, స్థిరమైన పోరాటాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. దీన్ని సాధించాలంటే ఇప్పటికే జరిపిన పోరాటాలను సమర్థవంతమైన రాజకీయ ప్రభావంగా సంఘటితం చేయాల్సి ఉంది. అదే సమయంలో మన పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవాలి.

రాజకీయ సమీక్షా నివేదిక 23వ మహాసభ రాజకీయ ఎత్తుగడల పంథా అమలును సమీక్షించి కొన్ని బలహీనతలను, లోపాలను గుర్తించింది. ఇక్కడ మనం 23వ మహాసభ నిర్దేశించిన నిర్మాణ కర్తవ్యాల అమలును సమీక్షించి పార్టీ, ప్రజాసంఘాల పనిలో కొనసాగుతున్న బలహీనతలను గుర్తించాలి. ఆ సమీక్ష ఆధారంగా మనం పార్టీ నిర్మాణానికి పదునుపెట్టడానికి, మెరుగుపరుచుకోవడానికి నిర్దిష్ట నిర్మాణ కర్తవ్యాలను రూపొందించుకోవాలి. పార్టీ స్వంత బలాన్ని పెంచుకోవడానికి ఇది అవసరం.

23వ మహాసభ నిర్దేశించిన నిర్మాణ కర్తవ్యాలను అమలు చేయడానికి కేంద్ర కమిటీ నిర్దిష్టంగా కొన్ని అంశాలను పేర్కొంది.

1. పార్టీ సభ్యత్వ నాణ్యతను మెరుగపరుచుకోవాలి : దీని కోసం. 2023 పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో పార్టీ సభ్యత్వ అర్హతలైన 5 ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలి.
2. పార్టీ శాఖల చురుకుదనాన్ని పెంచడం : ప్రతి రాష్ట్ర కమిటీ కూడ రాబోయే ఆరు మాసాల్లో ఎన్ని శాఖల చురుకు దనాన్ని పెంచాలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. దాంతో పాటు శాఖా కార్యదర్శుల శిక్షణకు కూడ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి.
3. 2023, 2024 పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో యువత, మహిళల సభ్యత్వాన్ని పెంచేందుకు ప్రణాళికా బద్దంగా కృషి జరగాలి.
4. కొత్తగా యువ హోల్ టైమర్లను రిక్రూట్ చేసుకోవడానికి ప్రణాళికాబద్ధమైన కృషి జరగాలి. వారికి రాజకీయ, సైద్ధాంతిక శిక్షణ అందించాలి. ప్రస్తుత హోల్‌టైమర్ల పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు శిక్షణ అందించాలి.

5. సూర్జిత్ భవనంలోని పెర్మినెంట్ స్కూల్‌లో కేంద్ర క్లాసులను ప్లాన్ చేయాలి. ఎడ్యుకేషన్ సబ్ కమిటీలు ఏడాది చివరి వరకు క్లాసుల ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. హిందూత్వ, ఆరెస్సెస్ భావజాలంపైన, ఆచరణ పైన నోట్‌ను పార్టీ కేంద్రం రాబోయే మూడు మాసాల్లో ఖరారు చేయాలి.

6. పార్టీ కేంద్ర కమిటీ దిద్దుబాటు ఉద్యమానికి కాల నిర్దేశంతో కూడిన ప్రణాళికను సిద్ధం చేయాలి.

7. గ్రామీణ ప్రాంతాలలోని శ్రామికులందరూ సమీకరించబడేలా గ్రామీణ శ్రామికుల యూనియన్లను, ఫెడరేషన్లను స్థాపించాలి. గ్రామీణ వ్యవసాయేతర కార్మికులు చేస్తున్న వివిధ రకాల పనులను గుర్తించేందుకు రాష్ట్ర కమిటీలు సర్వేలు నిర్వహించాలి. ఆ సర్వేలు కాల నిర్దేశంతో ఈ ఏడాది చివరికి ముగియాలి.

8. ఆ సర్వేల ఆధారంగా రాష్ట్ర కమిటీలు వివిధ రకాల పనులు చేస్తున్న వారికి నిర్దిష్టంగా ఎలాంటి సంఘాలను పెట్టాలో చర్చించాలి. ఆ వివరాలను పార్టీ కేంద్రానికి తెలియచేయాలి.

9. పార్టీ నిర్మాణంతో సోషల్ మీడియాను వినియోగించుకోవడానికి రాష్ట్ర కమిటీలు ప్రణాళికలను సిద్దం చేయాలి. రూపొందించిన మార్గదర్శకాలను అమలు చేయడానికి ఈ ఏడాది చివరికల్లా వర్క్‌షాపులు నిర్వహించాలి.

10. ప్రజాసంఘాల పనితీరును సమీక్షించడానికి కేంద్రకమిటీ సంవత్సరం పొడవునా సాగే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ప్రజాసంఘాలు స్వతంత్రంగా పనిచేయడానికి మార్గదర్శకాల అమలు జరిగేలా చూడాలి. పార్టీ నిర్మాణాన్ని, ఫ్రాక్షన్ల పనితీరును పర్యవేక్షించాలి.

11. బాల సంఘాల స్థాపన గురించి రాష్ట్ర కమిటీలు చర్చించాలి. ఆ సంఘాలు పనిని ప్రారంభించడానికి, ఆ పనిని సమన్వయం చేయడానికి కేంద్రస్థాయిలో ఒక సమావేశం/ వర్క్‌షాప్ నిర్వహించాలి.

12. కేంద్రంలోని పట్టణ వ్యవహారాల కమిటీ సహాయంతోను, దానితో సమన్వయం చేసుకొంటూ పట్టణ ప్రాంతాలలో పనికి రాష్ట్ర కమిటీలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

23వ మహాసభ నిర్దేశించిన పైన పేర్కొన్న కర్తవ్యాల అమలును మనం బేరీజు వేసుకోవాలి. సాధించిన ఫలితాలను అంచనా వేసుకోవాలి.

## 2. నిర్మాణం

### పార్టీ సభ్యుల నాణ్యత

2021 పార్టీ 23వ మహాసభ నాటికి పార్టీ సభ్యత్వం 9,85,757 గా ఉంది. 24వ మహాసభ నాటికి ఈ సభ్యత్వం 10,19,009 కి పెరిగింది. ఈ పెరుగుదల ప్రధానంగా కేరళ, తెలంగాణ రాష్ట్రాలలో జరిగింది. మొత్తం 14 రాష్ట్రాలలో సభ్యత్వం పెరిగితే, 11 రాష్ట్రాలలో తగ్గిపోయింది.

పార్టీ సభ్యుల నాణ్యతను పెంచాలని మనం పదే పదే చెబుతూ వస్తున్నాము. ఉన్నత ప్రమాణాల కోసం సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో ఐదు గీటు రాళ్ళను కచ్చితంగా అమలు చేయాలని కలకత్తా ప్లీనం ఆదేశించింది. పునరుద్ధరణ సమయంలో ఈ గీటురాళ్ల అమలుకు కొన్ని రాష్ట్రాలు ప్రయత్నించాయి. అయితే ఇది పాక్షిక విజయం మాత్రమే. తమిళనాడులోను, ఇంకా కొన్ని ఇతర రాష్ట్రాలలోను వివిధ కమిటీలు ఈ ప్రమాణాలను అమలు చేయడానికి నిరాకరించాయి.

పశ్చిమ బెంగాలు లాంటి రాష్ట్రాలలో పార్టీ సభ్యుల పనితీరును, పార్టీ కార్యకలాపాలలో వారు పాల్గొన్న తీరును సమీక్షించిన తర్వాతనే పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని ప్రత్యేక కృషి జరిగింది. క్రమబద్ధమైన పర్యవేక్షణ, పార్టీ సభ్యత్వ పరిశీలన, పునరుద్ధరణ జరిగిన వెనువెంటనే పై కమిటీలకు నివేదికలు పంపడం పార్టీ సభ్యత్వ నాణ్యతను పరిశీలించడానికి దోహదపడుతుంది.

నిర్దేశించిన లెవీ మొత్తాన్ని వసూలు చేయడం ప్రత్యేకించి మధ్యతరగతి వారినుండి వసూలు చేయడం అత్యధిక రాష్ట్రాలలో ప్రధాన సమస్యగా ఉంది. రాజస్థాన్‌లో కొంత మంది ఎన్నికైన ప్రజాప్రతినిధులు, యుపిలో కొందరు జిల్లా కమిటీ సభ్యులు సైతం లెవీ చెల్లించేందుకు విముఖంగా ఉన్నారు.

లెవీ చెల్లించడం మినహా చాలమంది పార్టీ సభ్యులు పార్టీ కార్యకలాపాలలో, ఎన్నికల ప్రచారంలో సైతం పాల్గొనడం లేదు. పార్టీ కార్యకలాపాలలో కేవలం 30–40 శాతం మంది పార్టీ సభ్యులు మాత్రమే క్రమబద్దంగా పాల్గొంటున్నారు. దీంతో పాటు

పార్టీ పత్రికలకు చందా చెల్లించడం, వాటిని చదవడం తక్కువగా ఉంది. పార్టీ సభ్యులందరినీ పార్టీ పత్రికలకు చందాదారులుగా చేయడం, వాటిని చదివేలా చేయడం, పార్టీ అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేలా చేయడం కీలకమైనది.

పార్టీ సభ్యుల నాణ్యతను మెరుగుపరిచే కృషిని మరింత శక్తివంతంగా ముందుకు తీసుకు వెళ్ళాలి. ప్రస్తుతం పార్టీ సభ్యులలో గణనీయమైన సంఖ్యలో పార్టీలో చేరిన తర్వాత మందగొడిగా తయారవుతున్నారు, పార్టీని వదిలి వెళుతున్నారు, లేదా డ్రాప్ చేయబడుతున్నారు. చాలా రాష్ట్రాలలో డ్రాపింగ్ రేట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఉదాహరణకు 2024లో సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో డ్రాపయిన కేండిడేట్ సభ్యులు కేరళలో 22.8 శాతం, తెలంగాణాలో 35.5 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 14.5 శాతం, ఉత్తర ప్రదేశ్‌లో 14 శాతం ఉన్నారు. పూర్తి స్థాయి సభ్యుల్లో డ్రాపేజ్ రేటు ఏడు రాష్ట్రాలలో 6 శాతం అంతకన్నా ఎక్కువగా ఉందని 2023 పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ స్క్రూటినీలో తేలింది. డ్రాపేజ్ రేటు సంవత్సరాల వారీగా అందుబాటులో లేనప్పటికీ, 2015-2024 మధ్య కాలంలో ఏడాదికి 10 నుండి 15 శాతం సభ్యులు డ్రాప్ అవుతున్నారని తమిళనాడు రాష్ట్ర మహాసభ నివేదిక వెల్లడించింది.

లూజ్ రిక్రూట్‌మెంట్ జరుగుతున్నదని, పనిచేసే ఆగ్జిలరీ శాఖల ద్వారా సభ్యులను రిక్రూట్ చేసుకోవడం జరగడం లేదని ఇది స్పష్టం చేస్తున్నది. ప్రజాసంఘాలు, వర్గ సంఘాలలో సమరశీలంగాను, చురుగ్గాను ఉన్న మద్దతుదారుల నుండి ఆగ్జిలరీ గ్రూపులను ఏర్పాటు చేసి ఆ కామ్రేడ్లను క్యాండిడేట్ సభ్యత్వానికి సన్నద్ధం చేయాలి. ఏడాది పాటు క్యాండిడేట్ సభ్యులకు రాజకీయంగాను, సైద్ధాంతికంగాను, నిర్మాణపరంగాను శిక్షణ గరిపి బాధ్యతలు నెరవేర్చేలా వారి రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాలి.

కేవలం రాజకీయ విద్యను గరపడం ద్వారానే పార్టీ సభ్యుల నాణ్యత పెరగదని అనుభవం తెలియచేస్తున్నది. ప్రజల దైనందిన జీవిత కార్యకలాపాలకు సంబంధించిన అంశాలలో జోక్యం చేసుకోవడం ద్వారానే పార్టీ సభ్యులు చురుగ్గా ఉంటారు. ఏ ప్రజాసంఘంలోను సభ్యులుగా ఉండకుండానే, అనేక రాష్ట్రాలలో చాలమంది పార్టీ సభ్యులు ఉన్నారు. ఉన్నత నాణ్యత కలిగిన పార్టీ సభ్యులను కొత్తగా రిక్రూట్

చేసుకోవడానికి, ఉన్న పార్టీ సభ్యులు చురుగ్గా కార్యకలాపాల్లో పాల్గొనేలా చేయడానికి నిరంతర ప్రజా ఉద్యమాలు, పోరాటాలు అవసరం.

నాయకత్వ లక్షణాలు, ప్రభావం కలిగిన వ్యక్తులను కనుగొనడం సవాలుగానే కొనసాగుతున్నది. చాల మంది సభ్యులకు ప్రజలను సమీకరించి, నాయకత్వం వహించకలిగిన శక్తి ఉండటం లేదు. దీనికి ప్రధానకారణం, క్షేత్ర స్థాయి ప్రజాసంఘాలు లేకపోవడమే. అలాంటి యంత్రాంగం ఉన్నట్లయితే, ప్రజలతో బలమైన సంబంధాలు కలిగిన, ప్రభావశీలమైన సహజ నాయకత్వం ఆవిర్భవిస్తుంది.

## మహిళల పొందిక

పార్టీ లోపల మహిళా ప్రాతినిధ్యం కొంత పెరిగింది. పార్టీలో మహిళా సభ్యుల శాతం 2021లో 18.2 శాతం నుండి, 2024 నాటికి 20.2 శాతానికి పెరిగింది.

పార్టీలో మహిళా సభ్యత్వం పార్టీ కేంద్రం వద్ద సమాచారం ఉన్న 17 రాష్ట్రాలు అన్నింటిలోను పెరిగింది. దీనిలో కేరళది అత్యుత్తమ రికార్డు. ఆ రాష్ట్రంలో 28000 మందికి పైగా మహిళలు (19.8 శాతం నుండి 22.8 శాతం) పార్టీలో చేరారు. ఇతర రాష్ట్రాలలో గుర్తించదగిన మెరుగుదల తమిళనాడులో (21.6 నుండి 22.7 శాతం), తెలంగాణలో (16 నుండి 17.2 శాతం), ఆంధ్రప్రదేశ్‌లో (20.7 నుండి 21.9 శాతం), అస్సాంలో (22.4 శాతం), ఢిల్లీలో (32.5 నుండి 36.3 శాతం), కర్నాటకలో (32 నుండి 33.8 శాతం), హర్యానాలో (13.1 నుండి 14.3 శాతం) జరిగింది.

బీహార్, యుపి, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలలో స్వల్పంగా 1 శాతం మహిళా ప్రాతినిధ్యం పెరిగింది. మహారాష్ట్రలో (19 నుండి 18.7 శాతం), ఉత్తరాఖండ్‌లో (25.8 నుండి 25.6 శాతం) మహిళా ప్రాతినిధ్యంలో పెద్దగా మార్పు లేదు.

పశ్చిమ బెంగాల్‌లో పార్టీ, ప్రజాసంఘాల కార్యకలాపాలలో మహిళల భాగస్వామ్యం బాగా పెరిగినప్పటికీ, పార్టీ సభ్యుల రిక్రూట్ మెంట్ మాత్రం 1 శాతం కూడ (10.8 నుండి 11.4 శాతం) పెరగలేదు. ఈ సమస్యను పరిశీలించాలి. త్రిపురలో

మహిళా పార్టీ సభ్యులు 20.3 శాతం నుండి 15.9 శాతానికి పడిపోవడం ఆందోళన కలిగిస్తుంది.

మహిళా సభ్యత్వాన్ని 25 శాతానికి పెంచాలని కలకత్తా ప్లీనం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవలసే ఉంది. దీని కోసం అన్ని రాష్ట్రాలు తీవ్రంగా కృషి చేయాలి. పార్టీ కార్యకలాపాలలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పటికీ, పార్టీలో పితృస్వామ్య విలువలు కొనసాగడం మహిళా పార్టీ సభ్యుల రిక్రూట్‌మెంట్‌కు ప్రధాన అవరోధంగా ఉంది. అన్ని రంగాల నుండి ప్రత్యేకించి ట్రేడ్ యూనియన్ రంగం నుండి (స్కీం వర్కర్ల లాంటి వారు) మహిళా సభ్యులను రిక్రూట్ చేసుకోవడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. అలాంటి వారిని సక్రమంగా గుర్తించడం ద్వారాను, ఆగ్జిలరీ గ్రూపులను ఏర్పాటు చేయడం ద్వారాను పార్టీ సభ్యులుగా చేర్చుకోవాలి.

అన్ని స్థాయిల కమిటీల్లోను మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలని కూడ కలకత్తా ప్లీనం తీర్మానించింది. 22వ మహాసభలోను, 23వ మహాసభలోను 15 మంది మహిళలను కేంద్రకమిటీలోకి తీసుకోవడం జరిగింది. అయితే కేంద్రకమిటీ సభ్యుల మొత్తం సంఖ్యను తగ్గించడం మూలంగా మహిళల శాతం 15.8 నుండి 17.6 శాతానికి పెరిగింది.

23వ మహాసభలో వివిధ స్థాయి కమిటీల్లో మహిళల ప్రాతినిధ్య శాతాన్ని నిర్ణయిస్తూ పార్టీ నిబంధనావళిని సవరించడం జరిగింది. నిర్ణయాలు తీసుకునే కమిటీల్లో మహిళల పాత్రను పెంచాలన్న పార్టీ నిబద్ధతకు అనుగుణంగా ఈ మార్పు జరిగింది. అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ కమిటీలు ఈ అంశంపై కొంత చర్చించాయి. రాష్ట్ర కమిటీతో సహా అన్ని స్థాయిల కమిటీల్లోను మహిళల ప్రాతినిధ్యాన్ని 20 శాతానికి పెంచాలని తమిళనాడు కమిటీ నిర్ణయం తీసుకుంది. దాని ప్రకారం ఆ రాష్ట్ర కమిటీలో మహిళల శాతం 15 నుండి 19కి పెరిగింది. జిల్లా కమిటీల్లో సగటున 15.7 శాతం, మధ్యంతర కమిటీల్లో 16.4 శాతం మహిళలు ఉన్నారు. అన్ని స్థాయిల్లోను మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. ఇటీవల ముగిసిన మహరాష్ట్ర మహాసభలో 50 మంది రాష్ట్రకమిటీలో మహిళల ప్రాతినిధ్యాన్ని 12 మందికి (24 శాతం) పెంచారు. అంతకు ముందు రాష్ట్రకమిటీలో 9 మంది మహిళలు మాత్రమే ఉండేవారు. ఇది మెచ్చుకోదగిన పరిణామం.

81 మంది ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రకమిటీలో మహిళలు 14 (17.3 శాతం) నుండి 15 (18.5 శాతం) కు పెరిగారు. కేరళ రాష్ట్రకమిటీలో మహిళలు మార్పు లేకుండా 12 మంది (13.5 శాతం) మాత్రమే ఉన్నారు. ఇది చాల నాసిరకం రికార్డు.

ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, అస్సాంల రాష్ట్రకమిటీల్లో 1 మహిళను అదనంగా తీసుకున్నారు. దీని ప్రకారం మహిళల ప్రాతినిధ్యం ఆంధ్ర ప్రదేశ్‌లో 14 నుండి 16 శాతానికి, ఒరిస్సాలో 6.6 నుండి 10 శాతానికి, అస్సాంలో 10.2 నుండి 12 శాతానికి పెరిగింది. హిందీ భాషా రాష్ట్రాలలో ఢిల్లీ రాష్ట్రకమిటీలో అత్యధికంగా 27.5 శాతం మహిళలు ఉన్నారు. మధ్య ప్రదేశ్‌లో 20 శాతం, రాజస్థాన్‌లో 11.4 శాతం, బీహార్‌లో 11 శాతం, యుపిలో 12 శాతం, హర్యానాలో 17.8 శాతం, పంజాబ్‌లో 11.1 శాతం (8.3 శాతం నుండి పెరిగింది.), చత్తీస్‌ఘర్‌లో 11.4 శాతం (9.5 శాతం నుండి పెరిగింది.) మహిళా ప్రాతినిధ్యం ఉంది.

ఈ సంఖ్య రాష్ట్ర కమిటీలకు ఎన్నికైన వారిది మాత్రమే. ఆహ్వానితుల సంఖ్య దీనిలో లేదు.

మధ్యంతర కమిటీల్లో రికార్డు మిశ్రమంగా ఉంది.

కేరళలో స్థానిక కమిటీలకు ఎన్నికైన మహిళల సంఖ్య ఇటీవల ముగిసిన మహాసభల్లో 253 పెరిగింది. వీరి సంఖ్య 2022లో 4,420 ఉంటే, అది 4,673కు పెరిగింది. అయితే స్థానిక కమిటీల సంఖ్య పెరగడం మూలంగా ఈ పెరుగుదల కనిపిస్తున్నది. వాస్తవానికి మొత్తంగా మహిళల ప్రాతినిధ్యం 17 నుండి 15 శాతానికి పడిపోయింది. అన్ని స్థాయిల్లోను మహిళల శాతాన్ని నిర్ణయించి అమలు చేయాల్సిన అవసరాన్ని ఇది తెలియ చేస్తున్నది.

పశ్చిమ బెంగాల్‌లో జిల్లాకమిటీల్లో 15 శాతం మహిళలు ఉండాలని నిర్ణయించారు. ఏరియా కమిటీల్లో ఆ కమిటీ పరిమాణాన్ని బట్టి కనీసం ఇద్దరు, లేదా ముగ్గురు ఉండాలని నిర్ణయించారు. త్రిపురలో అత్యధికంగా జిల్లా కమిటీల్లో 19 శాతం మహిళలు ఉండాలని నిర్ణయించారు. స్థానిక కమిటీల్లో ముగ్గురు ఉండాలని నిర్ణయించారు. మహాసభ సమయంలో ఈ సంఖ్య పూర్తి కాకపోతే ఆ ఖాళీని అలాగే ఉంచి తర్వాత మహిళతోనే భర్తీ చేయాలి.

ఆంధ్రప్రదేశ్‌లో రెండు మార్గదర్శకాలున్నాయి. ఒకటి, పార్టీ సభ్యుల్లో ఎంత శాతం మహిళలుంటే అంత శాతం కమిటీలోకూడ మహిళలు ఉండాలి. రెండు, మహిళా సభ్యులు కనీసం 10 శాతం ఉండాలి. జిల్లా కమిటీల్లో మహిళల శాతం 14.2 శాతంగా ఉంది. గతంలో కన్నా ఇది స్వల్ప మెరుగుదల అయినప్పటికీ, మహిళా పార్టీ సభ్యుల నిష్పత్తికి అనుగుణంగా లేదు. ఇతర రాష్ట్రాలను చూసినట్లయితే, తెలంగాణాలో జిల్లా కమిటీల్లో మహిళా ప్రాతినిధ్యం ఏమీ పెరగలేదు. 12 శాతం మాత్రమే ఉంది.

తమిళనాడు లాంటి కొద్ది రాష్ట్రాలను మినహాయిస్తే, నిబంధనావళి మార్పు ప్రకారం మహిళా కమిటీ సభ్యుల శాతం పెంపును సక్రమంగా అమలు చేయాలి.

## యువత పొందిక

31 సంవత్సరాల లోపు పార్టీ సభ్యుల సంఖ్య ఆందోళనకరంగానే ఉంది. దాదాపు అన్ని రాష్ట్రాలలోను పార్టీ సభ్యుల్లో యువత శాతం తగ్గింది. ఒక్క కేరళలో మాత్రమే పార్టీ సభ్యుల్లో యువత శాతం పెరిగింది. పార్టీ సభ్యుల్లో యువత 2021లో 19.5 శాతం నుండి 2024 నాటికి 22.6 శాతానికి పెరిగారు.

కేరళలో పార్టీలో యువత శాతం గణనీయంగా 23.79 నుండి 29.8 కి పెరిగింది. కోల్‌కటా ప్లీనం నిర్దేశించిన లక్ష్యాన్ని ఈ ఒక్క రాష్ట్రంలో మాత్రమే అందుకోవడం జరిగింది. బీహార్‌లో పార్టీ సభ్యుల్లో యువత శాతం 18.2 శాతంగా ఉంది. అయితే కొన్ని రాష్ట్రాలలో పార్టీ సభ్యుల్లో యువత శాతం గణనీయంగా తగ్గింది. హిమాచల్ ప్రదేశ్‌లో 19.2 నుండి 13.5 శాతానికి, హర్యానాలో 7.9 నుండి 4.9 శాతానికి, త్రిపురలో 17.8 నుండి 16.4 శాతానికి, ఆంధ్రప్రదేశ్‌లో 17.6 నుండి 16.5 శాతానికి, జార్ఖండ్‌లో 23.3 నుండి 22 శాతానికి తగ్గింది. ఢిల్లీలో మార్పు లేకుండా 11.7 శాతం ఉంది.

పశ్చిమ బెంగాల్‌లో పదే పదే చర్చ జరిపినప్పటికీ, యువత శాతం 8.7 నుండి 8.2 శాతానికి తగ్గింది. మన ప్రజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో యువత పాల్గొంటున్నప్పటికీ పార్టీ సభ్యత్వంలో యువత పెరగకపోవడం ఆందోళన కలిగించే అంశం. వారిని మన పార్టీలో ఇముడ్చుకునే కృషి తీవ్రతరం చేయాల్సిన అవసరాన్ని తెలియచెబుతున్నది.

చాల రాష్ట్రాలు యువతను పార్టీ సభ్యులుగా రిక్రూట్ చేసుకోవడంలో తమ వైఫల్యాన్ని గుర్తించాయి. ఈ అంశం తక్షణం శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. యువ, విద్యార్థి సంఘాలపై కేంద్రీకరించడంతో పాటు పోరాటాల్లో, ఉద్యమాల్లో గణనీయంగా యువత పాల్గొనే ట్రేడ్ యూనియన్, కిసాన్ రంగాల నుండి కూడ యువతను పార్టీ సభ్యులుగా రిక్రూట్ చేసుకోవడంపై దృష్టి సారించాలి.

## వర్గ పొందిక

పార్టీలో ఆరోగ్యకరమైన వర్గ పొందిక కొనసాగుతున్నది. 9,18,626 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 13 రాష్ట్రాల సమాచారం ప్రకారం 48.25 శాతం మంది సభ్యులు కార్మిక వర్గానికి చెందినవారు, 17.79 శాతం వ్యవసాయ కార్మికులు, 9.93 శాతం పేద రైతులు. ఆ విధంగా 75.79 శాతం మంది పార్టీ సభ్యులు పునాది వర్గాల నుండి వచ్చినవారే. అయినప్పటికీ పేదరైతుల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది, దాన్ని మెరుగుపర్చాల్సి ఉంది.

ఈ వర్గ పొందిక కమిటీల్లో తగినంతగా ప్రతిబింబించడం లేదు. సమాచారం అందుబాటులో ఉన్న పది రాష్ట్రాల రాష్ట్ర కమిటీల్లో 20.18 శాతం మంది కార్మికవర్గానికి చెందినవారు, 7.7 శాతం మంది వ్యవసాయ కార్మికులు, 14.7 శాతం మంది పేద రైతులు. మొత్తంగా పునాది వర్గాల నుండి రాష్ట్ర కమిటీ సభ్యులు 42.58 శాతం. జిల్లా కమిటీల్లో పునాది వర్గాలకు చెందిన వారు 35.32 శాతం. మధ్యంతర కమిటీల్లో వీరు 88.39 శాతంగా ఉన్నారు.

## సామాజిక పొందిక

పార్టీ సభ్యత్వంలో ఆరోగ్యకరమైన సామాజిక పొందిక ఉంది. మొత్తంగా పార్టీలో 19.3 శాతం మంది దళితులున్నారు. ఒక్క మహరాష్ట్ర మినహా అన్ని రాష్ట్రాలలోను పార్టీ సభ్యుల్లో దళితుల శాతం, ఆ రాష్ట్రాల జనాభాలోని దళితుల శాతం కన్నా అధికంగానే ఉంది. అయినప్పటికీ ఆదివాసీలలో మన కృషిని పెంచాల్సి ఉంది. మొత్తం పార్టీ సభ్యుల గిరిజనుల శాతం 5.1 మాత్రమే. మహా రాష్ట్ర పార్టీకి ఆదివాసీల్లో మంచి పట్టు ఉంది, ఆ రాష్ట్ర పార్టీ సభ్యుల్లో 53.9 శాతం మంది

ఆదివాసీలే. గిరిజనుల జనాభా అధికంగా కలిగిన ప్రధాన రాష్ట్రాలు త్రిపుర, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌ల పార్టీ సభ్యుల్లో గిరిజనుల శాతం, ఆ రాష్ట్రాల జనాభాలో గిరిజనుల శాతం కన్నా తక్కువే ఉంది.

పార్టీ సభ్యుల్లో ముస్లిం మైనారిటీల సంఖ్య బలహీనంగా ఉంది. ఒక్క ఢిల్లీ మినహా మిగతా అన్ని రాష్ట్రాల పార్టీ సభ్యుల్లో ముస్లిం పార్టీ సభ్యుల శాతం ఆ రాష్ట్రాల ముస్లిం జనాభా శాతం కన్నా చాల తక్కువగా ఉంది. దీన్ని అధిగమించాల్సి ఉంది. మొత్తంగా మన పార్టీ సామాజికంగా అణచివేతకు గురవుతున్న తరగతుల్లో ప్రభావం పెంచుకొని వారి నుండి ఎక్కువ సంఖ్యలో పార్టీ సభ్యులుగా రిక్రూట్ చేసుకోవలసి ఉంది.

పార్టీ తప్పనిసరిగా అన్ని స్థాయిల కమిటీల్లోను వర్గ, సామాజిక పొందికను గమనిస్తూ, పై కమిటీల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలి. పునాది వర్గాల నుండి వచ్చే కేడరునుండి నాయకత్వాన్ని పెంపొందించే విధంగా వారికి శిక్షణ గరపడానికి పార్టీ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది.

**అంగవికలురు :** అంగవికలురుల్లో నిరంతరం కృషి చేయడం మూలంగా పార్టీ సభ్యుల్లో వారి సంఖ్య పెరిగింది. కేరళ పార్టీ సభ్యుల్లో అంగవికలురు 8,680 మంది, ప్రత్యేకంగా అంగవికలుర పార్టీ శాఖలు తమిళనాడులో 68, తెలంగాణలో 15 ఉన్నాయి.

## శాఖల పనితీరు

17 రాష్ట్రాల నుండి వచ్చిన నివేదికల ప్రకారం ఆ రాష్ట్రాలలో మొత్తం 81,513 శాఖలున్నాయి. 23వ పార్టీ మహాసభ శాఖల పనితీరును మెరుగుపరచడానికి, వాటిని చురుగ్గా పనిచేయించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. శాఖా కార్యదర్శులకు శిక్షణ, వారి రాజకీయ–సైద్ధాంతిక స్థాయిని పెంచడం, పై కమిటీలతో క్రమబద్ధంగా సమావేశం కావడం జరగాలని చెప్పింది.

కొన్ని రాష్ట్ర కమిటీలు ఈ దిశగా చర్యలు తీసుకున్నాయి. తమిళనాడు, అస్సాం, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాలు శాఖా కార్యదర్శులకు, స్థానిక కమిటీ సభ్యులకు వర్కుషాపులు, ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించాయి. బీహార్, హర్యానా

రాష్ట్రాలలో శాఖలు సక్రమంగా పనిచేసేలా చూసేందుకు జిల్లా కమిటీ సభ్యులకు బాధ్యతలు కేటాయించబడినాయి. పంజాబులో స్థానిక కమిటీల పనితీరు మెరుగుపడటంతో, శాఖల పనితీరు కూడ మెరుగయింది. ఈ కృషి మూలంగా శాఖల పనితీరు స్వల్పంగా మెరుగుపడింది.

అయినప్పటికీ, అత్యధిక శాఖలు నెలవారీ సమావేశాలు జరపడం లేదు. ప్రస్తుతం 30 శాతం కన్నా కొంచెం ఎక్కువ శాఖలు 45 రోజుల కొకసారి సమావేశమవుతున్నాయి. అత్యధిక శాఖలు ఏడాదిలో నాలుగు లేదా ఐదు సార్లు మాత్రమే సమావేశమవుతున్నాయి. కొన్ని శాఖలు కేవలం సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో మాత్రమే సమావేశమవుతున్నాయి. ఇది ఎంత మాత్రం అనుమతించరానిది.

23వ మహాసభ ఆదేశానికి అనుగుణంగా, ఆరు మాసాల లోపు ప్రతి రాష్ట్ర కమిటీ కూడ కొన్ని శాఖలను గుర్తించి, వాటి పనితీరును మెరుగు పర్చాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. చాల రాష్ట్ర కమిటీలు శాఖలను పనిచేయించడంలో తమ అశక్తతను అంగీకరించాయి. కాని వాటిని మెరుగుపరిచేందుకు కేంద్రకమిటీ నిర్ణయాన్ని అమలు చేయడానికి మాత్రం పెద్దగా ప్రయత్నించలేదు.

తమిళనాడు రాష్ట్రకమిటీ 50 శాతం శాఖలను గుర్తించి వాటి పనితీరును మెరుగుపరచడం ప్రాధాన్యతగా స్వీకరించింది. అలా లక్ష్యం నిర్దేశించుకొని పనిచేయడం ఫలితాలనిచ్చిందని వారి సమీక్షా నివేదిక తెలియచేసింది.

హర్యానా రాష్ట్ర కమిటీ, పనితీరు మెరుగుపరిచేందుకు 20 శాతం శాఖలను గుర్తించింది కాని, ఆ నిర్ణయాన్ని అమలుచేయడాన్ని కొనసాగించ లేదు.

స్థానిక సమస్యలను గుర్తించడానికి, వాటిపై పనిచేయడానికి శాఖలు చురుగ్గా పనిచేయడం కీలకమైనది. రాబోయే కాలంలో శాఖలు నెలకొకసారి సమావేశమయ్యేలా చూడటం కీలక ప్రాధాన్యతగా పెట్టుకోవాలి. ఈ బాధ్యతను మధ్యంతర కమిటీలు స్వీకరించాలి. జిల్లా కమిటీలు దాని అమలును పర్యవేక్షించాలి.

## హోల్ టైమర్లు, కేడరు

17 రాష్ట్రాల నుండి వచ్చిన సమాచారం ప్రకారం మొత్తం పార్టీలో 10,473 మంది హోల్‌టైమర్లు ఉన్నారు. వారిలో గణనీయమైన సంఖ్యలో క్రింది రాష్ట్రాలలోనే కేంద్రీకరించబడి ఉన్నారు. కేరళలో 6,129 మంది, పశ్చిమబెంగాల్‌లో 1,428

మంది, ఆంధ్రప్రదేశ్‌లో 721 మంది, తెలంగాణాలో 640 మంది, తమిళనాడు 555 మంది, త్రిపురలో 527 మంది ఉన్నారు.

పొలిట్ బ్యూరో రూపొందించిన హోల్ టైమర్ల విధానానికి మార్గదర్శకాలు 2023 జులైలో అన్ని రాష్ట్రాలకు పంపించబడింది. ఈ మార్గదర్శకాలలో హోల్ టైమర్లు, వేతనాలు, రిలీవ్ విధానం పాటు, హోల్‌టైమర్లను ఎంపిక చేసుకోవడం, వారికి శిక్షణ ఇవ్వడం, వారి పనిని సమీక్షించడం ఉన్నాయి.

చాల రాష్ట్రాలలో హోల్‌టైమర్ల అలవెన్సులు తగినంతగా లేవు. కొన్ని కేసుల్లో చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లాంటి రాష్ట్రాలలో హోల్‌టైమర్ల వేతనాలు సహేతుకంగా ఉన్నాయి. ఇతర చోట్ల హోల్ టైమర్లకు ఆర్థిక మద్దతు నికరంగా ఉండటం లేదు. ఇటీవల కాలంలో రాజస్థాన్ రాష్ట్రం హోల్ టైమర్ల వేతనాలు సకాలంలో చెల్లించేందుకు ఒక ప్రత్యేక నిధి వసూళ్ళను చేపట్టింది. హోల్‌టైమర్ల ఎలవెన్సుల చెల్లింపు ప్రాధాన్యత దృష్ట్యా ఇతర రాష్ట్రాలు కూడ ఇలాంటి ప్రత్యేక నిధులను ఏర్పాటు చేసుకోవాలి.

కలకత్తా ప్లీనం మార్గదర్శకాలకు అనుగుణంగా హోల్‌టైమర్లకు సంబంధించి పార్టీ 23వ మహాసభ తీసుకున్న నిర్ణయం ఎక్కువ భాగం అమలు కాలేదు. అది ఇలా పేర్కొంది: 'కలకత్తా ప్లీనం నిర్దేశించిన ఒక ముఖ్యమైన కర్తవ్యం హోల్‌టైమర్ల విధానాన్ని రూపొందించుకోవడం. దానిలో రాజకీయ, నిర్మాణపరమైన గీటురాళ్లతో హోల్‌టైమర్లను సక్రమంగా రిక్రూట్ చేసుకోవడం, విద్య, వారి పనిగురించి క్రమం తప్పని సమీక్ష, తగినంత వేతనాల చెల్లింపుకు ఏర్పాటు ఉండాలి.' వయసు మళ్ళిన హోల్ టైమర్ కేడర్‌ను రిటైర్ చేయడం, వారి ఆర్థిక స్థితిని బట్టి తగు రిటైర్‌మెంట్ బెనిఫిట్లకు ఏర్పాటు కూడ ఈ విధానంలో భాగంగా ఉండాలి. అయినప్పటికీ ఈ ఆదేశాలను ఆమలు చేయడంలో అంతగా పురోగతి ఏమీ లేదు. ఆంధ్రప్రదేశ్ వారి హోల్ టైమర్ విధానాన్ని తాజాపరిచింది, వారి పనిని సమీక్షించింది, వారికి పునశ్చర తరగతులు కూడ నిర్వహించింది.

23వ మహాసభ నిర్దేశించిన నిర్మాణ కర్తవ్యాలలో ఒకటి కొత్తగా యువ హోల్‌టైమర్లను రిక్రూట్ చేసుకోవడం. గత మహాసభ తర్వాత త్రిపురలో కొత్తగా 67 మంది హోల్ టైమర్లను రిక్రూట్ చేసుకున్నారు. వారిలో 17 మంది (24.6

శాతం) యువకులు. తెలంగాణాలో కొత్తగా 51 మంది హోల్ టైమర్లను రిక్రూట్ చేసుకున్నారు. వారిలో 19 మంది (37.3 శాతం) యువకులు. ఆంధ్రప్రదేశ్‌లో 40 మంది కొత్త హోల్‌టైమర్లను రిక్రూట్ చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 62 మంది హోల్ టైమర్లను కొత్తగా రిక్రూట్ చేసుకున్నారు. చాలా రాష్ట్రాలు హోల్ టైమర్ల సంఖ్య తగ్గినట్లు నివేదికల్లో తెలిపాయి. ఉన్న వారిని రిలీవ్ చేయడం, లేదా డ్రాప్ చేయడం మూలంగా ఈ పరిస్థితి ఏర్పడింది.

కేడర్ల, నాయకుల మొత్తం నాణ్యతను పెంచాల్సిన తక్షణ అవసరం ఉంది. హోల్ టైమర్లలో అవినీతి, నైతికత లోపం, కెరీరిజం, పరాయి జీవన శైలి, పదవీ వ్యామోహం లాంటి ప్రతికూల ధోరణులు తలెత్తినట్లు రాష్ట్రాల నివేదికలు తెలియచేస్తున్నాయి. లైంగిక వేధింపులకు సంబంధించి కూడ కొద్ది కేసులు కూడ ఉన్నట్లు నివేదికలు తెలిపాయి. ఇలాంటి సమస్యలను తక్షణం పరిశీలించి నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవలసి ఉంది.

హోల్ టైమర్ల పనికి సంబంధించి క్రమానుగతమైన సమీక్ష అనేది అత్యధిక రాష్ట్రాలలో లేనేలేదు. కొన్ని కేసుల్లో హోల్ టైమర్లకు నిర్దిష్టమైన బాధ్యతలు అప్పగించడం జరగడం లేదు. దాంతో వారి పనిని సమీక్షించడం కూడ సాధ్యం కావడం లేదు. హోల్‌టైమర్ల గురించి క్రమబద్ధమైన అంచనాలు, వారి రాజకీయ, సైద్ధాంతిక స్థాయిని పెంచేందుకు కృషి తక్షణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

హోల్ టైమర్లు అంటే వృత్తిపరమైన విప్లవకారులు. వారు కేవలం ప్రజల్లో పూర్తికాలం పనిచేయడానికి, పార్టీ పనిచేయడానికి నియమితులైన వ్యక్తులు మాత్రమే కాదు. విప్లవోద్యమం సమగ్రాభివృద్ధికి వారి బాధ్యత కూడ ఉంది. ఉదాహరణకు ట్రేడ్ యూనియన్‌లో పనిచేయడానికి కేటాయించబడిన హోల్ టైమర్ యూనియన్ వ్యవహారాలకే పరిమితం కారాదు. వారు కార్మిక కుటుంబాలతో కూడ సంబంధాలు కలిగి ఉండాలి. ఆ కుటుంబాలలోని స్త్రీలు, పిల్లలు, విద్యార్థుల గురించి పట్టించుకోవాలి. అంటే కార్మికుల వృత్తిపరమైన సమస్యలపైనే కాక, నివాస ప్రాంత సమస్యలపై కూడ పనిచేయాలి. సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక జీవనంలో భాగస్వాములు కావాలి. అలాంటి సమగ్రమైన దృక్పథం ఉన్నపుడు మాత్రమే వారు ప్రజలను పార్టీ వైపు సమీకరించగలుగుతారు.

## వయో పరిమితి రీత్యా రిలీవ్ అయిన కామ్రేడ్లు

23వ మహాసభకు వెళ్ళేముందు కమిటీల్లో కామ్రేడ్స్‌కు వయోపరిమితి నిర్ణయించబడింది. కేంద్ర కమిటీకి 75 ఏళ్ళు, రాష్ట్రకమిటీకి, మధ్యంతర కమిటీలకు 75 ఇంకా అంతకన్నా తక్కువ వయోపరిమితి నిర్ణయించబడింది. 2021 అక్టోబరులో కేంద్రకమిటీ 'వయోపరిమితి రీత్యా రిలీవ్ అయిన కామ్రేడ్స్ గురించి' అనే నోట్‌ను విడుదల చేసింది. అలా రిలీవ్ అయినప్పటికీ ఇంకా పనిచేయకలిగిన శక్తి కలిగిన కామ్రేడ్స్‌ను ఇముడ్చుకొని, పనిచేయించే మార్గాలను ఇలా సూచించింది.

1. గుర్తించదగిన సేవలందించిన వృద్ధ కామ్రేడ్స్‌ను రాష్ట్ర కమిటీలకు ప్రత్యేక ఆహ్వానితులుగా తీసుకొనే పద్ధతి ఇప్పటికే కొనసాగుతున్నది. అయితే ఈ విధంగా తీసుకోవడం కొద్ది మంది ఎంపిక చేసిన వారి విషయంలో మాత్రమే సాధ్యం, రిలీవ్ అయిన అందరి విషయంలో ఇది సాధ్యం కాదు. పెద్ద రాష్ట్రాలకు ప్రత్యేక ఆహ్వానితుల సంఖ్య 5 కే పరిమితం చేయడం అలాగే కొనసాగాలి. 20,000 మంది సభ్యులున్న చిన్న రాష్ట్రాలకు ఈ సంఖ్య 3 వరకు పరిమితం చేయాలి.
2. రాష్ట్ర కమిటీ నుండి రిలీవ్ అయిన ఇతర కామ్రేడ్స్‌ను పిసి ఆధ్వర్యంలోని శాఖలో ఉంచాలి. జిల్లాలో పనిచేసేట్లయితే జిల్లా కేంద్రం శాఖలో ఉంచాలి.
3. జిల్లా కమిటీనుండి రిలీవ్ అయిన కామ్రేడ్స్‌ను జిల్లా కేంద్రం లోని శాఖలో ఉంచాలి. వారు ప్రజాసంఘాలలో పనిచేస్తున్నట్లయితే, ఆఫీస్ బేరర్లుగా ఉన్నట్లయితే తగిన పార్టీ శాఖలో వారిని ఉంచాలి.

కొన్ని రాష్ట్రాల నివేదికల ప్రకారం రిలీవ్ అయిన కామ్రేడ్స్‌ను ఈ క్రింది విధంగా వినియోగించు కుంటున్నారు. ప్రత్యేక ఆహ్వానితులను (అంటే కొద్దిగా పనిచేయకలిగిన వారు) పార్టీ విద్య కోసం, అధ్యయన, సాంస్కృతిక కేంద్రాలను పర్యవేక్షించడానికి, సాధారణ క్యాంపెయిన్లలోను వినియోగించు కుంటున్నారు. ప్రత్యేక ఆహ్వానితులు కాని వారిని రాష్ట్ర కేంద్రంలోని, జిల్లా కేంద్రంలోని శాఖల్లోను, లేదా ప్రజాసంఘాల కేంద్రం లోని శాఖల్లో ఉంచి కొంత పని చేయించుకుంటున్నారు. కొన్ని రాష్ట్ర కమిటీల్లో పెద్ద కమిటీలు అయితే 5, చిన్న కమిటీలు అయితే 3 అని ప్రత్యేక ఆహ్వానితులకు విధించిన పరిమితిని అధిగమిస్తున్నారు. కేంద్ర కమిటీ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర

నాయకత్వంలో కాని, జిల్లా నాయకత్వంలో కాని విశేషమైన సేవలను సుదీర్ఘకాలం అందించిన వారిని మాత్రమే ప్రత్యేక ఆహ్వానితులుగా తీసుకోవాలి. మిగతా వారిని వారి అనుభవము, శక్తి సామర్థ్యాలను బట్టి వినియోగించుకోవాలి. రిలీవ్ అయిన కామ్రేడ్స్‌ను శాఖల్లో ఇముడ్చుకోకుండా, పని అప్పగించబడకుండా ఉన్న ఉదంతాలు కొన్ని ఉన్నాయి. అలాంటి వాటిని సరిదిద్దుకోవాలి.

కేంద్ర కమిటీ నుండి రిలీవ్ అవడానికి, రాష్ట్ర కమిటీ నుండి రిలీవ్ అవడానికి ఉన్న వయోపరిమితిలోని తేడాలవల్ల, రాష్ట్ర కమిటీ నుండి రిలీవ్ అయిన కామ్రేడ్, కేంద్ర కమిటీకి ఎన్నిక కావచ్చు. అలాంటి సందర్భంలో ఆ కామ్రేడ్‌కు రాష్ట్ర స్థాయి నిర్మాణంలో బాధ్యతలు అప్పగించాలి.

## రాష్ట్ర, జిల్లా, మధ్యంతర కమిటీలు

పార్టీకి 22 రాష్ట్ర కమిటీలు, నాలుగు రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీలు ఉన్నాయి. 16 రాష్ట్రాల నుండి వచ్చిన సమాచారం ప్రకారం 204 జిల్లా కమిటీలు, 76 జిల్లా ఆర్గనైజింగ్ కమిటీలు, 1260 ఏరియా కమిటీలు, 3,180 స్థానిక కమిటీలు ఉన్నాయి. ఈ స్థానిక శాఖల్లో 2,444 కేరళలోనే ఉన్నాయి.

చాలా రాష్ట్ర కమిటీలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయి, రాజకీయ సమస్యలపై రెగ్యులర్‌గా చర్చలు నిర్వహిస్తున్నాయి. అత్యధిక రాష్ట్ర కమిటీలు చర్చలు స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా జరుగుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. అయినప్పటికీ ఒరిస్సా, చత్తీస్‌ఘర్ లాంటి రాష్ట్రాలు తమ రాష్ట్ర కమిటీ సభ్యుల రాజకీయ, సైద్ధాంతిక స్థాయిని పెంపొందించాల్సిన తక్షణ అవసరం ఉందని భావించాయి.

రాష్ట్ర సెక్రటేరియట్ లోపల సమిష్టి పని విధానం వ్యక్తిగత పనివిధానానికి, ముఠా తత్వానికి విరుగుడుగా పనిచేస్తుంది. సభ్యుల వ్యక్తిగత సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. రాష్ట్ర కేంద్రంలోను, సెక్రటేరియట్‌లోను, రాష్ట్ర కమిటీలోను సమిష్టి పనివిధానాన్ని నెలకొల్పాల్సిన బాధ్యత సెక్రటరీది. అందుబాటులో ఉన్న సెక్రటేరియట్ సభ్యుల రోజువారీ సమావేశాలు వారి మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తాయి. దీంతో పాటు, అన్ని రాష్ట్ర సెక్రటేరియట్‌లు రాష్ట్ర కేంద్రం,

సెక్రటేరియట్‌లు సమర్ధవంతంగా పని చేయడానికి మార్గదర్శకాలు రూపొందించుకోవాలి.

స్థానిక సమస్యలను గుర్తించి, వాటిపై స్థిరమైన పోరాటాలను చేపట్టకపోవడం రాష్ట్రకమిటీల్లో గుర్తించదగిన వైఫల్యం. పార్టీ బలహీనంగా ఉన్న రాష్ట్రాలలో రాష్ట్ర కమిటీ సభ్యులు శాఖా సమావేశాల్లో చురుగ్గా పాల్గొనాలి. కేరళలో ప్రతి రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏడాదిలో కనీసం ఒక శాఖా సమావేశానికి హాజరు కావాలి. ఇది శాఖల పనితీరు మెరుగుదలకు గుర్తించదగినంతగా ఉపయోగపడింది.

రాష్ట్ర మహాసభల నివేదికలు చూసినట్లయితే, చాల జిల్లా కమిటీలు రాష్ట్ర నాయకత్వం జోక్యం లేకుండా స్వతంత్రంగా పనిచేయడానికి సతమతమవుతున్నారు. జిల్లా కమిటీల్లో చర్చలు పై కమిటీల నుండి ఆదేశాలను అమలు చేయడానికే జరుగుతున్నాయి. పై కమిటీ ప్రతినిధులు హాజరయినపుడు మాత్రమే రాజకీయ రిపోర్టు జరుగుతున్నది. రాజకీయ చర్చలు అరుదుగా జరుగుతున్నాయి.

జిల్లా కమిటీల పనితీరుపై తక్షణం శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. వాటి సామర్థ్యాన్ని పెంచడానికి మధ్యంతర కమిటీల, జిల్లా కమిటీల సభ్యులకు క్రమబద్ధంగా వర్క్‌షాపులు నిర్వహించాలి. ఈ వర్క్‌షాపులు వారి వారి స్థాయిలో కర్తవ్యాల అమలు కోసం ప్లానింగు, అమలు గురించి చర్చించాలి. ఉదాహరణకు మధ్యంతర కమిటీ సభ్యులు శాఖల పనిపైన, స్థానిక సమస్యలపై పోరాటాలు చేపట్టడంపైన, నిధి వసూళ్లపైన, స్థానిక పరిస్థితులను అధ్యయనం చేయడం పైన, పార్టీ సభ్యుల చురుకుదనాన్ని పెంచడం పైన, ప్రజాసంఘాల పునాది శాఖలను బలోపేతం చేయడంపైన శిక్షణ అందించాలి.

## రాష్ట్రాల మహాసభల అనుభవం

మొత్తంగా చూసినపుడు రాష్ట్రాల మహాసభల్లో చర్చల స్థాయి, రాజకీయ, నిర్మాణ స్థాయి కూడ పెరిగాయి. కేరళ ఈ విషయంలో గుర్తించదగిన స్థాయిలో ఉంది. ఆ రాష్ట్రంలో 38,426 శాఖా మహాసభలు, ఆ తర్వాత స్థానిక, ఏరియా, రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ మహాసభల్లో ఉన్నత స్థాయి రాజకీయపరమైన, నిర్మాణ పరమైన ఐక్యత వ్యక్తమయింది. పశ్చిమ బెంగాల్ మహాసభలు అన్ని స్థాయిల్లోను పెరిగిన నిర్మాణ కృషిని ప్రతిబింబించాయి, రాజకీయ దిశ గురించి మరింత స్పష్టత

వ్యక్తమయింది. త్రిపురలో గతంలో మహాసభలు జరుపుకోలేని ప్రాంతాల్లో సైతం శాఖా మహాసభలు, స్థానిక మహాసభలు జరిగాయి, సభ్యులు/ ప్రతినిధులు అధికంగా పాల్గొన్నారు. సవాళ్లను ఎదుర్కోగలగడంలో అధిక విశ్వాసం రాష్ట్ర మహాసభల్లో వ్యక్తమయింది.

ఇతర అన్ని రాష్ట్రాల మహాసభల్లోను స్థూలంగా సానుకూల అంశాలు వ్యక్తమయ్యాయి.

అయితే, కొన్ని రాష్ట్రాలలో కొన్ని బలహీనతలు కూడ గుర్తించబడినాయి. హిందీ భాషా రాష్ట్రాల మహాసభల చర్చలు మొత్తం మీద ఆరెస్సెస్, బిజెపి, హిందూత్వ శక్తులు ప్రజల మీద, వారి చైతన్యం మీద ఎంతగా ప్రభావం చూపిస్తున్నాయో తగినంతగా గుర్తించ లేదు. సాధారణ పరిభాషలో తప్ప, నిర్దిష్టంగా ఈ శక్తులు వివిధరంగాలలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్న దానిపై సవివరమైన చర్చ జరగలేదు. ఈ ప్రాంతంలో మన పార్టీకి ప్రజలతో సంబంధాలు ఎంత బలహీనంగా ఉన్నాయో, అభివృద్ధి నిరోధక మతోన్మాద శక్తుల విజృంభణను ఎదుర్కోవడంలో మన అశక్తతను ఇది వ్యక్తం చేస్తున్నది. అందుచేత, పార్టీ కేంద్రం, పొలిట్ బ్యూరో ఈ అంశంపై దృష్టి సారించేందుకు చర్చాగోష్టులు, వర్క్ షాపులు నిర్వహించాలి. మన రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ కార్యకలాపాలకు దిశానిర్దేశం చేయాలి.

తెలంగాణ రాష్ట్ర మహాసభలో కొన్ని అనారోగ్యకర ధోరణులు వ్యక్తమయ్యాయి. పార్టీ మహాసభ తర్వాత ఆ సమస్యను చేపట్టడం జరుగుతుంది.

తమిళనాడులో రాష్ట్ర మహాసభ మంచిగా జరిగింది. కాని కొత్తగా ఎన్నికయిన 41 జిల్లా కమిటీలకు గాను 17 జిల్లా కమిటీలలో కార్యదర్శి పదవి కోసం పోటీలు జరిగాయి. సమిష్టి పని విధానంలోను, నాయకత్వ టీంను అభివృద్ధి చేయడం లోను ఏమైనా బలహీనతలు ఉన్నాయేమో పరిశీలించి తగు నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## దిద్దుబాటు ఉద్యమం గురించి

పార్టీలో పైనుండి, క్రిందివరకు కొన్ని అన్యవర్గ ధోరణులు వెల్లడవుతున్న మూలంగా దిద్దుబాటు ఉద్యమాన్ని 'నిరంతర ప్రక్రియ'గా కొనసాగించాలని 23వ మహాసభ పిలుపు ఇచ్చింది.

23వ మహాసభ ఇచ్చిన ఆదేశానికి అనుగుణంగా పార్టీ కేంద్ర కమిటీ మూడు ప్రధాన అంశాలతో దిద్దుబాటు ఉద్యమాన్ని నిర్వహించాలని పిలుపు నిచ్చింది.

1. కేంద్రీకృత ప్రజాస్వామ్యం ఆధారంగా పార్టీ కమిటీల పనిని మెరుగుపరచడం.
2. వ్యక్తిగతంగాను, కుటుంబపరంగాను, సామాజికంగాను అభ్యుదయ, కమ్యూనిస్టు విలువలను పాటించడం,
3. నిధుల నిర్వహణ, అవినీతి పద్ధతులను నిర్మూలించడం.

పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్రకమిటీ సభ్యులందరూ తమ గురించిన తమ అంచనాలను నివేదించారు. వాటి ఆధారంగా తయారు చేసిన నివేదికను కేంద్రకమిటీ చర్చించింది. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలు ఎలా జరుగుతున్నదో కేంద్రకమిటీ ఆత్మవిమర్శనా పూర్వకంగా చర్చించి, పనితీరును మెరుగు పరుచుకోవలసిన అవసరం ఉందని గుర్తించింది. దాని ఆధారంగా ఒక పత్రాన్ని తయారు చేసి దిద్దుబాటు ఉద్యమాన్ని చేపట్టేందుకు రాష్ట్ర కమిటీలకు పంపించింది.

చాల రాష్ట్ర కమిటీలు ఆ పత్రాన్ని చర్చించి, తమ చర్చల ఆధారంగా ఆ పత్రాన్ని మరింత బలోపేతం చేశాయి. పార్టీలోను, కేడరులోను మతపరమైన, విజ్ఞాన శాస్త్ర విరుద్ధమైన, కాలం చెల్లిన భావాలు పెరిగిపోతున్నాయని చాలా రాష్ట్ర కమిటీలు ఆత్మవిమర్శ చేసుకున్నాయి. గృహ హింస, కట్నం కోరడం, ఇంకా ఇతర పితృస్వామ్య అవలక్షణాలు జిల్లా స్థాయి, అంతకు దిగువ నాయకత్వం కొందరిలో కొనసాగుతున్న సందర్భాలున్నాయని తమిళనాడు నివేదిక తెలియచేసింది. అవినీతి ప్రధాన సమస్యగా ఉన్నట్లు తెలంగాణ నివేదిక తెలియచేసింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనల పట్ల ఉదాసీన వైఖరితో ఉంటున్నట్లు అస్సాం కమిటీ నివేదిక తెలియచేసింది. తెలంగాణ లాంటి కొన్ని రాష్ట్రాల తమ నివేదికల్లో దిద్దుబాటు ఉద్యమం గురించి, దాని ప్రభావం గురించి ప్రస్తావన కూడ చేయలేదు.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలులో బలహీనత వ్యక్తమవుతున్నదని పశ్చిమ బెంగాల్ నివేదిక తెలియచేసింది. అస్సాం, ఒరిస్సా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలు కూడ ఈ బలహీనత తమలో కొనసాగుతున్నదని తెలిపాయి.

దిద్దుబాటు ఉద్యమాన్ని కొనసాగించినప్పటికీ ఇంకా కొన్ని బలహీనతలు కొనసాగుతున్నాయని త్రిపుర నివేదిక తెలిపింది. ఇంకా చాల ఇతర రాష్ట్రాలు కూడ

ఈ లోపాన్ని గుర్తించాయి. ఇదంతా కూడ మరింత అప్రమత్తంగా ఉండి, ఇలాంటి ధోరణులను ప్రతిఘటించాల్సిన అవసరాన్ని తెలియచేస్తున్నది.

అన్ని రాష్ట్రాలు దిద్దుబాటు ఉద్యమాన్ని జిల్లా స్థాయి వరకు తీసుకు వెళ్ళాలని కేంద్రకమిటీ నిర్ణయించింది. కాని చాల రాష్ట్రాలలో దిద్దుబాటు ఉద్యమాన్ని అన్ని జిల్లాల స్థాయి వరకు తీసుకు వెళ్ళలేకపోయాయి. దిద్దుబాటు ఉద్యమ సందర్భంగా ఇది కూడ ఒక ప్రధాన బలహీనతగా వ్యక్తమయింది.

## పొలిట్‌బ్యూరో, పార్టీ కేంద్రం

పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కాకుండా ఇంకా 9మంది పొలిట్ బ్యూరో సభ్యులు కేంద్రం నుండి పూర్తి కాలం పనిచేశారు. 1. ప్రకాష్ కరత్, 2. బృందా కరత్, 3. ఎంఏ బేబీ, 4. సుభాషిణి ఆలీ, 5. బివి రాఘవులు, 6. తపన్ సేన్, 7. నీలోత్పల్ బాసు, 8. విజయ రాఘవన్, 9. అశోక్ ధావలె.

2024 సెప్టెంబరులో ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూశారు. ప్రకాష్ కరత్ పొలిట్ బ్యూరో సమన్వయ కర్తగా నియమించబడ్డారు. కేరళ రాష్ట్రకమిటీ కార్యదర్శి కొడియరి బాలకృష్ణన్ కన్నుమూశారు. 2023లో ఆయన స్థానంలోకి ఎంవి గోవిందన్ నాయర్ ను పొలిట్‌బ్యూరోకు తీసుకోవడం జరిగింది.

## కేంద్రంలోని పొలిట్‌బ్యూరో సభ్యుల పని, బాధ్యతలు

ప్రధాన కార్యదర్శి మొత్తం సమన్వయానికి కేంద్ర కార్యవర్గానికి బాధ్యులుగాను, మార్క్సిస్టు ఎడిటర్‌గాను, సైన్స్ ఫ్రాక్షన్‌కు, ఐటి, ఫ్రీ సాఫ్ట్ వేర్ ఇన్‌చార్జి గాను ఉన్నారు. ప్రకాష్ కరత్ నిర్మాణ సబ్‌కమిటీకి కన్వీనర్‌గాను, పీపుల్స్ డెమోక్రసీ ఎడిటర్‌గాను, హిస్టరీ కమిషన్‌కు కన్వీనర్‌గాను ఉన్నారు. బృందా కరత్, మహిళా సబ్‌కమిటీకి, ట్రైబల్ ఫ్రాక్షన్ కమిటీకి కన్వీనర్‌గాను, సోషల్ మీడియాకు ఇన్‌చార్జిగాను ఉన్నారు. ఎంఏ బేబీ, అంతర్జాతీయ విభాగానికి, కల్చరల్ ఫ్రాక్షన్‌కు, బాలల సంఘానికి ఇన్‌చార్జిగా ఉన్నారు. సుభాషిణీ ఆలీ, యాజిట్ ప్రోప్ విభాగానికి, ముస్లిం మైనారిటీ వ్యవహారాల ఆందోళన ప్రచార కమిటీకి కన్వీనర్‌గాను, లేఖక్ సంఘ్ ఫ్రాక్షన్ కమిటీకి ఇన్‌చార్జిగాను ఉన్నారు. బివి రాఘవులు, ఎడ్యుకేషన్ సబ్‌కమిటీకి కన్వీనర్‌గాను, అర్బన్ వ్యవహారాల కమిటీకి, సూర్జిత్ భవన్‌కు ఇన్‌చార్జిగాను ఉన్నారు. తపన్ సేన్,

టియు ఫ్రంటుకు ప్రధాన కార్యదర్శిగాను, టియు సబ్‌కమిటీకి కన్వీనర్‌గాను ఉన్నారు. నీలోత్పల్ బాసు, విద్యార్థి, యువజన జాయింట్ కమిటీకి కన్వీనర్‌గాను, కాలేజీ, యూనివర్శిటీ టీచర్ల ఫ్రాక్షన్‌కు, యూనివర్శిటీ ఎంప్లాయీస్ ఫ్రాక్షన్‌కు, స్కూల్ టీచర్ల ఫ్రాక్షన్‌కు, ఎడ్యుకేషన్ పాలసీ కమిటీకి ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎ విజయ రాఘవన్, వ్యవసాయ కార్మిక ఫ్రంట్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. అశోక్ థావలె, కిసాన్ ఫ్రంట్‌కు అధ్యక్షునిగాను, వ్యవసాయ సబ్‌కమిటీకి కన్వీనర్‌గాను, ఎడ్యుకేషన్ సబ్‌కమిటీలోను, యాజిట్ ప్రాప్ విభాగంలోను సభ్యునిగా ఉన్నారు.

కేంద్రం నుండి పూర్తి కాలం పనిచేసే పొలిట్ బ్యూరో సభ్యులు కాకుండా, మిగతా పొలిట్ బ్యూరో సభ్యుల బాధ్యతలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. సూర్య కాంత మిశ్రా, ఒరిస్సా రాష్ట్రకమిటీకి ఇన్‌చార్జిగా ఉన్నారు. మహమ్మద్ సలీం, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. మాణిక్ సర్కార్, త్రిపురపై కేంద్రీకరిస్తూ, అస్సాం రాష్ట్ర కమిటీకి పొలిట్‌బ్యూరో ఇన్‌చార్జిగా ఉన్నారు. పినరయ్ విజయన్, కేరళ ముఖ్యమంత్రిగా ఉంటూ, కేరళపై కేంద్రీకరిస్తున్నారు. జి రామకృష్ణన్, తమిళనాడుపై కేంద్రీకరిస్తూ, లాయర్స్ యూనియన్‌కు ఇన్‌చార్జిగాను, అండమాన్, నికోబార్, పుదుచ్చేరి రాష్ట్రాల ఆర్గనైజింగ్ కమిటీలకు పొలిట్ బ్యూరో ఇన్‌చార్జిగాను ఉంటున్నారు. ఎంవి గోవిందన్, కేరళ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా ఉంటున్నారు. రామచంద్ర డోమ్, పశ్చిమ బెంగాల్‌పై కేంద్రీకరిస్తూ, దళిత వ్యవహారాల కమిటీకి, పబ్లిక్ హెల్త్ కమిటీకి కన్వీనర్‌గా ఉన్నారు.

## రాష్ట్రాల బాధ్యతలు

ఆంధ్రప్రదేశ్: బివి. రాఘవులు, ఎంఎ. బేబి, బీహార్: ఆశోక్ థావలె, ఎ. విజయ రాఘవన్, జార్ఖండ్: బృందా కరత్, రామచంద్ర డోమ్, మహారాష్ట్ర: నీలోత్పల్ బాసు, అశోక్ థావలె, ఉత్తరప్రదేశ్: సుభాషిణి ఆలి, విక్రమ సింగ్, కర్నాటక: ఎంఎ. బేబి, బివి. రాఘవులు, పంజాబ్: నీలోత్పల్ బాసు, మధ్యప్రదేశ్: సుభాషిణి ఆలి, అరుణ్ కుమార్, గుజరాత్: అశోక్ థావలె, మురళీధరన్, హర్యానా: నీలోత్పల్ బాసు, కె. హేమలత, రాజస్థాన్: బృందా కరత్, విజూ కృష్ణన్, తమిళనాడు: ప్రకాష్ కరత్, జి. రామకృష్ణన్, తెలంగాణ: బివి. రాఘవులు, ఎ. విజయరాఘవన్, ఢిల్లీ: బృందా

కరత్, సిక్కిం: పశ్చిమ బెంగాల్ రాష్ట్రకమిటీ, గోవా: వివేక్ మాటెరియో, చత్తీస్‌ఘర్: జోగీందర్ శర్మ, ఉత్తరాఖండ్: విజూ కృష్ణన్, హిమాచల్ ప్రదేశ్: ఎ. విజయరాఘవన్, తపన్ సేన్, మణిపూర్: సుప్రకాష్ తాలుక్‌దార్, జమ్ము కాశ్మీర్: సీతారాం ఏచూరి, అండమాన్ అండ్ నికోబార్: జి. రామకృష్ణన్, సుజన్ చక్రవర్తి, లక్షద్వీప్: కేరళ రాష్ట్రకమిటీ.

## పొలిట్ బ్యూరో పని

23వ మహాసభ నుండి పొలిట్ బ్యూరో మరింత సమన్వయంతో పనిచేసింది. ఒక ఆన్‌లైన్ సమావేశంతో సహా, మొత్తం 18 సార్లు అది సమావేశమయింది. ఆ రకంగా రెండు మాసాల కొక సమావేశం పద్ధతి పాటించబడింది. అందుబాటులో ఉన్న పిబి సభ్యుల రోజువారీ సమావేశాలు కొనసాగాయి. ఈ రోజువారీ సమావేశాలు రాజకీయపరిణామాలను గమనిస్తూ, ప్రకటనలు జారీ చేస్తున్నాయి, తక్షణ సమస్యలను ప్రత్యేకించి రాష్ట్రాలకు సంబంధించిన, ప్రజాసంఘాలకు సంబంధించిన సమస్యలను చర్చించేవి. అయినప్పటికీ సబ్ కమిటీ రిపోర్టులు, ఇంకా ఇతర అంశాలు చర్చించడానికి, కేంద్రంలోని పిబి సభ్యుల పూర్తి స్థాయి సమావేశాలు రెండు మాసాల కొకసారి జరపాలన్న నిర్ణయం పూర్తిగా అమలు జరగలేదు. దాన్ని సరిచేసుకోవాలి.

23వ మహాసభ రాజకీయ, నిర్మాణ నివేదిక ఆధారంగా కేంద్రకమిటీ తయారు చేసిన పనుల జాబితా అమలును పొలిట్ బ్యూరో, పార్టీ కేంద్రం చేపట్టాయి. కేంద్రం పరిధిలో చేపట్టిన కర్తవ్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: సూర్జిత్ భవన్‌లో రెగ్యులర్ సెంట్రల్ స్కూళ్ళను నడపడం, పార్టీ ఎడ్యుకేషన్ కోసం ఆరెస్సెస్ మీద నోట్ తయారు చేయడం, హోల్‌టైమర్ల పాలసీ కోసం మార్గదర్శకాలను తయారు చేయడం, హిందీ రాష్ట్రాల కార్యదర్శుల సమావేశాలను రెగ్యులర్‌గా నిర్వహించడం, బాలసంఘంపై కేంద్ర వర్క్‌షాప్ నిర్వహించి, దాన్ని ఫాలోఅప్ చేయడం, సోషల్ మీడియాపై వర్క్‌షాప్‌ను నిర్వహించడం, కొన్ని సాంస్కృతిక కార్యకలాపాలపై వర్క్‌షాప్‌ను నిర్వహించడం. అంతేకాకుండా, ట్రేడ్ యూనియన్, యువజన, వ్యవసాయ కార్మిక రంగాలపై సమీక్షానివేదికలు తయారు చేసి, కేంద్రకమిటీ ముందు పెట్టింది.

సబ్ కమిటీలు, అంతర్జాతీయ వ్యవహారాలు, యాజిట్‌ప్రాప్, పార్టీ ఎడ్యుకేషన్ తో సహా వివిధ విభాగాలు సాఫీగా పనిచేయడానికి కేంద్రంలో పది మంది పొలిట్ బ్యూరో సభ్యులు ఉండటం దోహదపడింది.

టియు, వ్యవసాయ సబ్‌కమిటీల జాయింట్ సమావేశం 2023 ఆగస్టులో ఏర్పాటుకు పిబి చొరవ తీసుకుంది. వామపక్షాలను తిరిగి సమావేశపరచడానికి, సిపిఐతో సంప్రతింపులు జరపడానికి, రెండు ఉమ్మడి కార్యక్రమాలను నిర్వహించడానికి పిబి చర్యలు తీసుకుంది.

ప్రధానమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నపుడు పార్టీ కేంద్రం జోక్యం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చత్తీస్‌ఘర్, పంజాబు లాంటి రాష్ట్రాలలో సమస్యలు తలెత్తినపుడు పిబి జోక్యం చేసుకుంది. ఒక పిబి బృందం ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణ సమస్యను పరిశీలించింది. మరొక కమిటీ పంజాబులో సమస్యలను పరిశీలించింది. ఈ రెండు కమిటీలు నివేదికలు సమర్పించి, పరిష్కారాలను సూచించాయి. తెలంగాణాలో ఎన్నికల సమయంలో బూర్జువా పార్టీల నుండి డబ్బు తీసుకోవడం పైన, దీని పట్ల రాష్ట్రకమిటీ ఉదారంతో వ్యవహరించడం గురించి పిబి జోక్యం చేసుకొని ఒక లేఖ రాసింది.

అయినప్పటికీ రాష్ట్రాల స్థాయిలో చేపట్టవలసిన కర్తవ్యాలను అమలు చేయడంలో తగినంతగా జోక్యం చేసుకొని అవి అమలయ్యేలా చూడటంలో పిబి విఫలమయిందని ఆత్మవిమర్శనా పూర్వకంగా అంగీకరించింది. రాష్ట్రాలకు ఇన్‌చార్జిలుగా ఉన్న పిబి సభ్యులు, సిసి సభ్యులు రాష్ట్రాలకు వెళ్లి సిసి నిర్ణయాలను వివరించడం జరిగింది కాని, నిర్దిష్టంగా వాటి అమలు ఎలా జరుగుతున్నదో పర్యవేక్షించడం మాత్రం చేయలేకపోయారు. ఉదాహరణకు, సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో ఏ మేరకు ఐదు ప్రమాణాలు అనుసరించబడుతున్నాయి, రాష్ట్ర కమిటీలు గ్రామీణ శ్రామికుల సర్వేను నిర్వహించాయా అని పరిశీలించడం, అలాగే పట్టణ ప్రాంతాల సర్వే అమలు కూడ జరిగిందా అన్న విషయాలను పట్టించుకోలేదు.

ఇక మీదట పొలిట్ బ్యూరో సభ్యుల పని పార్టీ మహాసభ నిర్దేశించిన ప్రాధాన్యతలకు మరింత సన్నిహితంగా ఉండాలి. పిబి సభ్యుల సామర్థ్యాన్ని, జవాబుదారీ తనాన్ని మెరుగుపరిచేందుకు మొత్తంగా పిబి పని గురించి, వ్యక్తిగతంగా పిబి సభ్యుల పనిగురించి వార్షిక సమీక్షలు జరగాలి.

**సెంట్రల్ సెక్రటేరియట్:** ఆరుగురు సభ్యులతో సెంట్రల్ సెక్రటేరియట్ ఏర్పాటయింది. దీనిలో సీతారాం ఏచూరి, జోగేందర్ శర్మ, రాజేందర్ శర్మ, అరుణ్ కుమార్, మురళీధరన్, విజూ కృష్ణన్ సభ్యులుగా ఉన్నారు.

మురళీధరన్ కేంద్రకమిటీ కార్యాలయ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన అంగవికలుర వ్యవహారాల కమిటీ కన్వీనర్‌గా అంగవికలుర వేదిక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సెంట్రల్ ఐసి సభ్యునిగా కూడ ఉన్నారు. జోగేందర్ శర్మ, అంతర్జాతీయ విభాగం సభ్యునిగా ఉన్నారు. రాజేందర్ శర్మ, లోక్‌లహర్ ఎడిటర్‌గా, యాజిట్ ప్రాప్ విభాగం సభ్యునిగా ఉన్నారు. అరుణ్ కుమార్, శాంతి సంఘం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అంతర్జాతీయ విభాగంలో సభ్యునిగా ఎడ్యుకేషన్ సబ్‌కమిటీలోను, పట్టణ వ్యవహారాల కమిటీలోను సభ్యునిగా ఉన్నారు. విజూకృష్ణన్, కిసాన్ సభ ప్రదాన కార్యదర్శిగా ఉన్నారు.

పార్టీ కేంద్రం, దాని వివిధ విభాగాలలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సరిచేయడానికి సెంట్రల్ సెక్రటేరియట్ పూనుకుంది. పిబి/సిసి ఇచ్చిన పిలుపులపైన, ఇతర నిర్మాణపరమైన సమస్యలపైన తీసుకున్న నిర్ణయాలపై ఫాలోఅప్ చేసింది. అయినప్పటికీ సెక్రటేరియట్ పని మెరుగుదలకు ఇంకా చాలా అవకాశం ఉంది. ఒక యూనిట్‌గా సెక్రటేరియట్‌ను బలోపేతం చేయడానికి పిబి తీసుకున్న నిర్ణయాలపై రిపోర్టింగ్ ఉండాలని, ప్రతి సమావేశంలోను దానిపై చర్చ ఉండాలని నిర్ణయించబడింది.

పార్టీ కేంద్రంలో రాజకీయ, నిర్మాణపరమైన పనిలో సెక్రటేరియట్‌ను కలుపుకు పోవడం కోసం మరింత కృషి జరగాలి. సెక్రటేరియట్ పొందిక రాజకీయ, నిర్మాణ కర్తవ్యాల అమలుకు అనుగుణంగా ఉండాలి.

దీంతో పాటు కేంద్ర కమిటీ కార్యాలయం పనిని ప్రస్తుత ఉద్యమ అవసరాలకు అనుగుణంగా సరిచేసుకోవాలి.

కేంద్రంలోని ఇతర సిసి సభ్యులు: కేంద్రంలో ఇంకా 9 మంది సిసి సభ్యులు ఉన్నారు. వారు: కె. హేమలత, స్వదేశ్ దేవ్‌రాయ్, ఎఆర్. సింధు, ఎస్. పుణ్యవతి, మరియం థావలె, కెఎన్. ఉమేష్, ఆర్. కరుములయన్, బి. వెంకట్, విక్రమ్ సింగ్. వీరంతా కేంద్రం నుండి పనిచేస్తున్నారు.

కె. హేమలత, స్వదేశ్ దేవ్‌రాయ్, ఏఆర్. సింధు, ఆర్. కురుమలయన్ టియు కేంద్రంలో పనిచేస్తున్నారు. కె. హేమలత, టియు ఫ్రంట్ అధ్యక్షులుగాను, ఎడ్యుకేషన్ సబ్‌కమిటీలో, ఏజిట్ ప్రాప్ విభాగంలో సభ్యురాలిగాను ఉన్నారు. ఎస్. పుణ్యవతి, మరియం థావలె మహిళాసంఘ కేంద్రం నుండి పనిచేస్తున్నారు. మరియం

థావలె మహిళా ఫ్రంట్ ప్రదాన కార్యదర్శిగాను, కేంద్ర ఐసి కన్వీనర్‌గాను ఉన్నారు. ఎ. ఆర్ సింధు, విక్రమ్ సింగ్ సెంట్రల్ ఐసి సభ్యులుగా ఉన్నారు. బి. వెంకట్ ప్రదాన కార్యదర్శిగా, విక్రమ్ సింగ్ వ్యవసాయ కార్మిక సంఘం కేంద్రంలో పనిచేస్తున్నారు. కేంద్రం నుండి పనిచేసే సిసి సభ్యులు కాకుండా, మిగతా సిసి సభ్యులందరూ వారి వారి రాష్ట్రాలపై కేంద్రీకరిస్తున్నారు.

## సెంట్రల్ కమిటీ పని

ఒక ఆన్‌లైన్ మీటింగ్‌తో సహా మొత్తం 14 సార్లు కేంద్ర కమిటీ సమావేశమయింది. ఈ రకంగా సిసి ప్రతి రెండున్నర నెలల కొకసారి సమావేశమయింది. రాజకీయ పరిణామాలపై రెగ్యులర్ చర్చతో పాటు, కేంద్ర కమిటీ 23వ మహాసభ నిర్దేశించన కర్తవ్యాల అమలుపై కూడ కేంద్రీకరించింది. ఒక సమావేశం పూర్తిగా దిద్దుబాటు ఉద్యమంపైనే చర్చించింది.

ప్రజాసంఘాల పనిని క్రమానుగతంగా సమీక్షించాలన్న 23వ మహాసభ నిర్ణయానికి అనుగుణంగా కేంద్ర కమిటీ టియు, యువజన, వ్యవసాయ కార్మిక రంగాల పనిని సమీక్షించింది.

కిసాన్ రంగ సమీక్ష సీతారాం ఏచూరి అకాల మరణం వల్ల పూర్తిచేయ లేకపోయాం.

సిసి అజమాయిషీలో 73 మంది సభ్యులతో 13 పార్టీ శాఖలు పనిచేస్తున్నాయి.

కేంద్ర కమిటీ చర్చల అజెండా, చర్చించే పద్ధతి మారాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం సిసి మీటింగుల్లో రాజకీయ పరిణామాలపై నివేదిక, దానిపై సాధారణ చర్చ ప్రధాన ఎజెండాగా కొనసాగుతున్నది. దానికే సమావేశం టైం ఎక్కువగా వినియోగించబడుతున్నది. మిగిలిన సమయం అంతా ఇతర ఉప సమస్యల చర్చకే సరిపోతున్నది. నిర్మాణ పనిని చర్చించడానికి, పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించడానికి తగినంత సమయం మిగలడం లేదు. ప్రజాసంఘాల పనిని క్రమానుగతంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎజెండాను, చర్చల కోసం సమయాన్ని తగువిధంగా మార్పుచేసుకోవాలి.

## హిందీ భాషా రాష్ట్రాలు

ఈ కాలంలో హిందీభాషా రాష్ట్రాల కార్యదర్శుల సమావేశాలు మూడు జరిగాయి.

పార్టీ మహాసభ తర్వాత అగస్టు 2022లో మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ మహాసభ కర్తవ్యాల అమలు గురించి చర్చించడం జరిగింది. దీంతో పాటు ఆ ప్రాంతంలో విద్యార్థి ఫ్రంట్ గురించి ప్రత్యేక చర్చ జరిగింది.

రెండవ సమావేశం మార్చి 2023లో జరిగింది. ఈ సమావేశంలో మహాసభ కర్తవ్యాల అమలు గురించి చర్చించడం జరిగింది. దీంతో పాటు ఆ ప్రాంతంలో హిందూత్వ, మతోన్మాద శక్తులను ఎదుర్కోవడానికి మన కార్యకలాపాల ప్రణాళిక గురించి చర్చ జరిగింది. ఈ ప్రాంతంలో దిద్దుబాటు ఉద్యమం అమలు గురించి, లోక్‌లహర్ సర్క్యులేషన్ గురించి కూడ చర్చ జరిగింది.

సెప్టెంబరు 2023లో మూడవ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హోల్ టైమర్ల పరిస్థితి గురించి కేంద్రం నుండి పంపిన ప్రశ్నావళికి ఈ రాష్ట్రాల నుండి వచ్చిన సమాధానాలపై చర్చ జరిగింది. కేంద్రం నుండి హోల్ టైమర్ల కోసం వచ్చిన నిధుల వినియోగం గురించి, గిరిజన ప్రాంతాలలో ఉద్యమ విస్తరణ గురించి కూడ చర్చ జరిగింది.

నేడు హిందూత్వ మతోన్మాద శక్తుల నుండి ఎదురవుతున్న ప్రమాదం దృష్ట్యా హిందీ భాషా రాష్ట్రాలలో ఉద్యమ విస్తరణ అధిక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ రాష్ట్ర కమిటీలు కేంద్రం సహాయంతో ఉద్యమాన్ని కొత్త ప్రాంతాలకు, కొత్త సెక్షన్లలోకి విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ ప్రణాళికలను సాకారం చేయడానికి ఆలిండియా కేంద్రంలోని పార్టీ, ప్రజా సంఘాలు అన్ని విధాల సహాయం అందించాలి.

## సబ్ కమిటీలు

కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ క్రింది సబ్ కమిటీలు పనిచేస్తున్నాయి. 1. నిర్మాణ సబ్ కమిటీ, 2. ట్రేడ్ యూనియన్ సబ్ కమిటీ, 3. వ్యవసాయరంగ సబ్ కమిటీ, 4. మహిళా సబ్ కమిటీ, 5. ఎడ్యుకేషన్ సబ్ కమిటీ. ఇవి కాకుండా, ఫైనాన్స్ సబ్ కమిటీ వేరుగా ఉంది, వీటితో పాటు, అంతర్జాతీయ విభాగం, ఏజిట్

ప్రాప్ విభాగం ఉన్నాయి. హిస్టరీ కమిషన్, పట్టణ ప్రాంతాల వ్యవహారాల కమిటీ ఉన్నాయి.

## నిర్మాణ సబ్ కమిటీ

నిర్మాణ సబ్ కమిటీలో ఆరుగురు పిబిఎం లు, ఇద్దరు సిసిఎంలు ఉన్నారు. 23వ మహాసభ తర్వాత మూడు సార్లు సమావేశమయింది. వార్షిక పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ గురించి ఈ సబ్ కమిటీ నోట్ తయారు చేసింది. 2022 పునరుద్ధరణ గురించి స్క్రూటిని నివేదికను సమర్పించింది. హోల్ టైమర్లకు సంబంధించి మార్గదర్శకాలను తయారు చేసింది. దాన్ని పొలిట్ బ్యూరో ఆమోదించింది. ఈ రెగ్యులర్ మీటింగులు మరింతగా జరగాల్సిన అవసరం ఉంది.

## పార్టీ ఎడ్యుకేషన్

పార్టీ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ ఏడు సార్లు సమావేశమయింది. ఒక ప్రామాణికమైన సిలబస్‌ను రూపొందించింది. ఏడు సబ్జక్టులకు సంబంధించి 22 అంశాలపై నోట్స్ తయారు చేయబడింది. దాన్ని ఇఎంఎస్ అకాడమీ, తిరువనంతపురం, సూర్జిత్ భవన్, న్యూఢిల్లీలో జరిగిన టీచర్ ట్రైనింగ్ క్లాసుల్లో ఉపయోగించడం జరిగింది. 2022 అక్టోబరులో జరిగిన ఈ క్లాసులకు 319 మంంది కామ్రేడ్స్ హాజరయ్యారు.

తర్వాత కొద్ది మార్పులతో ఇలాంటి క్లాసులు హిందీ భాషా రాష్ట్రాలకు ప్రత్యేకంగా నిర్వహించబడినాయి. వీటిలో 92 మంది కామ్రేడ్స్ పాల్గొన్నారు.

ఈ స్కూళ్లు ఎలాంటి ఫలితాల్ని ఇచ్చాయో సానుకూలంగా సమీక్షించబడింది. క్లాసుల్లోని చర్చల్లో వచ్చిన అంశాలతో నోట్స్ ఫైనల్ చేయబడింది. చాలా రాష్ట్ర కమిటీలు వారి వారి రాష్ట్రాలలో వినియోగించుకునేందుకు ఈ నోట్స్‌ను అనువదించుకున్నాయి. ఆరెస్సెస్ స్వరూపం, దాని ప్రమాదం గురించి కూడ ఒక ప్రత్యేక నోట్స్ తయారు చేయబడింది. అది విస్తృతంగా అనువదించబడింది. అయితే ఆయా రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిటీలు తగినంతగా అధ్యయనం చేయకపోవడం మూలంగా ఆ ప్రాంతాలలో ఆరెస్సెస్ కార్యకలాపాలలో ఉండే వ్యత్యాసాలు గుర్తించడం ఒక సవాలుగా మిగిలి పోయింది.

23వ పార్టీ మహాసభ నిర్ణయానికి అనుగుణంగా పార్టీ సెంట్రల్ పర్మినెంట్ స్కూలు సూర్జిత్ భవన్, ఢిల్లీలో ప్రారంభమయి పార్టీ ఎడ్యుకేషన్ కోసం వినియోగించుకో బడుతున్నది. మహిళలు, విద్యార్థులు, రైతు, వ్యవసాయ కార్మికులు, దళిత వేదికలపై పనిచేసే కార్యకర్తలు, వివిధ ట్రేడ్‌యూనియన్ల ఫ్రాక్షన్లలో పనిచేసే వారి కోసం టీచర్ ట్రైనింగ్ క్లాసులు నిర్వహించబడినాయి. సైన్సు, కల్చరు, పట్టణ వ్యవహారాలలో పనిచేసే వారికోసం మూడు రోజుల స్కూల్ కం వర్క్‌షాపులు కేంద్ర స్థాయిలో మూడు నిర్వహించబడినాయి.

కీలకమైన ఐదు సబ్జక్టులతో పాటు ఆరెస్సెస్ గురించి కూడ పార్టీ సభ్యులందర్ని కవర్ చేసే విధంగా క్లాసులు నిర్వహించాలని అనుకున్నప్పటికీ, 50 శాతం మంది మాత్రమే కవర్ అయ్యారు. ఒక్క కేరళలో మాత్రమే సభ్యులందరూ కవర్ అయ్యారు. అందరు సభ్యులను  క్లాసుల్లో పాల్గొనేలా చేయవలసిన ప్రాధాన్యత ఇంకా మిగిలే ఉంది.

శాఖా కార్యదర్శులు, స్థానిక కమిటీల సభ్యులకు కేడర్ రాజకీయ క్లాసులు రాష్ట్రాలలో జరిగాయి. అయితే వీటికి హాజరు ఒకే మాదిరిగా లేదు. మరింత ధృఢంగా పనిచేయాల్సిన అవసరాన్ని ఇది తెలియ చేస్తున్నది. కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పెర్మనెంట్ స్కూళ్ళు నడుస్తున్నాయి. తమిళనాడు, అస్సాంలలో కొత్తగా ప్రారంభించేందుకు ప్రణాళికలు తయారవుతున్నాయి. పెర్మనెంట్ స్కూళ్ళు స్థాపించేందుకు, రెగ్యులర్‌గా రాజకీయ తరగతులు నిర్వహించేందుకు రాష్ట్రాలు ప్రోత్సహించబడుతున్నాయి.

## యాజిట్ ప్రాప్ (ఆందోళన, ప్రచార కమిటి)

23వ మహాసభ తర్వాత ఏర్పాటయిన యాజిట్ ప్రాప్ కమిటీ ప్రధానంగా ఆన్‌లైన్ మీటింగుల ద్వారానే సమావేశమయింది. 13 బుక్‌లెట్లను ప్రచురించింది. అవి: సావర్కర్ కా సచ్, ఉక్రెయిన్ మే అమెరికాకి లగాయి గయ్ ఆగ్ , భారత్ @ 75,  జబ్ కిసాన్ ఉత్ ఖడా హువా, బర్స్టింగ్ ఆదానీ బెలూన్, అదానీకా గుబ్బరా ఫూటా, ఎటాక్స్ ఆన్ క్రిస్టియన్ ట్రైబల్స్ ఇన్ చత్తీస్ ఘర్, చత్తీస్‌ఘర్ మే ఇసాయి ఆదివాసియోం పర్ హమ్లా, ఆరెస్సెస్ వా హిందూత్వవాది టకటోన్ కా ఖత్‌రా, ది డేంజర్ ఆఫ్ ఆరెస్సెస్ అండ్ హిందూత్వ ఫోర్సెస్, ఇజ్రాయల్స్ వార్ అగెయిన్స్ట్

పాలస్తీన్, ఫిలిస్టీన్ పర్ ఇజ్రాయల్ కా హమ్లా, సీతారాం ఏచూరి యాన్ ఔట్ స్టాండింగ్ కమ్యూనిస్ట్, సీతారాం ఏచూరి: అసాధారణ కమ్యూనిస్ట్, ప్రతి బుక్‌లెట్ డిజిటల్ కాపీ అన్ని రాష్ట్రాలకు అనువాదం కోసం పంపించబడింది.

వీటితో పాటు పార్టీ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 7 భాగాల సీరీస్ ప్రచురించబడింది. అలాగే ఆరెస్సెస్ ప్రమాదాలపై ఒక బుక్‌లెట్ ప్రచురించబడింది. గత లోక్ సభ ఎన్నికల సందర్భంగా, బిజెపి ప్రమాదాన్ని వివరించే ప్రసంగాల కోసం 18 రకాల టాకింగ్ పాయింట్స్ తయారు చేయబడ్డాయి. విద్య, వైద్యం, ఉపాథి, సైన్స్, పర్యావరణం అంశాలపై ఈ నోట్స్ ఉన్నాయి. ఈ నోట్స్ విస్తృతంగా ప్రత్యేకించి హిందీ భాషా రాష్ట్రాలలో వినియోగించుకోబడింది.

అమ్మకాలు పెరిగినప్పటికీ, బకాయిలు తగ్గినప్పటికీ ప్రింట్ సర్క్యులేషన్ గుర్తించదగినంతగా పెరగ లేదు. పంపిణీని మెరుగుపరచడం, రాష్ట్ర స్థాయి ప్రచురణల సమాచారాన్ని సేకరించడం ఒక సవాలుగానే ఉంది.

## పార్టీ డైలీలు, ప్రచురణలు

పార్టీ కేంద్రం నుండి మనం పీపుల్స్ డెమోక్రసీ, లోక్ లహర్‌లను రెగ్యులర్‌గా ప్రచురిస్తున్నాము. పీపుల్స్ డెమోక్రసీని ఢిల్లీ, కోల్‌కటా, కోచి, అగర్తలా, చెన్నైల నుండి ప్రచురిస్తున్నాము. విజయవాడ నుండి కూడ ప్రచురించాలని ఇటీవల నిర్ణయం తీసుకున్నాము. అయితే హైదరాబాదు నుండి ప్రచురణను పునరుద్ధరించాలన్న ప్రయత్నాలు మాత్రం సఫలీకృతం కాలేదు.

పదే పదే విజ్ఞప్తులు చేసినప్పటికీ పీపుల్స్ డెమోక్రసీ, లోక్‌లహర్ల సర్క్యులేషన్ అంతకంతకూ పడిపోతూనే ఉంది. 2022లో పీపుల్స్ డెమోక్రసీ సర్క్యులేషన్ 5,611, అది 2024కు 5,282కు పడిపోయింది. ఈ తరుగుదల మన ఉద్యమం బలంగా ఉన్న కేరళ, తమిళనాడుల్లోనే తీవ్రంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సర్క్యులేషన్ సహేతుకంగా పెరిగింది. పీపుల్స్ డెమోక్రసీకి 200 మంది ఆన్‌లైన్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. దీన్ని మరింతగా పెంచాలి.

లోక్‌లహర్ సర్క్యులేషన్ 2022లో 4,438 ఉంటే, 2024 నాటికి 3,288 కి పడిపోయింది. మన ఉద్యమం సాపేక్షంగా బలంగా ఉన్న రాజస్థాన్, బీహార్, హిమాచల్ ప్రదేశ్‌లలోనే తక్కువగా ఉంది.

పీపుల్స్ డెమోక్రసీ, లోక్ లహర్‌ల సర్క్యులేషన్ పెంచడానికి తీవ్రంగా కృషి జరగాలి. ప్రాంతీయ భాషల్లో డైలీ, వార, పక్ష, మాస పత్రికలు ప్రచురించడం పీపుల్స్ డెమోక్రసీ, లోక్ లహర్‌ల సర్క్యులేషన్ తగ్గడానికి కారణం కారాదు. మనం ప్రచురిస్తున్న డైలీల కంటెంట్‌కు, పీపుల్స్ డెమోక్రసీ, లోక్ లహర్‌ల కంటెంట్, ఉద్దేశాలకు చాల తేడా ఉందన్న అంశాన్ని పునరుద్ఘాటించవలసిన అవసరం ఉంది. పీపుల్స్ డెమోక్రసీలోని కొన్ని వ్యాసాలు, సంపాదకీయాలు అనువదించి డైలీలో ప్రచురిస్తున్నప్పటికీ, అది పీపుల్స్ డెమోక్రసీ, లోక్ లహర్‌లకు ప్రత్యామ్నాయం కాదు.

మన సైద్ధాంతిక పత్రిక మార్క్సిస్ట్ ప్రచురణను క్రమబద్ధం చేయాలి. ఈ కాలంలో 11 సంచికలు ప్రచురించబడినాయి.

బెంగాల్‌లో మార్క్సవాది పథ్, కేరళలో మార్క్సిస్ట్ సంవాదం, తెలుగులో మార్క్సిస్టు, తమిళనాడులో మార్క్సిస్టు సైద్ధాంతిక మాస పత్రికలు ప్రచురించ బడుతున్నాయి.

పార్టీ వివిధ రాష్ట్రాలలో ఆరు డైలీలు ప్రచురిస్తున్నది. దేశాభిమాని (కేరళ), గణశక్తి (బెంగాల్), దేశర్‌కథ (త్రిపుర), నవతెలంగాణ (తెలంగాణ), ప్రజాశక్తి (ఆంధ్ర ప్రదేశ్), తీకథీర్ (తమిళనాడు) ప్రచురించబడుతున్నాయి.

దేశాభిమాని మినహా, మిగతా అన్ని డైలీల సర్క్యులేషన్‌ను పెంచాల్సి ఉంది. ఈ కాలంలో తీకథీర్ సర్క్యులేషన్ పెరిగింది. కనీసం మన పార్టీ సభ్యులైనా మొత్తం మన డైలీల చందాదారులుగా లేరని రాష్ట్రాల నుండి వచ్చిన సమాచారం తెలియచేస్తున్నది. దాదాపు కేవలం పార్టీ సభ్యుల్లో మూడోవంతుమందికి మాత్రమే ఈడైలీలు అందుతున్నాయి. ఇది ఎంతగానో ఆందోళన చెందాల్సిన అంశం.

బెంగాల్, కేరళ, అస్సాం, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సాలలో పార్టీ వారపత్రికలు ప్రచురిస్తున్నది. ఈ పత్రికలు సైతం మన పార్టీ సభ్యులందరికీ అందడం లేదు. పార్టీ వివిధ రాష్ట్రాలలో 9 ప్రచురణాలయాలను నిర్వహిస్తున్నది.

క్వాలిటీ విషయంలో రాజీపడకుండానే మన పార్టీ ప్రచురణల కంటెంట్, భాష నేటి తరానికి చేరే విధంగా ఉండాలి. మన ప్రచురణల ఆన్‌లైన్ అందుబాటును పెంచాలి, బలోపేతం చేయాలి.

సర్క్యులేషన్ పెంచడానికి పార్టీ ప్రత్యేక క్యాంపెయిన్లను నిర్వహించడం మొత్తం పార్టీకి ఒక ప్రధాన కర్తవ్యంగా ఉండాలి.

## మీడియా

ఇటీవల కాలంలో మీడియా, కమ్యూనికేషన్ల పాత్ర విపరీతంగా పెరిగింది. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఇంటర్నెట్, టివి, సినిమా, వినోద సోషల్ మీడియా పరిశ్రమలను బడా కార్పొరేషన్లు, వాణిజ్య సంస్థలు అదుపు చేస్తున్నాయి. వాటిని అవి లాభదాయక సంస్థలుగాను, పాలక పార్టీ భావజాలాన్ని ప్రచారం చేసే సాధనాలుగాను వినియోగిస్తున్నాయి. అభివృద్ధి నిరోధక మీడియా పాత్రను తిప్పికొట్టడం విప్లవోద్యమానికి కీలకంగా మారింది.

ఈ సవాలును ఎదుర్కోవడానికి మన శక్తి సామర్థ్యాలను, వనరులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు, పద్ధతులు రూపొందించుకోవాలి. దీని కోసం నిపుణులతో ఒక మీడియా గ్రూపును వేసి, ప్రస్తుత మీడియా పరిస్థితిని వివరించమని, ఈ రంగంలో మనకు తగిన మార్గదర్శకాలు సూచించమని కోరాలి.

## సోషల్ మీడియా

గత పార్టీ మహాసభ 2022 నుండి సోషల్ మీడియా రంగంలో పార్టీ పాత్ర విస్తృతిలోను, కంటెంట్ రీత్యాను, క్వాలిటీ రీత్యాను గణనీయంగా పెరిగింది. రాష్ట్రాల నుండి రిపోర్టింగ్ మెరుగయింది. రాజకీయ, సామాజిక పరిణామాలపై సకాలంలో స్పందిస్తున్నది. చాల రాష్ట్రాలు సోషల్ మీడియా వేదికపై తమ ఉనికిని మెరుగు పరుచుకున్నాయి. మన సోషల్ మీడియా ప్రభావం ప్రత్యేకించి ఎన్నికల సమయంలో ఫ్రీక్వెన్సీ రీత్యాను, క్వాలిటీ రీత్యాను, అందుబాటు రీత్యాను పెరుగుతున్నది. ఈ మెరుగుదలలు ఉన్నప్పటికీ, మన సోషల్ మీడియా ఫాలోవర్ బేస్ ఈ మూడేళ్లలో స్వల్పంగా మాత్రమే పెరిగింది. గత పార్టీ మహాసభ నుండి మన సోషల్ మీడియా బేస్ ఎలా పెరిగిందీ ఈ క్రింది పట్టిక తెలియ చేస్తుంది:

| సంవత్సరం | ఫేస్ బుక్ | ట్విట్టర్ | ఇన్‌స్టా గ్రాం | యూట్యూబ్ |
|---|---|---|---|---|
| **2022** | **5,34,000** | **4,24,000** | **1,10,000** | **8036** |
| **2024** | **5,56,259** | **4,69,896** | **1,66,812** | **21,941** |

ఈ స్వల్ప మెరుగుదలకు కారణం సోషల్ మీడియా వేదికల స్వభావం మారడమే. వీటిలో పాల్గొనడం ఉచితం నుండి ప్రధానంగా చెల్లింపులకు మారింది. ఉచితంగా లభించే కంటెంట్ పరిమాణం బాగా తగ్గింది. చెల్లింపులు అధికం కాకుండా ఈ వేదికపైకి కొత్త యూజర్లను తీసుకురావడం చాల కష్టంగా మారింది. చాల తక్కువ యూజర్ బేస్ నుండి ఆరంభించినప్పటికీ, యూట్యూబ్‌లో మన యూజర్ బేస్ రెట్టింపుకన్నా ఎక్కువయింది. ఎక్కువమందికి చేరువ కావడానికి మనం వీడియోలను ఒక పద్ధతిగా మనం చేసుకున్నాము. అయినప్పటికీ, మనం యూట్యూబ్ కోసం, ఇతర సోషల్ మీడియా కోసం వీడియోలను క్రమబద్ధంగా రూపొందించు కోలేకపోతున్నాము. ఉన్నత స్థాయి వీడియో ఎడిటింగ్ స్కిల్స్ ఉన్న కామ్రేడ్స్ కొరత దీనికి కారణం.

గత నాలుగేళ్ళలో కేంద్ర సోషల్ మీడియా టీం చాల రాష్ట్రాల టీములకు వర్క్‌షాపులు నిర్వహించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ము కాశ్మీర్, పంజాబు, రాజస్థాన్ టీములు ఈ వర్క్ షాపుల్లో పాల్గొన్నాయి. ఇవి కాకుండా, సోషల్ మీడియా, కృత్రిమ మేథ, డిజిటల్ సాధనాలపై ఆలిండియా స్థాయిలో ఒక టెక్నికల్ వర్క్‌షాపు రాష్ట్రాల సిపిఐ(ఎం)సోషల్ మీడియా టీములకు 2024 ఫిబ్రవరిలో నిర్వహించబడింది. 2024 ఎన్నికల సందర్భంగా నలుగురు పూర్తికాలం సభ్యుల టీం ఏడాది పాటు ఎకెజి భవన్ నుండి పనిచేసింది. లోక్ సభ ఎన్నికలకు ఈ టీం ఉన్నత స్థాయి కంటెంట్‌ను రూపొందించకలిగింది. అదే సమయంలో రాష్ట్రాల అప్‌డేటింగ్ పోస్టింగులను క్రమబద్ధం చేసింది.

త్రిపుర ఎన్నికల్లోను, రాజస్థాన్‌లో రెండు అసెంబ్లీ ఎన్నికల్లోను సర్వే నిర్వహించడంలో ఈ కేంద్ర టీం సహకరించింది. పశ్చిమ బెంగాల్ కోసం ఒక ఆన్‌లైన్ సర్వే కూడ నిర్వహించింది.

పార్టీ వెబ్‌సైట్ సిపిఐఎం.ఆర్గ్‌ను కేంద్ర టీం రీడిజైన్ చేసి కొత్త రూపును సంతరింపచేసింది. ఆ మెరుగైన వెబ్ సైట్ 2023లో ప్రారంభించబడింది.

గతంలో సోషల్ మీడియాలో పనికి కేంద్ర రాష్ట్ర సమన్వయం ఒక ప్రధాన సమస్యగా ఉండేది. రాష్ట్రాల టీములనుండి గతంలో కన్నా క్రమబద్ధంగా రిపోర్టులు అందుతున్నప్పటికీ, ఫ్రీక్వెన్సీలోను, పోరాటాల కవరేజీలోను ఖాళీలు కొనసాగుతున్నాయి.

**ముందుకు సాగడం :** సోషల్ మీడియా పద్ధతుల్లో మార్పుల మూలంగా వచ్చిన అవరోధాలు ఉన్నప్పటికీ మన పని వీడియో కంటెంట్ రూపొందించడం పైన, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ లాంటి నిర్దిష్ట  వేదికలపై కేంద్రీకరించాలి. ప్రజా పోరాటాలపైన, హిందూత్వ భావజాలాన్ని ఎదుర్కోవడంపైన మన సోషల్ మీడియా క్యాంపెయిన్లు పదును తేలాలి.

మరొక ప్రధాన కర్తవ్యం మన పోస్టర్లు, వీడియోలు మరింత విస్తృతంగా పంపిణీ జరగడానికి వాట్సాప్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలి. కొన్ని రాష్ట్రాలకు ఇలాంటి నెట్‌వర్క్ ఉన్నప్పటికీ, దాన్ని కేంద్ర నెట్‌వర్క్‌తో సమన్వయం చేసుకోవడం లేదు. అందుమూలంగా కంటెంట్ రెండువైపులకు పంపిణీ జరగడం లేదు. పార్టీ అంతర్గత విషయాలను చర్చించడానికి సోషల్ మీడియాను వినియోగించుకోకూడదు. దీనికోసం 2017లో పార్టీ పొలిట్ బ్యూరో రూపొందించిన మార్గదర్శకాలను పార్టీ కమిటీలు, పార్టీ సభ్యులు అందరూ అనుసరించాలి.

## పట్టణ ప్రాంతాల పని

పట్టణ ప్రాంతాల్లో పనికి వ్యూహాన్ని రూపొందించేందుకు, ఉద్యమాన్ని విస్తరించేందుకు పట్టణ ప్రాంత వ్యవహారాల కమిటీ ఏర్పాటు చేయబడింది. అయితే అది కేవలం నాలుగు సార్లు మాత్రమే సమావేశం కాగలిగింది. రెగ్యులర్‌గా పనిచేయలేదు. పట్టణ ప్రాంతాల పనిని చూస్తున్న కేడరును మధ్యంతరంగా ఉపసంహరించుకోవడం జరిగింది. వారి స్థానంలో మరొకరిని తీసుకోవడం జరగలేదు. కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, హర్యానా లాంటి అనేక రాష్ట్రాలలో కమిటీలు ఏర్పడినప్పటికీ, వాటి కార్యకలాపాలు అనిశ్చితంగా జరిగాయి.

2023 అగస్టులో మూడు రోజుల పాటు ఒక వర్క్‌షాప్ జరిగింది. దానిలో 19 రాష్ట్రాల నుండి 75 మంది పాల్గొన్నారు. ఆ వర్క్‌షాపు ప్రాతిపదికన పట్టణ ప్రాంతాల్లో పనికి ఎదురవుతున్న సవాళ్ళు, పట్టణ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణానికి తీసుకోవలసిన వ్యూహాత్మక చర్యల గురించి ఒక బుక్ లెట్ ప్రచురించబడింది. అయితే, అలాంటి వర్క్‌షాపులను రాష్ట్రాల స్థాయిలో ఏర్పాటు చేయడం, ఒక న్యూస్ బులిటిన్‌ను

ఆరంభించడం లాంటి ఫాలోఅప్ చర్యలు మాత్రం అమలు జరగలేదు. అవగాహనకు దోహద పడేందుకు పట్టణ ప్రాంత సమస్యలపై రెండు ఆన్‌లైన్ సెమినార్లు జరిగాయి. అయితే, అలాంటివి తర్వాతం వేగం పుంజుకోలేదు.

## అంతర్జాతీయ విభాగం

అంతర్జాతీయ విభాగం 11 సార్లు సమావేశమయింది. సోలిడ్‌నెట్‌లో మనం భాగస్వాములుగా ఉన్నాము. అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశానికి రెగ్యులర్‌గా హాజరవుతున్నాము. సామాజిక వైరుధ్యాలపైన, ప్రస్తుత సోషలిస్టు దేశాలగురించి అవగాహనలోను కమ్యూనిస్టు పార్టీల మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడానికి, పాలస్తీనా, క్యూబాలకు సంఘీభావం వ్యక్తం చేయడానికి సమన్వయంతో కూడిన కార్యాచరణ జరిగింది.

మన పార్టీ శాంతి, సంఘీభావ ఉద్యమంలో పాత్ర పోషించింది. పాలస్తీనాపై ఇజ్రాయల్ దాడులకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేయడానికి చొరవతీసుకుంది. అయితే, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విస్తృతమైన ప్రచారోద్యమాల కొరత మాత్రం ఉంది. ఈ కాలంలో శాంతి, సంఘీభావ ఉద్యమంలో మన పాత్ర పెరిగింది. పార్టీ అనుబంధాలకు అతీతంగా విశాల ప్రజానీకాన్ని కదిలించి శాంతి, సంఘీభావ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ఎదురయ్యే అవరోధాలను అధిగమించి, ఓపిగ్గా పనిచేయాల్సిన అవసరం ఉంది.

ట్రంప్ హయాంలో, ప్రత్యేకించి క్యూబాకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద దాడి తీవ్రమవుతున్న దృష్ట్యా, వనరులను సమీకరించేందుకు పార్టీ చురుకైన పాత్ర వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఆలిండియా స్థాయిలో కొనసాగుతున్న కమిటీ మాదిరిగా, రాష్ట్రాల స్థాయిలోను విశాలమైన క్యూబా సంఘీభావ కమిటీలను ఏర్పాటు చేయాలి. క్యూబాకు, పాలస్తీనాకు సంఘీభావం రాబోయే రోజుల్లో పార్టీ ప్రధాన కర్తవ్యంగా ఉంటుంది.

## చరిత్ర కమిషన్

పార్టీ చరిత్ర రెండవ వాల్యూమ్ (1933–51) ఆరంభమయింది. కొన్ని రాష్ట్రాల నుండి పూర్తి సమాచారం రాకపోవడంతో ఆ పని అసంపూర్తిగా మిగిలింది.

సంఘపరివార్ నుండి వెలువడుతున్న తప్పుడు చరిత్ర కథనాల దృష్ట్యా ఈ వాల్యూమును 2025 చివరికల్లా తీసుకురావలసిన అవసరం ఉంది.

## పార్లమెంటరీ పార్టీ

మనకు 4గురు లోక్ సభ, 4గురు రాజ్య సభ సభ్యులున్నారు. ప్రత్యేకించి ప్రభుత్వం పార్లమెంటును పనిచేయకుండా ప్రయత్నిస్తున్న నేటి తరుణంలో మనకు తక్కువ బలం ఉండటం రీత్యా పార్లమెంటులో ప్రభావశీలమైన జోక్యం చేసుకోలేకపోతున్నాము. అయినప్పటికీ మన సభ్యులు ఉభయ సభల్లో ప్రజాసమస్యలు లేవనెత్తడానికి తమ శాయశక్తులా కృషి చేస్తున్నారు. అయినప్పటికీ, మన పార్లమెటు సభ్యుల బృందాలు మత, కుల ఘర్షణలు జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, బాధితులను కలుసుకొంటున్నారు. మన ఎంపీలు మరింత సమర్ధవంతంగా పనిచేయడానికి, పార్లమెంటరీ ఆఫీసు పనిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

## నిధులు, ఎకౌంట్లు

మన ఫైనాన్స్ కమిటీ అవసరమయినప్పుడల్లా సమావేశమవుతున్నది. రాష్ట్రాల నుండి కన్సాలిడేటెడ్ ఎకౌంట్లను తెప్పించుకోవడం కష్టతరమైన, క్లిష్టతరమైన పనిగా మారింది. సరైన ఎకౌంట్లను మెయింటెన్ చేయడం, ఎకౌంట్లను నిర్వహించడానికి సరైన టీంను ఏర్పాటు చేయడం ప్రాధాన్యతను రాష్ట్రాలు గుర్తించాలి. ప్రభుత్వంనుండి అనేక రకాల అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ, ఆడిట్ చేసిన ఎకౌంట్లను క్రమబద్ధంగా సమర్పిస్తున్నది.

అయినప్పటికీ, మన నిబంధనావళి ఆదేశిస్తున్నట్లు, వార్షిక ఎకౌంట్ల స్టేట్‌మెంట్‌ను కేంద్ర కమిటీ ముందుంచడం జరగలేదు.

పార్టీ ఎకౌంట్లను సక్రమంగా నిర్వహించడం, మార్గదర్శకాలను అనుసరించాల్సిన ప్రాధాన్యతను పార్టీ నొక్కి చెబుతున్నది. నిధి సేకరణపైన, పార్టీ ఎకౌంట్ల నిర్వహణపైన 2009 దిద్దుబాటు ఉద్యమ డాక్యుమెంటు కొన్ని సూచనలు చేసింది.

నిధిసేకరణపైన, వాటిని ఖర్చు చేయడం, పంపిణీ చేయడంపైన రాష్ట్ర కమిటీలు ఆరు మాసాల్లో మార్గదర్శకాలను రూపొందించుకోవాలి. వాటిని కచ్చితంగా

అమలు చేసేట్లు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సూచనలు అన్ని స్థాయిల్లోను కచ్చితంగా అమలు కావాలి.

## 3. ప్రజా సంఘాలు, ఫ్రాక్షన్ కమిటీలు

### ప్రజాసంఘాలు

ప్రజాసంఘాలను విశాల జనబాహుళ్యపు ప్రజాతంత్ర, స్వతంత్ర వేదికలుగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యం చాల సంత్సరాల సైతం సక్రమంగా అమలు కావడం లేదు. ఈ విషయంలో బలహీనతలు కొనసాగుతున్నాయి.

ప్రజాతంత్ర ప్రక్రియలను మెరుగుపరచడానికి, సభ్యుల జోక్యం పెంచడానికి, స్థానిక నాయకత్వాన్ని అభివృద్ధిచేయడానికి, జనబాహుళ్యంలోని ముందుండే శక్తులను ఆకర్షించడానికి, స్థానిక సమస్యలపై పనిచేయడానికి, ప్రజలతో సంబంధాలు కొనసాగించడానికి, ప్రజల మనోభావాల్ని కనిపెట్టడానికి ప్రాథమిక యూనిట్లను ఏర్పాటు చేసి, సక్రమంగా పనిచేయించడం తప్పనిసరి. ఆలిండియా కేంద్రాలు పూర్తిగా సభ్యత్వ చేర్పింపు పైనే కేంద్రీకరించకుండా, ప్రాథమిక యూనిట్లను పనిచేయించడం కోసం కూడ శ్రద్ధ పెట్టాలి.

ప్రజాసంఘాలు స్వతంత్రంగా పనిచేయకపోవడానికి ఒక ప్రధాన కారణం, ఫ్రాక్షన్ కమిటీలు, సబ్ కమిటీలు తమకు కేటాయించిన బాధ్యతలను విడిగాను, నెరవేర్చేలా చేయడంపై పార్టీ కమిటీలు తగినంత శ్రద్ధ పెట్టకపోవడమే. ఈ వైఫల్యం ప్రజాసంఘాలలో లేదు, పార్టీ నాయకత్వం లోపం వల్లనే జరుగుతున్నది.

ఉద్యమాల్లో ప్రజలు మౌన ప్రేక్షకుల మాదిరిగా కాకుండా, క్రియాశీల భాగస్వాములుగా పాల్గొనేలా ప్రోత్సహించే పని పద్ధతులను అభివృద్ధి చేయాలి. కేవలం మీడియా దృష్టితో జరిపే సంకేత ప్రాయంగా మారే ఉద్యమ పద్ధతులను వదిలించుకోవడం కీలకమైన అంశం.

### ఫ్రాక్షన్ కమిటీలు, సబ్ కమిటీలు

పార్టీ మహాసభలో నిర్దేశించిన కర్తవ్యాల అమలు ఫ్రాక్షన్ కమిటీల, సబ్ కమిటీల మౌలిక బాధ్యత. అవి పార్టీ కర్తవ్యాలను నెరవేర్చేలా పొలిట్ బ్యూరో, ఇతర నాయకత్వ కమిటీలు రెగ్యులర్‌గా మార్గదర్శకత్వం వహించాలి. ఈ కమిటీల పనిపైన,

ప్రజా సంఘాల పనిపైన వార్షిక సమీక్షలను పార్టీ కమిటీలు నిర్వహించాలి. ఫ్రాక్షన్ కమిటీల పనిని మెరుగుపరచడానికి, ఫ్రాక్షన్ కమిటీ సభ్యులకు, వివిధ స్థాయిల్లో ప్రతి సంవత్సరం పార్టీ వర్క్ షాపులు నిర్వహించాలి.

**టియు సబ్ కమిటీ:** టియు సబ్ కమిటీ 9 సార్లు సమావేశమయింది. ఇది రెగ్యులర్‌గా సమావేశమవుతూ ట్రేడ్ యూనియన్ రంగంలో తన బాధ్యతను నెరవేర్చడానికి ప్రయత్నిస్తున్నది. ఈ సమావేశాల్లో చేపట్టిన ముఖ్యమైన అంశాల్లో– ప్రధాన పోరాట కార్యక్రమాల సమీక్ష, ట్రేడ్ యూనియన్ రంగంలో మన పనికి సంబంధించి సమీక్షా డాక్యుమెంటును తయారు చేయడం, మరింత చొరవలు తీసుకునేందుకు రైల్వే రంగంలో మన పని సమీక్ష, వీటితో పాటు వివిధ రంగాల్లో ఎదుర్కొంటున్న, జాతీయ స్థాయిలో ఉమ్మడి ఉద్యమాల్లో ఎదుర్కొంటున్న నిర్మాణ పరమైన, ఉద్యమ పరమైన సమస్యలు. కేంద్ర టియు ఫ్రాక్షన్ కాకుండా, వివిధ రంగాలకు చెందిన 18 ఫ్రాక్షన్ కమిటీలు కూడ ఉన్నాయి. ఈ కాలంలో కేంద్ర ట్రేడ్ యూనియన్ ఫ్రాక్షన్ కమిటీ రెండు సార్లు మాత్రమే సమావేశమయింది. రాబోయే కాలంలో ఇది మరితం తరచుగా సమావేశం కావాలి.

**వ్యవసాయ సబ్ కమిటీ**: వ్యవసాయ సబ్ కమిటీ 5 సార్లు సమావేశమయింది. సబ్ కమిటీ రైతు, వ్యవసాయ కార్మిక మహాసభలను సమీక్షించింది. పార్టీ ఎడ్యుకేషన్‌ను ప్లాన్ చేసింది. 2024 లోక్ సభ ఎన్నికల్లో కర్తవ్యాలను నిర్ణయించింది. రెండు రంగాలకు ఫ్రాక్షన్ కమిటీలను ఏర్పాటు చేసింది. 24వ పార్టీ మహాసభకు రెండు రంగాల రిపోర్టులను ఖరారు చేసింది. పార్టీ నిర్మాణం, హోల్ టైమర్లు, మూడు వర్గ సంఘాల ఉమ్మడి కార్యాచరణల గురించి కూడ సబ్‌కమిటీ చర్చించింది.

**మహిళా సబ్ కమిటీ:** ఈ కాలంలో మహిళా సబ్ కమిటీ 7 సార్లు సమావేశమయింది. ప్రధాన చర్చలు, 1. పార్టీ నిర్మాణం, 2. పార్టీకి, ప్రజాసంఘానికి చెందిన విధానపరమైన, నిర్మాణ పరమైన అంశాలు, 3. పై ఏ అంశంపైనైనా పొలిట్ బ్యూరోకు నివేదిక సమర్పణ – అంశాలపై జరిగాయి. కేంద్ర ఫ్రాక్షన్ కమిటీ మూడేండ్లలో రెండు సార్లు సమావేశమయింది. కేంద్ర ఫ్రాక్షన్ కమిటీ ఏడాదికి కనీసం రెండు సార్లు సమావేశం కావాలి. మహిళలపై 2005 లో కేంద్ర కమిటీ ఆమోదించిన అవగాహనా పత్రాన్ని గణాంకాల రీత్యా తాజాపరచాల్సి ఉంది. ఈ పత్రం ఈ కాలంలో

ఎక్కువగా నివేదించబడింది. కాని దాన్ని పార్టీ సిలబస్‌లో మాత్రం ఒక ముఖ్యమైన పాఠ్యాంశంగా  చేర్చలేదు. ఇది చేయాలి.

**యువజన, విద్యార్థి కమిటీ:** ఆలిండియా స్థాయిలో యువజన, విద్యార్థి ఫ్రాక్షన్ కమిటీలు వేర్వేరుగా ఉన్నాయి. ఈ కాలంలో విద్యార్థి ఫ్రాక్షన్ కమిటీ 9 సార్లు, యువజన ఫ్రాక్షన్ కమిటీ 14 సార్లు సమావేశమయ్యాయి. ఆలిండియా యువజన మహాసభ నిర్వహణ గురించి యువజన ఫ్రాక్షన్ చర్చించింది.

**సాంస్కృతిక రంగం :** ఫ్రాక్షన్ 4 సార్లు సమావేశమయింది. ఈ మూడేండ్ల కాలంలో **దళిత వేదిక** ఫ్రాక్షన్ 8 సార్లు సమావేశమయింది. ఇది సరిపోదు. మనం ప్రయత్నాలు చేసినప్పటికీ కేంద్రం నుండి పనిచేసే కేడరును సమకూర్చు కోలేకపోయాము. సామాజిక గ్రూపుల్లో, ప్రత్యేకించి దళితుల్లో పార్టీ అవగాహన మేరకు పనిచేసేలా పార్టీ రాష్ట్ర కమిటీలు చూడాలి. **ఆదివాసి** వేదిక ఫ్రాక్షన్ కమిటీ 5 సార్లు సమావేశమయింది. **మైనారిటీ** ఫ్రాక్షన్ కమిటీ 2 సార్లు సమావేశమయింది. **సైన్సు** ఫ్రాక్షన్ 4 సార్లు, **ఐటి, ఫ్రీ సాఫ్ట్ వేర్** ఫ్రాక్షన్ 2 సార్లు సమావేశమయ్యాయి.

మనం ప్రయత్నించినప్పటికీ **వికలాంగుల** రంగానికి ఫ్రాక్షన్ కమిటీని ఏర్పాటు చేయలేకపోయాము. దీనిని అధిగమించాలి. చాల రాష్ట్రాలలో ఈ రంగం నుండి గణనీయంగా పార్టీ సభ్యులను రిక్రూట్ చేసుకోగలిగాము. అందుచేత ఈ రంగంలో కార్యకలాపాలను సమన్వయం చేయడానికి ఫ్రాక్షన్ కమిటీ ఏర్పాటు చేయడం ఒక ముఖ్యమైన కర్తవ్యం.

## అంతర్గత ఫిర్యాదుల కమిటీ

బయటి నుండి ఒకరితో పాటు ఐదుగురితో పార్టీ కేంద్రంలో ఒక అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటయింది. లైంగిక వేధింపుల వ్యతిరేక విధానాన్ని అమలు చేయడానికి మార్గదర్శకాలు, పద్ధతులతో ఒక నోట్‌ను పొలిట్ బ్యూరో తయారు చేసి 2022 మేలో పంపించింది. లైంగిక వేధింపులకు సంబంధించి పార్టీ లోపల వచ్చిన ఫిర్యాదులను విచారించడానికి అన్ని స్థాయిల్లోను అలాంటి కమిటీలను ఏర్పాటు చేయడానికి ఒక చట్రాన్ని ఆ నోట్ అందించింది.

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, ఢిల్లీ రాష్ట్రాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటయినాయి. ఈ కాలంలో మార్గదర్శకాలు, వాటి అమలు అనుభవం గురించి సమీక్ష జరగాలి.

## 4. అదనంగా శ్రద్ధ పెట్టాల్సిన అంశాలు

**యువతను ఆకర్షించడం**

మరింత మంది యువజనులను ఆకర్షించలేకపోతున్నామని వివిధ రాష్ట్రాల రివ్యూ రిపోర్టులు తెలియచేస్తున్నాయి.

మన పార్టీ ఇతర బూర్జువా పార్టీలకు భిన్నమైన పార్టీ అని యువజనులకు చెబుతున్న అంశాన్ని నిరూపించుకోవలసి ఉంది. ప్రత్యామ్నాయం కోసం అన్వేషించాలనే యువజనులను ఉద్దేశించి మన రాజకీయ, సైద్ధాంతిక విజ్ఞప్తి ఉండాలి. రాజకీయ సమీక్షా నివేదిక చెప్పినట్లు: "మన రాజకీయ, సైద్ధాంతిక ప్రచారంలో లోపిస్తున్న ఒక ముఖ్యమైన అంశం సోషలిజం లక్ష్యాన్ని వివరించకపోవడం. మనం చెప్పే వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని సోషలిజంతో అనుసంధించాలి. నూతన తరానికి మనం అప్పీలు చేస్తున్నపుడు ఇది మరింతగా అవసరం. వీరంతా సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత, సోషలిజానికి ఎదురు దెబ్బలు తగిలిన తర్వాత ఎదిగి వచ్చిన తరం. ఇది మనం చేయడం లేదని ఆత్మవిమర్శనా పూర్వకంగా అంగీకరించాలి. ఆ లోపాన్ని మన రాబోయే రాజకీయ , ఎత్తుగడల విధానంలో సవరించుకోవాలి."

యువత ఉదాసీనంగా, క్రియాశీల రహితంగా ఉంటున్నారన్నది సమస్య కాదు. వారిని సమీకరించడానికి అనుగుణమైన వ్యూహాలను మనం కనుగొనలేక పోయామన్నది అసలు విషయం. క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు, సామాజిక సేవ లాంటి పలు కార్యక్రమాలలో యువజనులు నిమగ్నం అవుతారు. మనం ప్రణాళికా బద్ధంగా, తగిన చొరవ తీసుకున్నపుడు, మన యువజన సంఘం యువతను సమర్థవంతంగా సమీకరించగలదు. ఉదాహరణకు కేరళలో వయనాడ్ సహాయ నిధి కోసం యువజనులు పనికిరాని సామగ్రిని అమ్మడం ద్వారా రు.20 కోట్లు సేకరించారు. అందుచేత, యువజనులతో మనల్ని అనుసంధించుకోవడానికి ఒక సమగ్రమైన, బహుముఖ దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుంది.

యువజనులను ప్రజాకార్యక్రమాలలో పాల్గొనేలా చేసి, వివిధ ప్రజాసంఘాల ద్వారా వారిని పార్టీలో ఇముడ్చుకునేందుకు ఒక ప్రణాళికాబద్ధంగా, క్రమబద్ధంగా ముందుకు సాగాలి. యువతకు ఆసక్తికరమైన రంగాలు, కార్యకలాపాలను మనం గుర్తించాలి. తదనుగుణమైన వ్యూహాలతో వారితో కలిసి పోవాలి. అన్ని స్థాయిల్లోని పార్టీ కమిటీలకు, సబ్‌కమిటీలకు, ఫ్రాక్షన్ కమిటీలకు ఇది ఒక ముఖ్యమైన, బలమైన కర్తవ్యం.

యువజనులంటే విద్యార్థులు, నిరుద్యోగులు మాత్రమే కాదు, కంట్రాక్టు లేబరు, అసంఘటిత కార్మికులు, గిగ్ వర్కర్లు, వలస కార్మికులు, గ్రామీణ శారీరక శ్రామికులు, చీకటి గుహల్లాంటి చోట చెమటోడ్చి పనిచేసే మహిళలు– వీరంతా యువజనులే. అందుచేత, అన్ని సెక్షన్లకు చెందిన యువజనులను చేరుకోవడానికి ఒక్క యువజన సంఘం మాత్రమే సరిపోదు. కాబట్టి, యువజనులతో పనిచేయడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించడం అన్ని ప్రజా సంఘాల, నాయకుల, కేడర్ల సమిష్టి బాధ్యత.

## ట్రేడ్ యూనియన్, విద్యార్థి రంగాల తక్షణ ప్రాధాన్యత

పార్టీ ప్రస్తుత బలహీన స్థితి దృష్ట్యా ట్రేడ్ యూనియన్, విద్యార్థి రంగాలకు మున్నెన్నడూ లేనంతగా కీలక ప్రాధాన్యత ఉంది. బలహీనమైన ప్రాంతాలలో బలం పెంచుకోవడంలో ఈ రంగాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. మన నెట్‌వర్కును మరింత విశాలమైన వేదిక మీదకి తీసుకు రావడానికి అవి వీలుకల్పిస్తాయి. తద్వారా యువజనులను, పూర్తి కాలం కార్యకర్తలను ఆకర్షించవచ్చు.

ఈ రెండు రంగాలు అవకాశమున్న ఇతర రంగాలలో ప్రజా పునాదిని పెంచుకోవడానికి అవసరమైన ప్రాతిపదికను, బలాన్ని, వనరులను ఇవి సమకూరుస్తాయి. ఇలా చెబుతున్నామంటే ఇతర రంగాలను నిర్లక్ష్యం చేసినట్లు కాదు. దానికి భిన్నంగా, ట్రేడ్ యూనియన్, విద్యార్థి ఉద్యమాలు బలపడితే, ఇతర రంగాలు కొత్త ప్రాంతాలకు విస్తరించడానికి దోహదపడతాయి.

ఇప్పుడు కూడ బలహీనమైన ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో పార్టీ కనిపిస్తున్నదంటే అంటే అది ట్రేడ్ యూనియన్ ఉద్యమం మూలంగానే. పార్టీకి, ప్రజా ఉద్యమానికి

బలం సమకూర్చడంలో సంఘటితమైన, రాజకీయచైతన్యమైన కార్మికవర్గం పాత్ర ఎలా ఉంటుందో, ఇటీవల తెలంగాణ పార్టీ రాష్ట్ర మహాసభను పారిశ్రామిక కేంద్రమైన సంగారెడ్డిలో జరిపిన తీరును చూస్తే అర్థమవుతుంది. నిధులను అందించడం, సభకు ఏర్పాట్లు చేయడం, బహిరంగ సభకు జనాన్ని సమీకరించడం బాధ్యతలన్నింటినీ అనేక ఫ్యాక్టరీలకు చెందిన కార్మికులే తమ నిబద్ధతను వ్యక్తం చేస్తూ పూర్తిగా స్వీకరించారు. అందుచేత ఈ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.

### గిరిజన సమూహాలు

వివిధ రాష్ట్రాలలోని గిరిజన సమూహాలలో మన పునాది చెదిరి పోకుండా ఉంది. అయినప్పటికీ, మనం అప్రమత్తంగా లేకపోతే ఈ పునాదిని సైతం కోల్పోవలసి వస్తుంది. వారి ప్రయోజనాలకు మనం నికరంగా కట్టుబడి ఉండటం మూలంగానే ఈ ప్రాంతాలలో మన బలం కొనసాగుతున్నది. అయినప్పటికీ మతోన్మాదం, విద్యాధిక గిరిజనుల్లో అస్తిత్వవాద రాజకీయాల నుండి మన ఉద్యమానికి ప్రమాదం దాపురించే అవకాశం ఉంది.

## 5. నూతన రంగాలలో పని

నయా ఉదారవాద విధానాల అమలు మూలంగా సామాజిక ఆర్థిక పరిస్థితులపైన, వివిధ వర్గాలపైన పడిన ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నూతన ప్రజా సంఘాలను, వేదికలను ఏర్పాటు చేయాలని పార్టీ ఆలోచించింది. బాల సంఘాలు, బస్తీ సంఘాలు, పట్టణ ప్రాంతాలలో నివాస ప్రాంత కాలనీ, లొకాలిటీ సంఘాలు, గ్రామీణ కార్మిక ఫెడరేషన్లు, సామాజిక సేవా సంఘాలు, పెన్షనర్ల సంఘాలు మొదలైనవి ఇలాంటివి. అయితే, ఈ దిశగా చెప్పుకోదగిన పురోగతి జరగలేదు. అలా జరిగేలా పార్టీ బలమైన చర్యలు చేపట్టాలి.

### గ్రామీణ కార్మికులు

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు కాకుండా మిగతా కార్మికులను సమీకరించే పనిలో దశాబ్దం తర్వాత కూడ పెద్దగా పురోగతి జరగలేదు.

గ్రామీణ కార్మికుల సర్వే నిర్వహించాలని కేంద్ర కమిటీ ఇచ్చిన ఆదేశం ఒక్క తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రమే అమలు జరిగింది. అయితే, ఆంధ్ర ప్రదేశ్ సర్వే ఫారాలను విశ్లేషించి, అంతిమ నిర్ధారణలను రాబట్ట లేదు.

రాబోయే కాలంలో పార్టీ అన్ని స్థాయిల్లోను గ్రామీణ కార్మికుల సర్వే నిర్వహణకు ప్రాధాన్యత ఇచ్చి, తగిన శ్రద్ధ కనపరచాలి. వ్యవసాయ కార్మిక, గ్రామీణ కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు ఈ పనిలో పాల్గొనాలి. గ్రామీణ ప్రాంతాలలో స్థానిక సమస్యలను తీసుకొని వర్గపోరాటాలు నిర్వహించడానికి ఇది చాల అవసరం.

## నివాస ప్రాంతాలు

ప్రజల రోజువారీ జీవితాలతో మన కార్యకలాపాలను మిళితం చేయకుండా నివాస ప్రాంతాల్లో 'మాస్ లైన్' దృక్పథాన్ని అమలు చేయడం సాధ్యం కాదు. పట్టణ నివాస ప్రాంతాలలో మన కృషిని పెంపొందించాలని పార్టీ గుర్తించినప్పటికీ పురోగతి మాత్రం మందగొడిగా ఉంది.

ఈ విషయంలో పార్టీ కమిటీలు సంబంధిత రంగాలను సమన్వయం చేసేందుకు, ఈ ప్రాంతాల్లో పనిచేసే హోల్‌టైమర్లను గైడ్ చేసేందుకు బాధ్యత స్వీకరించాలి. అంకిత భావంతో పనిచేసే నాయకత్వం, సమన్వయంతో కూడిన కృషి ఉంటే తప్ప మనం ఈ కీలక రంగంలో అర్థవంతమైన పురోగతి సాధించగలం. దళిత బస్తీలు, కాలనీల్లో పనియడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

## మధ్య తరగతి

హిందూత్వ మతోన్మాద శక్తులు మధ్యతరగతి వర్గాలను తమ ప్రభావం లోకి తీసుకుంటున్న దృష్ట్యా, ఈ పెరుగుతున్న మధ్య తరగతి వర్గాలలో పనికి ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నొక్కి చెబుతున్నది. మనం సంప్రదాయంగా అనుసరించే ట్రేడ్ యూనియన్ పని పద్ధతులు వీరిని సైద్ధాంతికంగా ప్రభావితం చేయడానికి సరిపోవు. పౌరుల సాంస్కృతిక వేదికలు, అపార్ట్‌మెంట్/నివాస ప్రాంత వెల్ఫేర్ అసోసియేషన్ల ద్వారా ఈ సెక్షన్లలో సైద్ధాంతిక కృషి నిర్వహించాలి.

నేడు అత్యంత వైవిధ్యంతో కూడిన సర్వీసు రంగంలో అత్యధిక మధ్యతరగతి వర్గాల వారు ఉన్నారు. ఐటి రంగంలోని 5 అతి పెద్ద సంస్థల్లో దాదాపు 16 లక్షల

మంది ఉన్నారు. ఈ సెక్షన్ల వారిని సమీకరించేందుకు పార్టీ విభిన్న వ్యూహాలను అనుసరించాల్సిన అవసరం ఉంది.

బెంగుళూరు, హైదరాబాదుల్లోని మన ఐటి విభాగాలు ప్రజలకోసం వైద్య శిబిరాలు నిర్వహించడం, ట్యూషన్ సెంటర్లను నిర్వహించడం లాంటి వినూత్న పద్ధతులద్వారా పనిచేస్తున్నాయి. బెంగుళూరు లోని ఐటి ఉద్యోగుల సంఘం ఐటి, ఐటీస్ ఉద్యోగుల సమస్యలను చేపట్టింది. కార్మిక వర్గపు ఇతర సమస్యలతో సహా అనేక పోరాటాలు నిర్వహించింది.

చాల రాష్ట్రాలలో చెదురుమదురుగా కొంత కృషి జరిగి సానుకూల ఫలితాలు సాధించడం జరిగింది. అయితే ఆ కృషి రాష్ట్ర వ్యాపిత రూపు సంతరించుకోలేదు. మధ్యతరగతి వర్గాలలో సమర్థవంతంగా జోక్యం చేసుకునేందుకు పార్టీ ఒక ప్రణాళికను సిద్ధం చేయాలి.

## బాలల్లో పని

మతోన్మాద శక్తులు చిన్నారుల మనస్సులను పట్టుకొని, వారి మెదళ్లను తమ సిద్ధాంతంతో కలుషితం చేస్తున్నాయి. చిన్నారులను, వారి తల్లి తండ్రులను లక్ష్యంగా చేసుకొని ఈ మతోన్మాద శక్తులు రకరకాల సాంస్కృతిక, ఇంకా ఇతర కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఈ రంగాన్ని మతోన్మాదులకు వదిలిపెట్టకూడదు.

దీనికోసం దేశవ్యాపితంగా బాల సంఘాల ఏర్పాటుకు పార్టీ ప్రాధాన్యత ఇస్తున్నది. 2022, అక్టోబరులో ఆలిండియా కేంద్రం ఆధ్వర్యంలో తిరువనంతపురంలో ఒక వర్క్‌షాపు జరిగింది. దీనిలో 19 రాష్ట్రాల నుండి 126 మంది కామ్రేడ్లు (54 మంది స్త్రీ, 72 మంది పురుష) పాల్గొన్నారు. ఆలిండియా వర్క్ షాపు తర్వాత అనేక రాష్ట్రాలలో అదే మాదిరి వర్క్‌షాపులు జరిగాయి. పంజాబు, మధ్య ప్రదేశ్, జార్ఖండ్, అస్సాం రాష్ట్రాలలో బాల సంఘాల స్థాపనకు చొరవ గైకొనబడింది.

కేరళ, బెంగాల్, త్రిపురలలో బాలలను సమీకరించడానికి మంచిగా పనిచేసే సంఘటిత స్వరూపాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బాలల క్లబ్బులు, బాలోత్సవాల పేరుతో బాలలను సంఘటితం చేయడానికి కృషి జరుగుతున్నది. బాల సంఘాలను ఏర్పాటు చేసి, వాటిని పనిచేయించడానికి తమిళనాడు, కర్నాటకల్లో కృషి జరుగుతున్నది.

కాని ఈ కృషి స్థిరంగా జరగడం లేదు, పటిష్టీకరణ లక్ష్యంతో కొనసాగడం లేదు. పరిస్థితిని బట్టి బాలలను సంఘటితం చేసే స్వరూపాలను ఎంపిక చేసుకోవాలి. ప్రత్యేకించి మన విద్యార్థి సంఘం చాల విద్యాసంస్థల్లో ప్రవేశించడం కష్టతరమవుతున్న నేటి పరిస్థితిలో, బాలల్లో పనిచేయడానికి ఉన్న ప్రాధాన్యతను అన్ని స్థాయిల్లో పార్టీ కమిటీలు గుర్తించాలి.

## 6. నయా ఉదారవాద, నయా ఫాసిస్టు

హిందుత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా విశాల ప్రతిఘటనను నిర్మించాలంటే, పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని రాజకీయ సమీక్షా నివేదిక నొక్కి చెప్పింది. దీన్ని సాకారం చేయడానికి, స్థిరమైన వర్గ, ప్రజా పోరాటాలను అభివృద్ధి చేయాలని, విశాలప్రాతిపదికన సైద్ధాంతిక కృషిని నిర్వహించాలని, పార్లమెంటరీతత్వ హానికర ప్రభావానికి వ్యతిరేకంగా పోరాడాలని, విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పిలుపునిచ్చింది. ఈ ఆదేశాలను ఆచరణలో పెట్టడానికి, పార్టీ అన్ని స్థాయిల్లోను నిర్మాణపరమైన చర్యలను రూపొందించుకోవాలి.

### వర్గ, ప్రజా పోరాటాలను ఉధృతం చేయడం

అన్ని స్థాయిల్లోని పార్టీ శాఖలు, కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని, ఇంకా ఇతర సెక్షన్ల శ్రామికజనాన్ని సమీకరించడంపై దృష్టి పెట్టాలి. జండర్, కుల అణచివేత, వివక్షల అంశాలను కూడ చేపట్టాలి. దీనిలో ఒక ముఖ్యమైన అంశం, వర్గ, సామాజిక, ప్రజా సమస్యలపై స్థిరమైన స్థానిక పోరాటాలను కొన్ని డిమాండ్లు అయినా సాధించేవరకు కొనసాగించడం. ఉమ్మడి పోరాటాలను కొనసాగించేందుకు ట్రేడ్ యూనియన్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల మధ్య సమన్వయాన్ని, ఉమ్మడి కార్యకలాపాలను మెరుగుపరచాలి, మరింత గాఢతరం చేయాలి.

రాష్ట్ర కమిటీలు జిల్లా కమిటీలకు, మధ్యంతర కమిటీలకు నిర్దిష్టమైన ఆదేశాలు అందించి, స్థానిక సమస్యలను గుర్తించేందుకు, వాటిపై స్థిరమైన పోరాటాలను నిర్వహించేందుకు సహాయం చేయాలి. ఆ పోరాటాలను పర్యవేక్షిస్తుండాలి.

ఈ వ్యూహాన్ని అమలు పరిచేందుకు, స్థానిక సమస్యలను గుర్తించేందుకు, వాటిపై పోరాటాలను నిర్వహించేందుక ప్రజలను సమీకరించడానికి శాఖల, స్థానిక కమిటీల శక్తిసామర్థ్యాలను పెంచడం ఒక కీలకమైన చర్య. ఈ కర్తవ్యాన్ని సమర్ధవంతంగా నెరవేర్చేలా శాఖా కార్యదర్శులకు, ప్రజాసంఘాల స్థానిక కేడరుకు, స్థానిక కమిటీల సభ్యులకు, హోల్‌టైమర్లకు తగిన శిక్షణ అందించాలి.

సమర్థవంతమైన స్థానిక పోరాటాలను ఆరంభించడానికి, జనబాహుళ్యాన్ని సమీకరించే ఉద్యమాలను చేపట్టడానికి, క్షేత్రస్థాయిలో ప్రజల స్థితిగతులను నిర్దిష్టంగా, క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. దీనికి వీలు కల్పించేందుకు, ట్రస్టులు, విజ్ఞాన కేంద్రాల, సానుభూతిపరులైన మేధావుల సేవలను వినియోగించుకోవచ్చు. ప్రజలను సమీకరించేందుకు దోహదపడే స్థానిక అంశాలను గుర్తించేందుకు కేడరు కూడ క్షేత్రస్థాయి అధ్యయనాలను చేపట్టాలి.

నిరసనలకు, ఉద్యమాలకు ఆలిండియా పిలుపులను తగు జాగ్రత్తతో ఇవ్వాలి. నిరసన పిలుపులు తక్షణం ఇవ్వాల్సి రావచ్చు. ఉద్యమాల పిలుపులు మాత్రం సన్నాహాలకు తగు సమయం ఉండేలా ఇవ్వాలి. సమాంతరంగా స్థానిక ఉద్యమాలు బలపడకుండా అఖిల భారత ఉద్యమాలు భారంగా తయారవుతాయి. మొత్తంగా మన ఉద్యమం బలోపేతం కావడానికి బదులు, అడ్డుపడేలా చేస్తాయి. ప్రస్తుతం ఆలిండియా స్థాయిలోను, రాష్ట్రాల స్థాయిలోను పలు పిలుపులు ఒకే సమయంలో ఇవ్వబడుతున్నాయి. ఇవి తరచు ఒకదానితో మరొకటి పోటీ పడేలా ఉంటున్నాయి. ఫలితంగా, మన పోరాటాలు, ఉద్యమాలు నిజమైన జనబాహుళ్యపు పాత్ర లేకుండా ఒక తంతుగా మారే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అలాంటి పిలుపులు ఇచ్చే ముందు, పార్టీ వివిధ ఫ్రాక్షన్ కమిటీల ద్వారా జోక్యం చేసుకొని సమన్వయం చేయాలి. ఆ విధంగా ఆ పిలుపులు మొత్తం ఉద్యమానికి అర్ధవంతంగా దోహదపడేలా చూడాలి.

## కేడరును, జనాన్ని రాజకీయవంతం చేయడం

ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లోను, రైతు ఉద్యమాల్లోను పాల్గొన్న జనబాహుళ్యాన్ని రాజకీయవంతం చేయడం జరగడం లేదని రాజకీయ సమీక్షా నివేదిక పేర్కొంది. పార్టీ ఫ్రాక్షన్లు, పార్టీ సభ్యులు ప్రజా సంఘాల సాధారణ సభ్యుల్లో రాజకీయ

కృషి ఎలా చేస్తున్నారో, జనబాహుళ్యంలో రాజకీయ కృషి కోసం ఏ చర్యలు తీసుకుంటున్నారో విమర్శనాత్మక సమీక్ష జరపాలి. దాంతో పాటు ఆగ్జిలరీ గ్రూపుల్లో ఎవరిని తీసుకోవచ్చో గుర్తించి, వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా పార్టీ నిర్మాణాన్ని చేపట్టాలి. ఇంకా, పునాది వర్గాలను పార్టీకి దగ్గర చేసే వర్గ, ప్రజా సమస్యలపై స్థానిక పోరాటాలకు పార్టీ నేరుగా నాయకత్వం వహించాలని కూడ సమీక్షా నివేదిక చెప్పింది.

**సైద్ధాంతిక కృషిని తీవ్రం చేయడం:**

హిందూత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగాప్రజలను, ముఖ్యంగా యువతను పురోగామి, వామపక్ష రాజకీయాలవైపు ఆకర్షించేందుకు నికరంగా, స్థిరంగా సైద్ధాంతిక పోరాటం నిర్వహించడం అవసరం.

ప్రస్తుత రాజకీయ పరిస్థితిలో హిందూత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం జరపడం అత్యవసరం. కేంద్ర ఫ్రాక్షన్లు సైతం తమ తమ రంగాలలో హిందూత్వ శక్తుల ప్రభావం ఎలా ఉంది, దాన్ని ఎదుర్కొనడానికి ప్రణాళికలు రూపొందించుకోవడం  చేయలేదు. తమిళనాడులో ఇన్సూరెన్స్ ఫ్రాక్షన్ ఈ దిశగా కొంత కృషి జరిపింది. తర్వాత దాన్ని ఇన్సూరెన్స్ కేంద్ర ఫ్రాక్షన్ కూడ అనుసరించింది. ఇది మినహా మిగతా ఏ ఫ్రాక్షన్ కూడ ఇలాంటి చొరవ తీసుకోలేదు.

హిందూత్వ మతోన్మాద సిద్ధాంతాన్ని ఎండగడుతూ, దాని వల్ల ఏర్పడే ప్రమాదాన్ని వివరిస్తూ సెమినార్లు నిర్వహించబడినాయి. అలాంటి సెమినార్లు కేరళలో పార్టీ నిర్వహిస్తున్న వివిధ స్టడీ సెంటర్ల ద్వారాను, తెలంగాణాలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ద్వారాను, ఆంధ్రప్రదేశ్‌లో ఎంబివికె ఆధ్వర్యంలోను జరిగాయి. తమిళనాడులో సెమినార్లు నిర్వహించడమే కాకుండా, అక్కడి సాంస్కృతిక బృందాలు మతోన్మాదానికి వ్యతిరేకంగా పాటలను కూడ రూపొందించాయి. ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఢిల్లీలలో మతోన్మాదాన్ని వ్యతిరేకించే వివిధ పార్టీలను, బృందాలను, వ్యక్తులను ఒక దగ్గరకు తీసుకు వచ్చి, ఒక వేదికను ఏర్పరచడానికి కృషి జరిగింది.

అయినప్పటికీ, మతోన్మాద శక్తుల ఎదురుదాడితో పోల్చినపుడు, దాన్ని ఎదుర్కొనేందుకు మన కృషి తగినంతగా లేదని అంగీకరించాలి. హిందూత్వ మతోన్మాద శక్తుల సైద్ధాంతిక దాడిని ఎదుర్కొనేందుకు  అన్ని వనరులను కూడగట్టుకొని, మన కృషిని తీవ్రతరం చేయాలి.

## సాంస్కృతిక జోక్యాన్ని విస్తరించాలి

హిందూత్వ సిద్ధాంతాన్ని ఎదుర్కొనాలంటే, సాంస్కృతిక రంగంలో కృషి కీలకమైనది. సాంస్కృతిక జోక్యాలను పార్టీ పెద్ద ఎత్తున విస్తరించాలి. దీని కోసం పార్టీ కేంద్ర కమిటీ తయారు చేసిన సాంస్కృతిక డాక్యుమెంటును రాష్ట్ర కమిటీలు, జిల్లా కమిటీలు అమలు చేయాలి. ఆ డాక్యుమెంటులో పేర్కొన్న ఆదేశాలను అమలు చేయడంలో భాగంగా 2022లో, పార్టీ సాంస్కృతిక కార్యకర్తలకు ఒక సెంట్రల్ స్కూల్ నిర్వహించబడింది. 'హం దేఖేంగె' అనే ఒక ఆన్‌లైన్ ద్వైవార్షిక బులెటిన్ కూడ ఆరంభించబడింది. ప్రజాసంఘాలు కూడ సాంస్కృతిక కార్యకలాపాలను నిర్వహించాలి, సాంస్కృతిక వేదికలను ఏర్పాటు చేసుకోవాలి. సాంస్కృతిక రంగంలో జోక్యం పార్టీ పరిధిని మించి విస్తరించాలి. ఇతర పురోగామి, ప్రజాతంత్ర సాంస్కృతిక శక్తులను, వ్యక్తులను కలుపుకు పోవాలి. సాంస్కృతిక కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అవి సాంస్కృతిక శక్తులు, వ్యక్తులను సమీకరించి, విస్తృత ప్రాతిపదికన ఉమ్మడి సాంస్కృతిక కార్యాకలాపాలు నిర్వహించడానికి ఉపయోగపడాలి.

## హిందూత్వను ప్రతిఘటించేందుకు చర్యలు

హిందూత్వ మతోన్మాద భావజాలాన్ని ఎదుర్కొనేందుకు ఆరు రకాల కార్యకలాపాలను, పనిచేయాల్సిన రంగాలను రాజకీయ నివేదిక ముందుకు తెచ్చింది. రాబోయే కాలంలో వాటిని సీరియస్‌గా అమలు చేయాలి.

- పార్టీ అన్ని స్థాయిల్లో తన అన్ని వేదికలను, శక్తులను సమన్వయం చేసి, పూర్తిగా, లేదా పాక్షికంగా సైద్ధాంతిక కృషిలో పాల్గొనేలా పర్యవేక్షించాలి.
  సైన్సు వేదికలు, సాహిత్య, సాంస్కృతిక సంఘాలు, ప్రభావశీలురైన సాంస్కృతిక రంగ ప్రముఖులను ఈ కృషిలో భాగస్వాములను చేయాలి. వారి కార్యకలాపాలు విస్తరించడానికి దోహదపడాలి. పార్టీ నిర్వహించే ప్రచురణాలయాలు, విజ్ఞాన కేంద్రాలు, ట్రస్టులు అవసరమైన మౌలిక వనరులను అందించి, వివిధ రకాలయిన సైద్ధాంతిక కృషికి దోహదపడాలి.
- సంఘపరివార్ కార్యకలాపాలు ప్రముఖంగా ఉండే నివాస ప్రాంతాల్లో సైద్ధాంతిక కృషికి, సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి నిర్వహించాలి. మన సైద్ధాంతిక కృషిలో ఆరెస్సెస్ కాలం

చెల్లిన, మూఢ, అభివృద్ధినిరోధక భావాలను ఎదుర్కొనేందుకు, జనబాహుళ్యంలో, ప్రత్యేకించి బాలల్లోను, విద్యార్థుల్లోను, యువజనుల్లోను శాస్త్ర జిజ్ఞాసను, హేతువాద దృష్టిని పెంపొందించే సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా మన సైన్సు ఉద్యమం కృషి చేయడం ఒక ముఖ్యమైన అంశం. పారిశ్రామిక క్లస్టర్లలోను, ప్రధాన విద్యాకేంద్రాలలోను, నివాస ప్రాంతాల్లోను స్థానిక వనరులను వినియోగించుకొని వేదికలను ఏర్పాటు చేసుకోవాలి.

- ప్రజాసంఘాల సబ్ కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలు తమ తమ రంగాలలో సైద్ధాంతిక కృషిని ప్రత్యేకించి సాంస్కృతిక చొరవ ద్వారా చురుగ్గా అభివృద్ధి చేసుకోవాలి.
- సైద్ధాంతిక కృషి ఉమ్మడిగా, సమన్వయంతో, ఒక్క వూపులో జరిగేలా ప్రచార ఆందోళన, రాజకీయ విద్యా విభాగాలు, పత్రికలు, సాంస్కృతిక వేదికలు తమ తమ కార్యకలాపాలను నిర్దేశించుకోవాలి. ప్రస్తుతం వివిధ సబ్‌కమిటీలు, వాటి ఇన్‌చార్జీలు తగినంత సమన్వయం లేకుండానే తమ సైద్ధాంతిక కృషిని ఎవరికి వారు నిర్వహిస్తున్నారు.
- రాష్ట్ర స్థాయిలో మానవ వనరులకు శిక్షణ, భౌతిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సైద్ధాంతిక కృషి విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

## ప్రణాళికాబద్ధమైన కృషి ప్రాధాన్యత

పార్టీ ఎదగడానికి, విస్తరించడానికి ప్రణాళికాబద్ధమైన కృషి అవసరమని రాజకీయ సమీక్షా నివేదిక కూడ పేర్కొంది: "పార్టీ ఉన్న ప్రతి రాష్ట్రంలో పార్టీ ఎదగడానికి కేంద్ర కమిటీ ప్రణాళికలను సిద్ధం చేయాలి. మన పనిని, వనరులను ఏ రంగాలలో కేంద్రీకరించాలో ఈ ప్రణాళిక గుర్తించాలి. దీన్ని రాష్ట్రాలకు విడిచిపెట్టరాదు. ఈ ప్రణాళిక కేంద్రం చొరవతో రూపొందే ప్రణాళికలో భాగంగా ఉండాలి." ఆ రాష్ట్రంలో పార్టీ బలాన్ని, ఇతర ప్రత్యేకతలను గమనంలోకి తీసుకొని, అందుబాటులో ఉన్న కేడరును, వనరులను అత్యంత సమర్ధవంతంగా వినియోగించుకోవాలి. ఈ ఆదేశాన్ని నిర్దిష్ట కాలనిర్ణయంతో అమలు చేయాలి.

## పార్లమెంటరీతత్వాన్ని ఎదుర్కోవలసిన ఆవశ్యకత

రాజకీయ సమీక్షా నివేదిక పార్టీలోపల పెరిగి పోతున్న పార్లమెంటరీతత్వాన్ని ప్రముఖంగా పేర్కొంది. పూర్తిగా ఎన్నికల కార్యకలాపాలపైనే ఆధారపడటం, వర్గ, ప్రజా పోరాటాలతో ప్రజాపునాదిని నిర్మించుకోవాలనే రాజకీయ ఎత్తుగడల పంథా అమలును అడ్డుకుంటుంది. అది పార్టీ స్వభావానే దెబ్బతీస్తుంది, కేడరును సైద్ధాంతికంగా నిర్వీర్యం చేస్తుంది.

## పార్లమెంటరీతత్వం అనేక విధాలుగా వెల్లడవుతుంది :

కేడరులో ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆసక్తి పెరగడం గురించి కొన్ని రాష్ట్రాల నివేదికలు తెలియచేస్తున్నాయి. పార్టీకి బలం లేని కొన్ని నియోజకవర్గాల్లో సైతం ఎన్నికల్లో పోటీచేయాలనుకుంటున్నారు. కొంతమందికి అభ్యర్థిత్వాన్ని నిరాకరించడం వారిలో అసంతృప్తికి దారి తీస్తున్నది. ఫలితంగా వారు ఎన్నికల సమయంలో సహాయనిరాకరణ చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో కేడరు పార్టీ నిర్ణయాన్ని ప్రత్యేకించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ధిక్కరిస్తున్నారు. కొన్ని కేసులలో అభ్యర్థులు డబ్బు ఖర్చుపెట్టడంలోను, ఇతర పద్ధతుల్లోను బూర్జువా పార్టీల మాదిరిగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది నిర్మాణపరమైన ఐక్యత కన్నా ఎన్నికల ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ గ్రూపిజానికి, ముఠాతత్వానికి పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో పార్లమెంటరీతత్వం, పార్లమెంటరీ అవకాశవాదం మహారాష్ట్ర, తెలంగాణ, రాజస్తాన్‌లలో వ్యక్తమయింది. ఎన్నికయిన ప్రజాప్రతినిధులు ప్రజాపోరాటాలకు ప్రత్యేకించి స్థానిక సంస్థల్లో దూరంగా ఉండటం అనేది మరొక తరహా పార్లమెంటరీ తత్వం. కొంతమంది, పూర్తిగా ఎన్నికల నియోజకవర్గాలపైనే కేంద్రీకరిస్తూ పార్టీ నిర్మాణ కార్యకలాపాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. కోల్‌కటా ప్లీనం పార్లమెంటరీతత్వపు విస్తారతను గుర్తిస్తూ, 1996 కేంద్రకమిటీ దిద్దుబాటు ఉద్యమ డాక్యుమెంటును ఈ విధంగా ఉటంకించింది: “పార్లమెంటరీతత్వం అనేది ఒక సంస్కరణవాద దృక్పథం. పార్టీ కార్యకలాపాలను ఎన్నికల పనికే పరిమితం చేస్తుంది. ప్రధానంగా ఎన్నికల్లో పోటీచేయడం ద్వారానే పార్టీ ముందుకెళుతుందన్న భ్రమను కలిగిస్తుంది. ఇది ప్రజాఉద్యమాలను నిర్మించే పనిని, పార్టీ నిర్మాణాన్ని,

సైద్ధాంతిక పోరాటాన్ని కొనసాగించడాన్ని నిర్లక్ష్యం చేయడానికి దారితీస్తుంది. ప్రజా ఉద్యమాలను, రాజకీయ పోరాటాలను బలోపేతం చేయడానికి పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర పనిని మిళితం చేయాలి."

స్థానికంగా వర్గ, ప్రజాపోరాటాలను నిర్వహించ లేకపోవడానికి ఒక ప్రధాన కారణం పార్లమెంటరీతత్వమే అని రాజకీయ సమీక్షా నివేదిక పేర్కొంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి బదులు వారితో రాజీ పడటానికి దారితీస్తుంది.

పార్లమెంటరీతత్వం వ్యాపించి ఉన్న నేటి పరిస్థితిలో పార్లమెంటరీయేతర కార్యకలాపాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. బూర్జువా, భూస్వామ్య వ్యవస్థకు బలమైన వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలంటే ఎన్నికల పోరాటాలకు, క్షేత్రస్థాయి పోరాటాలకు మధ్య సమతుల్యతను పాటించడం అవసరం. చారిత్రకంగా చూసినపుడు, ప్రజాపోరాటాల విస్తరణ చట్టసభల్లో ప్రాతినిధ్యాన్ని పెంచింది తప్ప, చట్టసభల్లో ప్రాతినిధ్యం ప్రజాపోరాటాలను పెంచలేదు.

ప్రత్యేకించి గత రెండు దశాబ్దాల కాలంలో నయా ఉదారవాద విధానాల అమలు రాజకీయాలపైన, ఎన్నికలపైన చూపిన ప్రభావంతో పార్లమెంటరీ రంగంలో కొత్త సవాళ్ళు ఆవిర్భవించాయి. ఎన్నికల్లో పెద్ద ఎత్తున డబ్బు ఖర్చుపెట్టడం, కార్పొరేట్ల ఆధ్వర్యంలో ప్రచారాలు, రాజకీయ పార్టీలలో పెట్టుబడిదారీ ప్రయోజనాలు వేళ్లూనుకొనడం– ఇది పంచాయతీ స్థాయివరకు– వామపక్షాలకు రాజకీయ ప్రదేశాన్ని పరిమితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో పార్లమెంటరీతత్వానికి లోబడితే, అది పార్టీ నిర్మాణపరమైన బలాన్ని తగ్గిస్తుంది.

## దిద్దుబాటు ఉద్యమం

పార్టీకి ఎదురవుతున్న సవాళ్ళ దృష్ట్యా నూతనంగా ఎన్నికయిన కేంద్ర కమిటీ తదుపరి దశ దిద్దుబాటు ఉద్యమానికి ప్రణాళిక సిద్ధం చేయాలి. ఈ దశ ఉద్యమం, పార్లమెంటరీ తత్వాన్ని, సంబంధిత ఇతర అంశాలను ఎదుర్కొనడానికి తీసుకోవలసిన రాజకీయ, నిర్మాణపరమైన చర్యలపై కేంద్రీకరించాలి.

# 7. కర్తవ్యాలు

పార్టీ 23వ మహాసభ నిర్దేశించిన నిర్మాణ కర్తవ్యాల అమలు గురించిన పై సమీక్ష, పార్టీ మహాసభకు సమర్పించిన రాజకీయ సమీక్షా నివేదిక– ఈ రెండింటిని కలిపి చూసినపుడు క్రింది కర్తవ్యాలను నెరవేర్చవలసి ఉంటుంది. కర్తవ్యాలలో క్రింది ఐదింటిని ప్రాధాన్యతా కర్తవ్యాలుగా చేపట్టాలి.

1. పార్టీ సభ్యత్వ నాణ్యతను మెరుగుపరిచేందుకు, సభ్యత్వానికి ఐదు ప్రమాణాలను పూర్తిగా అమలు చేయాలి. కొత్త సభ్యులను ఆగ్జిలరీ గ్రూపులద్వారా సక్రమంగా రిక్రూట్ చేసుకోవాలి. 2026 పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో దీన్ని కచ్చితంగా అమలు చేయాలి.
2. పార్టీ శాఖలను క్రియాశీలం చేయడం: ఒక ఏడాదిలో ఎన్ని పార్టీ శాఖలను క్రియాశీలం చెయ్యాలో పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించాలి. శాఖా కార్యదర్శులకు శిక్షణాతరగతులు నిర్వహించడంతో పాటు, స్థానిక కమిటీలను/జిల్లా కమిటీలను కూడ ఈ పనిచేసేలా సన్నద్ధం చేయాలి.
3. పార్టీలో యువ సభ్యుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి. ఈ దిశగా అవసరమైన రాజకీయ, నిర్మాణపరమైన చర్యలు చేపట్టాలి.
4. పార్టీ కమిటీలు – కేంద్ర కమిటీ నుండి క్రింది స్థాయి వరకు– తమకు సంబంధించిన అన్ని వేదికలను, శక్తులను హిందుత్వ మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా స్థిరమైన పోరాటాలు చేపట్టేలా సమన్వయం చేయాలి, మార్గదర్శకత్వం వహించాలి, పర్యవేక్షించాలి.
5. రాష్ట్ర కమిటీలు, జిల్లా కమిటీలు, స్థానిక కమిటీలు స్థానిక సమస్యలపై స్థిరమైన పోరాటాలు చేపట్టేలా స్థానిక యూనిట్లకు, శాఖలకు సహాయం చేయాలి. క్షేత్ర స్థాయి సమస్యలపై నిర్దిష్ట అధ్యయనాలు చేపట్టాలి. దాని ఆధారంగా కొత్త ఎత్తుగడలు, నినాదాలు రూపొందించుకోవాలి. తద్వారా గ్రామీణ సంపన్న వర్గాలకు వ్యతిరేకంగా గ్రామీణ పేదలను పోరాటాలకు కదిలించాలి.

**ఇతర ముఖ్యమైన కర్తవ్యాలు :**

1. ఆధునిక మాన్యుఫాక్చరింగ్ రంగంలోని, కీలక రంగంలోని కార్మికులను, సంఘటిత రంగంలోని కంట్రాక్టు కార్మికులను సంఘటితం చేయడంపై నొక్కి చెప్పింది.
2. పార్టీలో మహిళా సభ్యత్వాన్ని పెంచడానికి ప్రణాళికాబద్ధమైన కృషి. మొత్తం సభ్యత్వంలో 25 శాతం మంది మహిళలుండాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలి.
3. పార్టీ ప్రాథమిక విద్యా సిలబస్‌తో అందరు సభ్యులు కవర్ అయ్యేలా పార్టీ విద్యను గరిపేందుకు కృషి కొనసాగింపు.
4. గణనీయమైన ఆదివాసీ జనాభా కలిగిన రాష్ట్రాలలో ఎంపిక చేసిన ప్రాంతాలపై కేంద్రీకరణ.
5. పార్లమెంటరీతత్వంపైన, ఇతర సంబంధిత సమస్యలపైన కేంద్రకమిటీ ఆధ్వర్యంలో దిద్దుబాటు ఉద్యమం చేపట్టాలి.
6. పార్టీని, ప్రజాసంఘాలను కొత్త ప్రాంతాలు, కొత్త సెక్షన్లలోకి విస్తరించడానికి రాష్ట్రాలవారీ ప్రణాళికలు. దీన్ని పిబి/సిసిలతో సంప్రదించి అమలుచేయాలి.
7. సరియైన నిర్మాణ రూపాలతో గ్రామీణ కార్మికులను సంఘటితం చేయడానికి చర్యలు ఆరంభించడం.
8. వికేంద్రీకృత, పట్టువిడుపులతో కూడిన నిర్మాణ స్వరూపాలతో పట్టణ నివాస ప్రాంతాలలో ప్రత్యేకించి మురికివాడలు, బస్తీలు,అపార్ట్‌మెంట్లు, దిగువ మధ్య తరగతి ప్రాంతాలలో కార్యకలాపాలను విస్తరించడం.
9. పార్టీ నిర్మాణంలో సోషల్ మీడియా పనిని వినియోగించే కృషిని రాష్ట్ర కమిటీలు కొనసాగించడం.

ఈ కర్తవ్యాల అమలుపై కేంద్ర కమిటీ మధ్యంతర సమీక్షను నిర్వహించాలి.

## పార్టీ సభ్యత్వం
## (23వ మహాసభ తర్వాత)

| రాష్ట్రం పేరు | సభ్యత్వం | | | |
|---|---|---|---|---|
| | **2020** | **2021** | **2022** | **2023** |
| అండమాన్ & నికోబార్ | 163 | 175 | 244 | 301 |
| ఆంధ్రప్రదేశ్ | 23,130 | 22,604 | 22,096 | 23,026 |
| అస్సాం | 11,644 | 11,605 | 11,221 | 10,973 |
| బీహార్ | 19,400 | 19,617 | 19,786 | 20,221 |
| ఛత్తీస్‌ఘడ్ | 1,344 | 1,355 | 1,408 | 1,383 |
| ఢిల్లీ | 2,213 | 2,246 | 1,979 | 2,032 |
| గోవా | 45 | 45 | 45 | 45 |
| గుజరాత్ | 3,724 | 3,803 | 3,824 | 3,869 |
| హర్యాన | 2,191 | 1,999 | 1,941 | 2,016 |
| హిమాచల్ ప్రదేశ్ | 2,205 | 2,212 | 2,029 | 2,056 |
| జమ్మూ & కాశ్మీర్ | 1,660 | 1,692 | 2,030 | 1,886 |
| జార్ఖండ్ | 5,185 | 5,289 | 5,224 | 5,505 |
| కర్నాటక | 8,052 | 8,037 | 8,596 | 8,704 |
| కేరళ | 5,27,174 | 5,74,261 | 5,67,123 | 5,64,895 |
| మధ్యప్రదేశ్ | 2,608 | 2,561 | 2,163 | 2,158 |
| మహారాష్ట్ర | 12,807 | 13,374 | 13,691 | 14,406 |
| మణిపూర్ | 451 | 501 | 714 | 827 |
| ఓడిశా | 3,647 | 3,448 | 3,352 | 3,465 |
| పాండిచ్చేరి | -- | -- | 786 | 812 |
| పంజాబ్ | 8,389 | 8,410 | 8,429 | 8,699 |
| రాజస్థాన్ | 5,218 | 5,609 | 5,464 | 5,232 |
| తమిళనాడు | 93,982 | 92,349 | 91,422 | 93,823 |
| తెలంగాణ | 32,177 | 38,581 | 39,395 | 38,143 |
| త్రిపుర | 50,612 | 49,386 | 44,381 | 39,626 |
| ఉత్తరాఖండ్ | 1,451 | 1,455 | 1,507 | 1,519 |
| ఉత్తర్ ప్రదేశ్ | 5,368 | 5,257 | 5,064 | 5,146 |
| వెస్ట్ బెంగాల్ | 1,60,827 | 1,54,322 | 1,57,047 | 1,58,143 |
| కేంద్రం | 90 | 89 | 96 | 98 |
| మొత్తం | **9,85,757** | **10,30,282** | **10,21,057** | **10,19,009** |

## ట్రేడ్ యూనియన్ సభ్యత్వం
## (23వ మహాసభ తర్వాత)

| రాష్ట్రం పేరు | **2020** | **2021** | **2022** | **2023** |
|---|---|---|---|---|
| అండమాన్ & నికోబార్ | 6,454 | 6,572 | 7,557 | 8,393 |
| ఆంధ్రప్రదేశ్ | 4,50,050 | 4,89,165 | 3,92,969 | 4,13,147 |
| అస్సాం | 96,110 | 1,01,093 | 1,01,215 | 1,03,250 |
| బీహార్ | 11,680 | 52,771 | 31,008 | 20,150 |
| ఛత్తీస్‌ఘడ్ | 18,587 | 23,071 | 25,596 | 28,696 |
| ఢిల్లీ | 26,200 | 20,878 | 19,126 | 17,191 |
| గోవా | 145 | 151 | 392 | - |
| గుజరాత్ | 17,391 | 20,621 | 28,252 | 32,709 |
| హర్యాన | 55,455 | 65,240 | 48,776 | 55,014 |
| హిమాచల్ ప్రదేశ్ | 45,761 | 48,965 | 46,551 | 31,230 |
| జమ్మూ & కాశ్మీర్ | 4,474 | 13,306 | 13,270 | 8,630 |
| జార్ఖండ్ | 51,143 | 56,564 | 67,963 | 23,724 |
| కర్నాటక | 2,16,307 | 2,54,420 | 2,20,829 | 2,04,543 |
| కేరళ | 23,84,727 | 27,45,343 | 30,04,886 | 31,06,762 |
| మధ్యప్రదేశ్ | 45,085 | 46,252 | 46,936 | 44,113 |
| మహారాష్ట్ర | 1,69,735 | 1,74,843 | 1,72,591 | 1,73,394 |
| మణిపూర్ | | 14 | -- | -- |
| మిజోరాం | | -- | 2,556 | -- |
| ఒడిశా | 71,041 | 67,361 | 63,674 | 56,978 |
| పాండిచ్చేరి | 3,701 | 4,416 | 3,819 | 4,699 |
| పంజాబ్ | 53,598 | 63,077 | 84,219 | 87,598 |
| రాజస్థాన్ | 56,732 | 59,713 | 55,443 | 55,767 |
| తమిళనాడు | 5,43,457 | 5,44,341 | 5,21,754 | 5,05,136 |
| తెలంగాణ | 1,50,533 | 2,70,636 | 2,44,012 | 2,09,225 |
| త్రిపుర | 86,152 | 94,473 | 97,024 | 89,107 |
| ఉత్తరాఖండ్ | 12,559 | 14,890 | 17,511 | 18,950 |
| ఉత్తర్ ప్రదేశ్ | 14,975 | 16,326 | 18,619 | 17,690 |
| వెస్ట్ బెంగాల్ | 9,25,995 | 10,58,782 | 9,82,560 | 10,25,431 |
| మొత్తం | **55,18,047** | **63,13,284** | **63,19,108** | **63,41,527** |

## కిసాన్ ఫ్రంట్ సభ్యత్వం
## (23వ మహాసభ తర్వాత)

| రాష్ట్రం పేరు | 2020-21 | 2021-22 | 2022-23 | 2023-24 |
|---|---|---|---|---|
| అండమాన్ & నికోబార్ | 455 | 500 | 900 | 2,300 |
| ఆంధ్రప్రదేశ్ | 1,32,140 | 1,73,159 | 1,66,120 | 1,57,518 |
| అస్సాం | 66,506 | 1,07,915 | 1,30,246 | 1,10,062 |
| బీహార్ | 1,25,194 | 2,64,910 | 2,82,583 | 2,81,572 |
| ఛత్తీస్‌ఘడ్ | 4,012 | 12,075 | 13,169 | 9,110 |
| ఢిల్లీ | | | 2,219 | 2,238 |
| గోవా | | | 167 | 138 |
| గుజరాత్ | 41,239 | 50,198 | 47,697 | 50,600 |
| హర్యాన | 28,540 | 48,851 | 54,311 | 56,400 |
| హిమాచల్ ప్రదేశ్ | 27,093 | 30,000 | 23,810 | 31,008 |
| జమ్మూ & కాశ్మీర్ | 30,000 | 25,000 | 40,000 | 39,276 |
| జార్ఖండ్ | 48,630 | 57,392 | 79,028 | 1,08,280 |
| కర్నాటక | 89,301 | 1,66,935 | 1,40,184 | 1,32,298 |
| కేరళ | 52,60,505 | 57,76,682 | 63,05,781 | 67,70,940 |
| మధ్యప్రదేశ్ | 21,374 | 31,536 | 44,552 | 49,333 |
| మహారాష్ట్ర | 1,85,656 | 3,09,544 | 2,93,243 | 3,00,476 |
| మణిపూర్ | 785 | 1,441 | 1,966 | 2,221 |
| ఒడిశా | 41,615 | 54,966 | 69,650 | 53,015 |
| పాండిచ్చేరి | | | 5,350 | 5,750 |
| పంజాబ్ | 78,249 | 85,250 | 90,705 | 1,18,080 |
| రాజస్థాన్ | 1,76,046 | 3,28,505 | 2,51,843 | 1,12,101 |
| తమిళనాడు | 5,76,391 | 8,00,146 | 8,16,466 | 9,82,394 |
| తెలంగాణ | 2,75,015 | 4,02,115 | 4,23,286 | 4,24,398 |
| త్రిపుర | 2,56,626 | 2,45,722 | 2,36,980 | 1,70,008 |
| ఉత్తరాఖండ్ | 11,986 | 16,120 | 10,352 | 10,582 |
| ఉత్తర్ ప్రదేశ్ | 1,95,220 | 2,51,586 | 2,16,066 | 2,22,500 |
| వెస్ట్ బెంగాల్ | 40,68,922 | 44,38,175 | 46,22,685 | 44,85,584 |
| ఏఐకెఎస్ కేంద్రం | 13 | 12 | 12 | 12 |
| మొత్తం | **1,17,41,513** | **1,36,78,735** | **1,43,69,371** | **1,46,88,194** |

## వ్యవసాయ కార్మికుల ఫ్రంట్ సభ్యత్వం (23వ మహాసభ తర్వాత)

| రాష్ట్రం పేరు | **2020-21** | **2021-22** | **2022-23** | **2023-24** |
|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 4,77,155 | 4,84,156 | 4,91,893 | 4,97,655 |
| అస్సాం | -- | -- | 2,326 | 2,420 |
| బీహార్ | 1,35,042 | 1,42,108 | 1,43,495 | 1,14,273 |
| హర్యాన | 21,542 | 26,782 | 17,510 | 21,040 |
| జార్ఖండ్ | 3,227 | 4,125 | -- | -- |
| కర్నాటక | 2,28,194 | 3,02,671 | 3,23,175 | 3,39,875 |
| కేరళ | 25,03,380 | 25,60,237 | 26,47,970 | 27,07,404 |
| మధ్యప్రదేశ్ | 1,109 | 1,600 | 3,782 | 4,782 |
| మహారాష్ట్ర | 58,018 | 60,177 | 70,664 | 62,282 |
| ఒడిశా | 18,200 | 21,180 | 22,400 | 20,380 |
| పాండిచ్చేరి | -- | -- | 7,000 | 10,000 |
| పంజాబ్ | 2,30,600 | 2,23,187 | 2,54,392 | 2,37,424 |
| రాజస్థాన్ | 31,700 | 32,907 | 33,209 | 34,771 |
| తమిళనాడు | 4,47,103 | 6,13,825 | 6,80,521 | 7,31,114 |
| తెలంగాణ | 9,11,516 | 11,04,006 | 11,49,548 | 10,25,561 |
| త్రిపుర | 96,646 | 1,06,060 | 1,05,060 | 81,648 |
| ఉత్తర్ ప్రదేశ్ | 1,31,568 | 1,68,244 | 1,78,071 | 2,00,008 |
| వెస్ట్ బెంగాల్ | 15,10,031 | 17,05,573 | 18,29,910 | 15,36,935 |
| ఆల్ ఇండియా సెంటర్ | 7 | 6 | 6 | 6 |
| మొత్తం | **68,05,038** | **75,56,844** | **79,60,932** | **76,27,578** |

## మహిళా ఫ్రంట్ సభ్యత్వం
## (23వ మహాసభ తర్వాత)

| రాష్ట్రం పేరు | 2021 | 2022 | 2023 | 2024 |
|---|---|---|---|---|
| అండమాన్ & నికోబార్ | -- | -- | 250 | 250 |
| ఆంధ్రప్రదేశ్ | 1,67,497 | 1,88,760 | 2,08,852 | 2,17,329 |
| అస్సాం | 52,591 | 59,084 | 83,431 | 80,707 |
| బీహార్ | 68,524 | 40,000 | 37,906 | 41,000 |
| ఛతీస్ఘడ్ | 2,100 | -- | -- | 450 |
| ఢిల్లీ | 50,810 | 44,199 | 44,943 | 31,273 |
| గుజరాత్ | 8,544 | 10,304 | 6,520 | 16,571 |
| హర్యాన | 34,000 | 28,160 | 32,668 | 35,000 |
| హిమాచల్ ప్రదేశ్ | 12,142 | 11,240 | 6,747 | 7,792 |
| జమ్మూ & కాశ్మీర్ | -- | -- | -- | 700 |
| జార్ఖండ్ | 65,460 | 49,000 | 43,020 | 48,621 |
| కర్నాటక | 87,869 | 89,082 | 94,640 | 90,031 |
| కేరళ | 54,50,944 | 56,90,296 | 59,32,863 | 59,87,483 |
| మధ్యప్రదేశ్ | 12,750 | 12,332 | 7,095 | 9,766 |
| మహారాష్ట్ర | 1,07,478 | 1,11,412 | 1,15,227 | 1,18,147 |
| మణిపూర్ | 2,859 | 4,119 | 1,153 | 2,117 |
| ఒడిశా | 30,075 | 29,000 | 29,100 | 38,065 |
| పాండిచ్చేరి | -- | -- | 11,945 | 14,164 |
| పంజాబ్ | 20,106 | 16,250 | 18,000 | 21,560 |
| రాజస్థాన్ | 19,402 | 20,410 | 17,732 | 17,315 |
| తమిళనాడు | 7,15,490 | 6,74,200 | 6,83,755 | 7,04,960 |
| తెలంగాణ | 2,40,000 | 3,23,000 | 3,20,000 | 3,53,000 |
| త్రిపుర | 1,35,656 | 1,37,798 | 95,740 | 1,10,264 |
| ఉత్తరాఖండ్ | 6,705 | 7,576 | 3,385 | 4,655 |
| ఉత్తర్ ప్రదేశ్ | 39,600 | 41,148 | 43,444 | 45,338 |
| వెస్ట్ బెంగాల్ | 23,00,514 | 24,66,684 | 25,10,328 | 25,24,884 |
| **మొత్తం** | **96,31,116** | **1,00,54,054** | **1,03,48,744** | **1,05,21,442** |

## యువత ఫ్రంట్ సభ్యత్వం
## (23వ మహాసభ తర్వాత)

| రాష్ట్రం పేరు | 2021 | 2022 | 2023 | 2024 |
|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 75,550 | 55,000 | 62,400 | 75,000 |
| అస్సాం | 6,100 | 14,562 | 12,556 | 12,787 |
| బీహార్ | 40,115 | 48,144 | 44,400 | 44,700 |
| ఛత్తీస్‌ఘడ్ | 1,200 | -- | -- | -- |
| ఢిల్లీ | 7,000 | 5,000 | 7,230 | 5,000 |
| గుజరాత్ | -- | -- | 5,078 | 4,332 |
| హర్యానా | 5,206 | 3,442 | 3,500 | 3,300 |
| హిమాచల్ ప్రదేశ్ | 2,661 | 1,713 | 1,678 | 869 |
| జమ్మూ & కాశ్మీర్ | 5,000 | 5,640 | 5,500 | 6,000 |
| జార్ఖండ్ | 40,745 | 40,090 | -- | -- |
| కర్నాటక | 17,051 | 32,029 | 24,300 | 20,507 |
| కేరళ | 51,99,585 | 52,27,423 | 52,12,108 | 52,16,494 |
| మధ్యప్రదేశ్ | 4,923 | 2,127 | 3,791 | 5,344 |
| మహారాష్ట్ర | 1,58,807 | 1,44,500 | 1,53,408 | 1,37,823 |
| ఓడిశా | 20,000 | 23,715 | 17,984 | 19,191 |
| పాండిచ్చేరి | -- | 4,200 | -- | 2,400 |
| పంజాబ్ | 45,000 | 42,600 | 40,000 | 43,800 |
| రాజస్థాన్ | 46,000 | 40,000 | 36,000 | 39,743 |
| సిక్కిం | 300 | -- | -- | -- |
| తమిళనాడు | 7,14,731 | 5,03,928 | 5,67,784 | 5,62,820 |
| తెలంగాణ | 1,20,816 | 1,21,800 | 1,30,100 | 1,42,550 |
| త్రిపుర | 1,82,250 | 1,64,673 | 95,079 | 1,13,757 |
| ఉత్తరాఖండ్ | 4,923 | -- | -- | -- |
| ఉత్తర్ ప్రదేశ్ | 27,206 | 22,269 | 17,328 | 20,786 |
| వెస్ట్ బెంగాల్ | 29,13,960 | 30,03,720 | 30,92,886 | 31,44,673 |
| కేంద్రం | 6 | 3 | 3 | 3 |
| **మొత్తం** | **96,39,135** | **95,06,578** | **95,33,113** | **96,21,879** |

| విద్యార్థి ఫ్రంట్ సభ్యత్వం<br>(23వ మహాసభ తర్వాత) | | | | |
|---|---|---|---|---|
| **రాష్ట్రం పేరు** | **2020-21** | **2021-22** | **2022-23** | **2023-24** |
| ఆంధ్రప్రదేశ్ | 62,751 | 4,17,242 | 3,70,321 | 4,24,444 |
| అస్సాం | 4,851 | 13,075 | 12,199 | 13,000 |
| బీహార్ | 12,705 | 12,000 | 14,922 | 12,005 |
| ఛత్తీస్‌ఘడ్ | -- | -- | 870 | 721 |
| ఢిల్లీ | 1,624 | 3,062 | 7,760 | 4,545 |
| గుజరాత్ | 1,410 | 6,120 | 4,920 | 3,450 |
| హర్యాన | 3,370 | 2,670 | 5,789 | 8,265 |
| హిమాచల్ ప్రదేశ్ | 5,218 | 15,604 | 16,172 | 15,038 |
| జమ్మూ & కాశ్మీర్ | -- | 500 | 1,590 | 1,725 |
| జార్ఖండ్ | -- | 425 | 613 | 520 |
| కర్నాటక | 25,036 | 33,000 | 39,118 | 32,000 |
| కేరళ | 14,90,568 | 15,48,192 | 15,93,873 | 16,63,865 |
| మధ్యప్రదేశ్ | 1,206 | 5,152 | 7,019 | 7,177 |
| మహారాష్ట్ర | 4,400 | 30,013 | 34,341 | 35,165 |
| ఒడిశా | -- | 1,323 | 2,042 | 1,919 |
| పాండిచ్చేరి | -- | -- | 1,950 | 4,329 |
| పంజాబ్ | -- | 1,565 | 750 | -- |
| రాజస్థాన్ | 42,725 | 96,204 | 91,171 | 76,352 |
| తమిళనాడు | 1,07,000 | 2,90,354 | 3,54,418 | 3,82,969 |
| తెలంగాణ | 30,000 | 5,12,684 | 4,17,965 | 512,684 |
| త్రిపుర | 20,502 | 22,018 | 27,164 | 13,081 |
| ఉత్తరాఖండ్ | 850 | 1,478 | 1,875 | 1,178 |
| ఉత్తర్ ప్రదేశ్ | 1,613 | 3,768 | 3,124 | 3,608 |
| వెస్ట్ బెంగాల్ | 5,13,019 | 7,44,306 | 8,39,185 | 8,30,849 |
| అభ్యుదయ విద్యార్థి ఫోరం | -- | | 136 | 124 |
| యు.కె. ఐర్లాండ్ | -- | 70 | 230 | 253 |
| సిఇసి | 6 | 6 | 7 | 7 |
| **మొత్తం** | **23,28,854** | **37,60,831** | **38,49,524** | **40,49,273** |

# పార్ట్ - II

## ప్రజాసంఘాల నివేదిక
## ట్రేడ్ యూనియన్

కార్పొరేట్–మతతత్వ కూటమి మద్దతుతోనూ, హిందూత్వ ఫాసిస్టు సైద్ధాంతిక భావజాలం గల ఆర్ఎస్ఎస్ మద్దతుతోనూ పాలిస్తున్న బిజెపి ప్రభుత్వ ప్రమాదకర విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మిక వర్గం కీలక పాత్ర పోషిస్తుంది. మనల్ని వెంటాడుతున్న బలహీనతల్ని అధిగమించి కార్మికవర్గంలో మన ప్రభావాన్ని బలపరుచుకోవడం ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో చాలా అవసరం.

గత కొన్ని పార్టీ మహాసభలు ఈ క్రింది బలహీనతలను గర్తించి, ట్రేడ్ యూనియన్ రంగంలోనే వీటిని అధిగమించేందుకు కొన్ని ఆదేశాలు ఇచ్చాయి. సంగ్రహంగా ఆ ఆదేశాలు ఇవి:

1. ఇప్పుడు ముందుకొస్తున్న హై–టెక్ పరిశ్రమలతో సహా వ్యూహాత్మక సంఘటిత రంగంలో ఉద్యమాలను బలపరచాలి. ఈ కృషిని అసంఘటిత రంగానికి కూడా విస్తరించాలి.
2. స్కీం వర్కర్ల ఉద్యమాన్ని విస్తరించడంపైనా, క్రింది స్థాయి ప్రజల్లో పనిచేసే ఈ యూనియన్ కార్యకర్తలకు రాజకీయ తర్ఫీదు ఇవ్వడంపైనా కేంద్రీకరించాలి.
3. పట్టణ పేదలతో మన సంబంధాలను బలపరుచుకోడానికిగాను నివాస ప్రాంతాల్లో కార్యకలాపాలను నిర్వహించాలి.
4. యూనియన్ స్థాయి కమిటీలను సమర్ధంగా పనిచేయించడం ద్వారా యూనియన్లను స్వతంత్రంగా, ప్రజాస్వామ్యయుతంగా నడవనివ్వాలి.

5. కార్మిక–రైతాంగ ఐక్యతను పెంపొందించడంపై మరింత చొరవ తీసుకోవాలి.
6. మతతత్వ వేర్పాటువాద శక్తులకు వ్యతిరేకంగా, ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలోని హిందుత్వ మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రణాళికాబద్ధమైన, కేంద్రీకృతమైన క్యాంపెయిన్ నిర్వహించాలి.
7. కార్యకర్తల, కార్మిక జనబాహుళ్య సైద్ధాంతిక చైతన్యాన్ని పెంచాలి.
8. సామాజిక సమస్యల విషయంలో చురుకుగా జోక్యం చేసుకోవాలి. సామాజిక అణచివేతను ఎదిరించాలి.
9. ఆయా పార్టీ రాష్ట్ర కమిటీల చొరవతో అన్ని స్థాయిల్లో పార్టీ సబ్ కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలను బలోపేతం చేయడం ద్వారా పార్టీ నిర్మాణానికి నిరంతర కృషి చేయాలి.
10. ఐక్య ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను పెంపొందించడం ద్వారా మొత్తం కార్మికవర్గాన్ని ఐక్యపరచడానికి కృషి చేయాలి.

ట్రేడ్ యూనియన్ రంగం ఈ కాలంలో ఈ ఆదేశాలను అమలు పరిచడానికి కృషి చేస్తున్నది. పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రమవుతుండడంతో పాలక వర్గాలు నయా–ఉదారవాద విధానాలను మరింత దూకుడుగా అమలుపరుస్తున్నాయి. ఉపాధి సంబంధాలను పునర్వ్యవస్థీకరిస్తున్నాయి. రెగ్యులర్ ఉపాధి తగ్గిపోతున్నది. భద్రత లేని ఉద్యోగాలు పెరుగుతున్నాయి. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల శాశ్వత ఉద్యోగుల స్థానంలో చివరికి కాంట్రాక్టు కార్మికుల స్థానంలో అప్రంటిస్‌లనూ, ట్రైనీలనూ, ఇంటెర్న్‌లనూ ఉపయోగించుకోవడం పెరిగింది. దీని వల్ల కార్మికులను ఆర్గనైజ్ చేయడంలోనూ, వారిలో పార్టీని అభివృద్ధి చేయడంలోనూ ట్రేడ్‌యూనియన్లకు పెద్ద సవాళ్లు ఎదురవుతున్నాయి.

మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం మూడోసారి ఎన్నికైన తరువాత కొత్త లేబర్ కోడ్‌లు అమలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ కోడ్‌లు కార్మికవర్గాన్ని దాదాపు బానిసత్వంలోకి నెడతాయి. అందువల్ల జాతీయ స్థాయిలోనూ, సెక్టార్ల స్థాయిలోనూ, పనిప్రదేశాల స్థాయిలోనూ ఈ కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య ప్రతిఘటనను నిర్మించేందుకు ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఇప్పుడు సన్నద్ధమవ్వాలి. ఇప్పటికే ఈ సమస్యపై దేశవ్యాపిత సాధారణ సమ్మె చేయడానికి చొరవ తీసుకోవడం జరిగింది.

ఈ కాలంలో లౌకిక భారత రాజ్యాన్ని హిందూత్వ రాష్ట్రగా మార్చే ఉద్ధేశంతో ప్రభుత్వ ప్రాయోజిత కార్యకలాపాలు, విధానాలు చేపట్టడం జరిగింది. ఈ పరిణామాల ప్రభావం కార్మికవర్గ చైతన్యం మీద గణనీయంగా ఉంటుంది. బిజెపి మతతత్వ విద్వేష రాజకీయాలకు కార్మికవర్గం మరింత ఎక్కువగా గురయ్యే అవకాశాలు ఏర్పడతాయి. ఇది కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుంది. అందువల్ల ట్రేడ్ యూనియన్ రంగం మతతత్వానికి వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని తక్షణం, కృతనిశ్చయంతో చేపట్టాలి.

## ప్రధాన ఉద్యమాలు, ఆందోళనలు

ఉక్కు, బొగ్గు, ఇనుప ఖనిజం, పెట్రోలియం, పోర్టులు వంటి వివిధ ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో వేతనాలు, స్థిరమైన ఉపాధి, కాంట్రాక్టు కార్మికుల హక్కులు, ప్రైవేటీకరణ మొదలైన సమస్యలపై గణనీయమైన ఆందోళనలు జరిగాయి. అనేక సందర్భాల్లో సమ్మెలు కూడా జరిగాయి. పాక్షిక విజయాలు సాధించాం.

అయితే ఒక కీలకమైన బలహీనత మాత్రం కొనసాగుతోంది: కొన్ని ప్రధానమైన ప్రభుత్వ రంగ సంస్థల్లో జరిగిన సాధారణ సమ్మెల్లో మన స్వంత యూనియన్లు పరిమితంగా పాల్గొనడమో లేక పాల్గొనక పోవడమో జరిగింది. రాజకీయ జోక్యం ద్వారా దానిని అధిగమించాలి.

విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు డిస్కమ్‌లలో ప్రయివేటీకరణను ఉధృతంగా అమలు చేస్తున్నాయి. డైనమిక్ ధరలతో స్మార్ట్ మీటర్లు ప్రవేశపెడుతున్నాయి. అనేక రాష్ట్రాలలో ఐక్య పోరాటాలు ఈ ప్రయత్నాలను తాత్కాలికంగా వెనక్కు నెట్టాయి. ఇందులో మన ఫెడరేషన్లు నాయకత్వ పాత్ర పోషించాయి. అయితే, చండీఘర్ కేంద్రపాలిత ప్రాంతంలో కార్మికుల నుండీ, సాధారణ ప్రజలనుండీ తీవ్రమైన వ్యతిరేకత వచ్చినప్పటికీ ప్రయివేటీకరణ జరిగిపోయింది. విద్యుత్ కార్మికుల సంయుక్త వేదిక సెక్టర్స్‌వారీ సమ్మెతో సహా దేశవ్యాపిత ఆందోళనను ప్రకటించింది. కానీ కార్మికుల ప్రతిఘటన ఒక్కటే సరిపోదు. విద్యుత్ వినియోగదారులు చురుకుగా పాల్గొనడం కూడా అవసరం. ఇది జరగాలంటే పార్టీ చురుకుగా జోక్యం చేసుకోవాలి.

ప్రయివేటు రంగంలో మెడికల్ రిప్రజంటేటివ్స్, రోడ్డు రవాణా కార్మికులు, జూట్ కార్మికులు, ఇతరులు తమ ఉద్యోగాలు, పని పరిస్థితులపైనా, నయా ఉదారవాద

విధానాల ప్రతికూల ప్రభావాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారు. వీటిలో సమ్మె పోరాటాలు కూడా ఉన్నాయి. కొన్ని డిమాండ్లను సాధించుకోగలిగారు కూడా. మన యూనియన్లు ఈ పోరాటాల్లో అగ్రభాగాన ఉన్నాయి. నెలరోజులపాటు జరిగిన శామ్‌సంగ్ కార్మికుల సమ్మె ఒక మైలురాయివంటిది. ఇది అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ ఐక్య కార్మిక పోరాటంతో దిగివచ్చిన తమిళనాడు ప్రభుత్వం కార్మికుల పనిదినాన్ని పొడిగించే నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. కర్నాటకలో కూడా ఇటువంటి ప్రతిఘటనే. ప్రస్తుతానికి ప్రధాన పరిశ్రమల్లో పనిగంటలు పొడిగించకుండా అడ్డుకుంది. ఢిల్లీ – ఎన్‌సిఆర్, కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడుతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో సంఘటిత రంగ కార్మికులు నడిపిన అనేక ముఖ్యమైన పోరాటాల వల్ల కొన్ని ఒప్పందాలు కూడా కుదిరాయి.

కర్నాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లో ఐటి ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే ట్రేడ్ యూనియన్లు పనిగంటల పెంపు, పని–జీవితం మధ్య సమతుల్యత, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు మొదలైన సమస్యలపై ఆందోళనలు నిర్వహించాయి. ఈ ఆందోళనలకు ఐటి ఉద్యోగుల నుండి మంచి ప్రతిస్పందన వచ్చింది. ముఖ్యంగా కర్నాటకలో జరిగిన నిరసన ప్రదర్శనల్లో వందలాది మంది పాల్గొన్నారు. ప్రధానమైన అనేక ఐటి కంపెనీల్లో పరిశ్రమ స్థాయి గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగింది. వీటిలో సభ్యత్వం 30,000 కు పెరిగింది. సగం మంది సభ్యులు ఐటి ఉద్యోగులు కాగా మిగిలినవారు ఈ–గవర్నెన్స్, ఐటి కి చెందిన సర్వీసు ఉద్యోగులు. ఐటి ఉద్యోగులను నిరంతరాయంగా ఆర్గనైజ్ చేస్తే వారు ఒక తరగతిగా ట్రేడ్ యూనియన్లలోకీ, పార్టీ లోకీ వస్తారని అనుభవం చెబుతోంది.

కొన్ని రాష్ట్రాల్లో గిగ్ కార్మికుల క్యాంపెయిన్లు, ప్రదర్శనలతో వారిని సమీకరించే కృషి ప్రారంభమైంది. అయితే, ఈ సెక్షన్‌ను మరింత సమర్ధవంతంగా సమీకరించాలంటే మరింత నిబద్ధతగల కృషి, క్యాడర్ కేటాయింపు జరగాలి.

## స్కీం వర్కర్లు

మన నాయకత్వంలో జరిగిన స్కీం వర్కర్ల నిరంతర ఆందోళనలు ముఖ్యంగా అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశాలు, మధ్యాహ్నభోజన కార్మికుల ఆందోళనలు

గణనీయమైన విజయాలు సాధించాయి. ఈ ఆందోళనలు సృష్టించిన సానుకూల వాతావరణం వల్ల కొన్ని న్యాయపరమైన విజయాలు లభించాయి. గ్రాడ్యుటీ ఇస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు, అంగన్ వాడీ కార్మికులకు రెగ్యులరైజేషన్ తప్పనిసరి చేస్తూ, కనీస వేతనాలు ఇవ్వాలని చెబుతూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశం ఇందులో ఉన్నాయి. అయితే, ఈ విజయాలు సాధించుకున్నప్పటికీ స్కీం వర్కర్లలో పార్టీ ప్రభావం పరిమితంగానే ఉంది. మన నాయకత్వంలో వారు ఏ రాజకీయ శక్తులకు వ్యతిరేకంగా పోరాడారో వాటితో అనుబంధంగానే అనేక మంది కార్మికులు ఉంటున్నారు. ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక వంటి కొన్ని రాష్ట్రాల్లో వారిని పార్టీలోకి తీసుకునేందుకు చైతన్యపూర్వకమైన ప్రయత్నం జరిగింది, కానీ ఇతర రాష్ట్రాల్లో అలా జరగలేదు. ముఖ్యంగా హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో జరగలేదు. పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో కూడా మిలిటెంట్ కార్మికులను పార్టీలో రిక్రూట్ చేసుకునే కృషి తగినంతగా జరగలేదు. ఈ యూనియన్లలో కార్యకర్తలకు రాజకీయంగా తర్ఫీదు ఇచ్చి పార్టీని నిర్మిస్తే పార్టీ దేశమంతటా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించడానికి ఎంతగానో సహాయపడుతుంది.

## అసంఘటిత, సంప్రదాయ రంగాలు

ఇంటి పనివారు, నిర్మాణ కార్మికులు, జౌళి చేనేత కార్మికులు, ప్లాంటేషన్ కార్మికులు, బీడీ కార్మికులు వంటి అసంఘటిత, సంప్రదాయ రంగాల్లోని కార్మికులను సమీకరించడానికి కృషి జరిగింది. అయితే ఈ రంగాల్లో మన ట్రేడ్ యూనియన్ సభ్యత్వం గణనీయంగా పెరగలేదు. ఈ రంగాల్లో విధానపరమైన అంశాలవల్ల ఏర్పడిన సవాళ్లను అధిగమించడంలోనూ, తగిన డిమాండ్లను రూపొందించడంలోనూ, కార్మికులను సమీకరించడంలోనూ నాయకత్వం మరింత సమర్థత పెంచుకుని పనిచేయాలి.

## రైల్వేలు

రైల్వే రంగంలో నిరంతరాయమైన కృషి కొంత పురోభివృద్ధిని ఇచ్చింది. ఇటీవల జరిగిన గుర్తింపు ఎన్నికల్లో మన నాయకత్వంలోని రెండు యూనియన్లు గుర్తింపు పొందాయి. ఆర్ఎస్ఎస్ వాళ్లు ముఖ్యమైన మన సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి

ఎంతగా ప్రయత్నించినప్పటికీ మనం దాని నాయకత్వాన్ని నిలుపుకోగలిగాము. అయితే, ప్రభుత్వ విధానాలతో రాజీపడిపోతున్న గుర్తింపు పొందిన ఫెడరేషన్ల పట్ల రైల్వే ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతున్నందున దాన్ని ఉపయోగించుకుని మన ఉనికిని విస్తరించడానికిగాను మన కృషిని తీవ్రతరం చేయాలి.

## కాంట్రాక్ట్ కార్మికులు

కాంట్రాక్టు కార్మికులను సమీకరించడానికి చేసిన ప్రయత్నాలు బొంగైగాంవ్ రిఫైనరీ, బిఇఎంఎల్, తాల్ధి ఐరన్ ఓర్ గని, ఎన్‌హెచ్‌పిసి వంటి వివిధ రకాల పరిశ్రమల్లో పాక్షిక విజయాలు సాధించాయి. అయితే, ప్రయివేటు రంగంలో పనిచేసే రెగ్యులర్ కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికులను సమీకరించడంలో దూరంగా ఉంటున్నాయి. ఇది ఒక పెద్ద బలహీనతగా ఉంది.

## మధ్య తరగతి సంస్థలు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్, బీమా రంగాలకు చెందిన యూనియన్లు ప్రయివేటీకరణకు, కాంట్రాక్టురైజేషన్‌కు వ్యతిరేకంగానూ, పింఛన్ సంస్కరణల కోసం పోరాటాలు కొనసాగిస్తున్నాయి. పాత పింఛన్ విధానం కోసం జరిగుతున్న ఉద్యమ ప్రభావం ఎన్నికల మీద పడింది. సంస్కరణవాద యూనియన్లు రాజీధోరణలు విడనాడకపోయినప్పటికీ ఈ విషయంలో ఉద్యమంలోకి వచ్చాయి. అయితే ఈ రంగంలో పార్టీ ప్రభావం తగ్గిపోవడం కొనసాగుతున్నది. ఎన్ఎఫ్‌పిఇ, ఎఐపిఇ క్లాస్ 3 గుర్తింపు నుండి ప్రభుత్వం ఉపసంహరించుకోవడం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమంలో మానసికమైన భయాందోళనలు రేకెత్తించింది. ఈ సవాలు ఈ రంగంలో పార్టీ ప్రభావాన్ని తక్షణం పెంచాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తోంది.

## రిటైర్డ్ ఉద్యోగులు

మన నేతృత్వంలోని కొన్ని సంఘాలతో సహా పెన్షనర్ల సంఘాలు పెద్ద శక్తిగా ఉన్నప్పటికీ మనం వాటిని సక్రమంగా ఉపయోగించుకోలేకపోతున్నాం. రిటైర్డ్ ఉద్యోగులకు అనుభవం, సామాజిక ప్రభావం ఉంటుంది. దీన్ని మనం

ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో పనికీ, కొన్ని నిర్ధిష్ట కార్యకలాపాలకూ ఉపయోగించుకోవాలి.

## టియు సభ్యత్వ విశ్లేషణ

2023లో మన సభ్యత్వం 4,572 సంఘాల్లో 63.1 లక్షలు ఉంది. అనేక రాష్ట్రాల్లో సభ్యత్వం తగ్గిపోతున్నది. దీనికి ఒక ప్రధాన కారణం అనేక అఫిలియేట్ యూనియన్లు సమయానికి వార్షిక రిటర్న్‌లు సమర్పించకపోవడం. అయితే, ఈ కాలంలో 92,231 సభ్యత్వం కలిగిన 338 కొత్త యూనియన్లు మనతో కలిశాయి. ఇది కొత్త రంగాల్లోకి మన సంస్థాగత విస్తరణను తెలియజేస్తున్నది.

2023లో టియు రంగంలో మొత్తం 63.1 లక్షల సభ్యత్వానికిగాను 12.24 లక్షల సభ్యులు సంఘటిత రంగానికి చెందిన వారు. ఇందులో 6.81 లక్షల మంది ప్రయివేటు రంగానికి చెందినవారు. అయితే, మధ్యతరగతి ట్రేడ్‌యూనియన్లలో సభ్యత్వం తగ్గిపోవడం కొనసాగుతున్నది.

## కొన్ని ముఖ్యమైన చర్యలు

ఈ కాలంలో కొన్ని కొత్త అఖిల భారత రంగాల వారీ సమాఖ్యలు, సమన్వయ కమీలను ఏర్పాటు చేయడం జరిగింది. వీటిలో ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్ల అఖిల భారత సమాఖ్య, సెక్యూరిటీ గార్డుల జాతీయ సమన్వయ కమిటీలు, డిస్టిల్లరీ బ్రూవరీస్ కార్మిక సంఘాలు, టెక్స్‌టైల్స్ కార్మిక సంఘాలు, చేనేత కార్మిక సంఘాలు, టైర్ యూనియన్లు, ఆటోమొబైల్, ఆటో కాంపొనెంట్స్, ఇంటిపనివారల సంఘాలు మొదలైనవి ఉన్నాయి.

వలస కార్మికులను సమీకరించడానికి ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగింది. వలస కార్మికులను సమీకరించడం కోసం వారి స్వంత రాష్ట్రాలు, వారు వలస వచ్చిన రాష్ట్రాల మధ్య సమర్ధవంతమైన సమన్వయం ఏర్పాటు చేయడం కోసం నిర్ధిష్టమైన కర్తవ్యాలు రూపొందించడం జరిగింది.

ప్రయివేటు రంగంలోని ఆధునిక వస్తూత్పత్తి పరిశ్రమలతో సహా సంఘటిత రంగంలోని కార్మికులను సమీకరించడం కోసం వివిధ స్థాయిల నిర్మాణంలోని

నాయకులు/కార్యకర్తలకోసం అఖిల భారత టియు కేంద్రం నిర్ధిష్టమైన కర్తవ్యాలు రూపొందించింది. దీని అమలును పర్యవేక్షించడం కోసం తీవ్రమైన గట్టి కృషి జరిగింది.

యువ కార్మికులను సమీకరించి, వారిలో నుండి నాయకత్వాన్ని అభివృద్ధి చేసేందుకు యువ కార్మికుల/కార్యకర్తల జాతీయ సమావేశం ఒక ప్రణాళిక తయారు చేసింది.

## మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం

టియు రంగంలో మతతత్వానికి వ్యతిరేకంగా, ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలోని హిందూత్వ మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడటంపై సరైన కేంద్రీకరణ లేదని వచ్చిన విమర్శలను స్వీకరిస్తూ దీన్ని అధిగమించేందుకు టియు రంగం కొన్ని చర్యలు తీసుకున్నది. ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా ఒక నెలపాటు దేశవ్యాపిత ప్రచారాందోళన నిర్వహించింది. జాతీయ స్థాయిలో నాయకత్వ క్యాడర్‌కు నిర్వహించిన కేంద్ర ట్రేడ్‌యూనియన్ రాజకీయ పాఠశాలలో హిందూత్వ మతతత్వ ప్రమాదం గురించి బోధనాంశాన్ని చేర్చారు. వివిధ సెక్టార్‌లకు చెందిన సమాఖ్యలు తమ సభ్యులందరిలో ఈ అంశంపై ప్రచారం చేపట్టాయి. ఇన్సూరెన్స్ రంగంలో వివిధ ప్రాంతాలు/డివిజన్లలో మతతత్వ/కులతత్వ అస్తిత్వ వాదాలు, ఆర్‌ఎస్‌ఎస్ ఎలా పెరిగిపోతున్నాయో తెలియజేస్తూ ఇన్సూరెన్స్ రంగానికి చెందిన అఖిల భారత ఫ్రాక్షన్ కమిటీ ఒక నివేదిక తయారు చేసింది. ఈ ప్రభావాలను ఎదుర్కొనేందుకు కర్తవ్యాలను కూడా రూపొందించింది. ఇతర రంగాల్లోనూ, అన్ని రాష్ట్రాల్లోనూ ఇటువంటి కృషి చేయాల్సిన అవసరం ఉంది. దీన్ని శాఖల స్థాయికి కూడా తీసుకుపోవాలి. మతతత్వానికి వ్యతిరేకంగా రాజకీయ ప్రచారం చేయడమొక్కటే మతతత్వ ప్రమాదాన్ని ఎదుర్కోడానికి సరిపోదు. ట్రేడ్ యూనియన్లు మతతత్వ శక్తులను వాటి స్వంత స్థలంలోనే ఎదుర్కోవాలంటే అవి కార్మికులు నివసించే ప్రాంతాల్లోని ప్రజల రోజువారీ సామాజిక, సాంస్కృతిక జీవితాల్లో పాలుపంచుకోవాలి.

**రాజకీయ సైద్ధాంతిక చైతన్యం పెంచే కృషి :** ట్రేడ్ యూనియన్ రంగం తమ క్యాడర్‌కు అన్ని స్థాయిల్లో రాజకీయ చైతన్యం పెంచడానికి చర్యలు తీసుకున్నది. టియు రంగంలోని నాయకత్వ క్యాడర్‌కు జాతీయ స్థాయిలో రాజకీయ తరగతులు

నిర్వహించింది. ఇందులో బిఎస్ఎన్ఎల్, రాష్ట్ర ప్రభుత్వ, రక్షణ రంగ ఉద్యోగులు, అనేక పారిశ్రామిక సమాఖ్యలు, టియు రాష్ట్ర కమిటీల క్యాడర్ ఉన్నారు. అయితే ఈ కృషి ఏమాత్రం సరిపోదు.

రాజకీయ సైద్ధాంతిక చైతన్యం పెంచడానికి మనం చేసే కృషిలో పత్రికలు, ఇతర ప్రచురణలు ముఖ్యపాత్ర నిర్వహిస్తాయి. మన నాయకత్వంలోని ట్రేడ్‌యూనియన్లు జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలో స్థానిక భాషల్లోనూ, సెక్టారు స్థాయిలోనూ అనేక పత్రికలు ప్రచురిస్తున్నాయి. మధ్య తరగతి సంఘాలు కూడా ప్రచురిస్తున్నాయి. సాధారణంగా ఈ పత్రికలను ఉపయోగించుకుని మన కార్మికులను ఎడ్యుకేట్ చేయడానికి కృషి జరుగుతోంది. ఆయా సెక్టార్లలో కార్మికుల చైతన్యం పెంచడానికి అవి ఎంతవరకు తోడ్పడ్డాయో తెలుసుకోడానికి నిర్ధిష్టమైన అంచనాలకు రావడం అవసరం.

**సామాజిక సమస్యలపైనా, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా చురుకుగా జోక్యం చేసుకోవాలి:** ట్రేడ్ యూనియన్ రంగం సామాజిక సమస్యల్లో జోక్యం చేసుకోవడం అనేది మహిళా కార్మికుల లింగపరమైన సమస్యలకు మాత్రమే చాలా వరకు పరిమితమవుతున్నది. తమిళనాడు, తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కుల వివక్షకు వ్యతిరేకంగా పార్టీ నాయకత్వంలో పనిచేస్తున్న వేదికలు/సంస్థల్లో ట్రేడ్ యూనియన్లకు చెందిన అనేక మంది క్యాడర్ పాల్గొంటున్నప్పటికీ దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు మొదలైన వారి సామాజిక అణచివేత సమస్యలు చేపట్టేందుకు ఈ రంగంలో ప్రణాళికాబద్ధమైన కృషి జరగడం లేదు.

**శ్రామిక మహిళలు:** మన నాయకత్వంలోని యూనియన్లకు చెందిన వేదికల నుండి శ్రామిక మహిళలపై లైంగిక వేధింపులు, మహిళలపై హింస వంటి నిర్ధిష్ట సమస్యలను చేపడుతున్నప్పటికీ మిలిటెంట్ శ్రామిక మహిళల నుండి పార్టీ సభ్యులను తయారుచేసుకోవడంలో బలహీనత అనేక రాష్ట్రాల్లో కొనసాగుతోంది. కొన్ని రాష్ట్రాల్లో పార్టీలోకి మహిళలను తీసుకునేటప్పుడూ, నాయకత్వంలోకి వారిని ప్రమోట్ చేసేటప్పుడూ శ్రామిక మహిళలను పరిగణనలోకి తీసుకోకుండా ఉండే ధోరణి కనిపిస్తోంది.

**నివాస ప్రాంతాలు:** నివాస ప్రాంతాల్లో నిర్మాణాత్మక కార్యకలాపాలు పెంపొందించడంలో బలహీనత కొనసాగుతోంది. ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని మతతత్వ శక్తులు ప్రజలను వారి నివాస ప్రాంతాల్లోనే రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్

ఇంకా ఇతర సామాజిక సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా సమీకరిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో మనం ఈ బలహీనతను అధిగమించాల్సిన అవసరం ఉంది. ఈ కార్యకలాపాల్లో రిటైర్డ్ ఉద్యోగులు, ఇంకా అలాంటి వారు ముఖ్యమైన పాత్ర నిర్వహించగలుగుతారు. అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున నివసించే మురికి వాడల్లో నిర్మాణాత్మక కార్యకలాపాలు నిర్వహించడం వల్ల అక్కడి ప్రజలతో సంబంధాలు ఏర్పడతాయి, ఇంకా సంఘ బలం మీద వారికి విశ్వాసం పెరుగుతుంది. క్రమంగా వారిని ట్రేడ్‌యూనియన్లలోకి తీసుకోవచ్చు. దీన్ని రానున్న రోజుల్లో తీవ్ర విషయంగా తీసుకుని ఆయా పార్టీ కమిటీలతో కలిసి పనిచేయాలి.

## ట్రేడ్ యూనియన్ల ఉమ్మడి పోరాటానుభవాలు

ఇతర ట్రేడ్ యూనియన్లు సమ్మెలతో సహా ఐక్య పోరాటాలకు లాంఛనంగా అంగీకరించేప్పటికీ అవి పాల్గొనడం, ముఖ్యంగా సమ్మెల్లో పాల్గొనడం బాగా తగ్గిపోయింది. కానీ ఉమ్మడి పోరాటాల వల్ల వాటి వెనుకనున్న శ్రేణులను చేరుకునే అవకాశం లభిస్తుంది. అవి సమ్మెల్లోనూ, ఇతర ఆందోళనా రూపాల్లోనూ పాల్గొనడం లేదు/చాలా పేలవంగా పాల్గొంటున్నాయి అని ఆడిపోసుకునే బదులు మనం డిమాండ్లతో వారి సభ్యులను చేరుకోవాలి. ప్రభుత్వ కార్మిక–వ్యతిరేక విధానాలను వారికి తెలియజెప్పాలి. ఇది మాత్రమే మన సంస్థాగత పరిధిలో లేని విస్తారమైన కార్మిక శ్రేణులను మన విధానాలవైపు మళ్లిస్తుంది. మన ప్రభావాన్ని పెంచుతుంది. మన సంస్థను బలోపేతం చేస్తుంది. సమర్థవంతమైన ఆందోళన, ప్రచారాన్ని నిర్వహించడం ద్వారా మన స్వతంత్ర బలాన్ని పెంచుకోడానికి చైతన్యవంతమైన కృషి చేయడం ద్వారా మాత్రమే మనం ఐక్య ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని రక్షించుకోగలుగుతాం. నయా–ఉదారవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం గావించగలుగుతాం. ఐక్య సంఘటన ఎత్తుగడలను సరిగ్గా అమలుపరిచే విధంగా మనం మన పనిని తీర్చిదిద్దుకోవాలి.

## కార్మిక కర్షక ఐక్యత

టియు రంగం సమస్యల ప్రాతిపదికపై రైతు, వ్యవసాయ కార్మిక రంగాలతో కలిసి ఐక్య కార్యాచరణ చేపట్టడం ద్వారా కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక ఐక్యతను

నిర్మించడానికి కృషి కొనసాగించింది. కేంద్ర ట్రేడ్‌యూనియన్లు, ఎస్‌కెఎంల సంయుక్త వేదిక నుండి ఐక్య కార్యాచరణ నిర్వహించడం వల్లా, అందులో మనం నిర్వహించిన పాత్ర వల్లా వచ్చిన సానుకూల అనుభవాన్ని ఇకముందు కూడా కొనసాగించాలి.

మూడు రంగాల జాతీయ నాయకత్వం రెగ్యులర్‌గా సమావేశమవుతున్నాయి. కార్మిక కర్షక ఐక్య పోరాటంలో మన ఉమ్మడి వైఖరిని సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. ఉద్యమాన్ని నిలబెట్టడం పైనా ఉమ్మడిగా చర్చిస్తున్నాయి. రాష్ట్ర, జిల్లా, ఇంకా క్రింది స్థాయిలో ఈ మూడు రంగాల నాయకత్వం సమావేశమై ఉమ్మడి సమస్యలపై చర్చించి, క్షేత్రస్థాయిలో ఐక్య ఉద్యమాలను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తే అది క్రింది స్థాయిలో కార్మిక, కర్షక ఐక్యతకు తోడ్పడుతుంది.

## ప్రజాస్వామ్యం, స్వతంత్ర పని విధానం

ఈ కాలంలో కమిటీలు, అఫిలియేటెడ్ యూనియన్ల ప్రజాతంత్ర పని విధానం కోసం, యూనియన్ స్థాయి కమిటీలను చురుకుగా పనిచేయించడం కోసం ట్రేడ్‌యూనియన్ రంగం తీవ్ర ప్రయత్నాలు చేసింది. కొంత మెరుగుదల ఉంది. కానీ చేయాల్సింది ఇంకా చాలా ఉంది.

సంస్థను స్వతంత్రంగా పనిచేయించడంలో బలహీనత ఇంకా కొనసాగుతోంది.

## టియు సబ్-కమిటీ, ఫ్రాక్షన్ కమిటీ

టియు సబ్-కమిటీ తొమ్మిది సార్లు సమావేశమైంది. కానీ కేంద్ర టియు ఫ్రాక్షన్ కమిటీ మాత్రం ఈ కాలంలో కేవలం రెండు సార్లు మాత్రమే సమావేశమైంది. ఈ బలహీనతను అధిగమించాలి.

మనకున్న వివిధ యూనియన్లకు చెందిన ఫ్రాక్షన్ కమిటీల్లో సగం మాత్రమే రెగ్యులర్‌గా పనిచేస్తున్నాయి. మిగతా సగం మెరుగుపడాల్సి ఉంది.

అఖిల భారత సెక్టార్లకు చెందిన ఫ్రాక్షన్ కమిటీల నిర్ణయాలు/అవగాహనలను ఆయా సెక్టార్లకు చెందిన పార్టీ సభ్యులకు ఆలస్యం లేకుండా చేర్చాలి. దీనికోసం సరైన యంత్రాంగాన్ని రూపొందించాలి.

అనేక రాష్ట్రాల్లో టియు సబ్–కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీల పనివిధానంలో తీవ్రమైన బలహీనతలు పెద్దగా మార్పులేకుండా కొనసాగుతున్నాయి. ఈ కమిటీల పనిమీద పార్టీ రాష్ట్ర కమిటీలు దృష్టి పెట్టాలి. కార్మికవర్గపు వివిధ సెక్షన్లలో పార్టీని అభివృద్ధి చేయడానికి వీటికి తోడ్పడాలి.

**టియు రంగం సమీక్ష:** కేంద్ర కమిటీ 2022 అక్టోబర్ 29–31 తేదీల్లో జరిగిన సమావేశంలో ట్రేడ్ యూనియన్ రంగపు పనిని సమీక్షించింది. మన ఉద్యమాన్ని పట్టిపీడిస్తున్న కొన్ని బలహీనతల గురించి నిర్ధిష్టంగా చెప్పింది. టియు రంగానికి అది 10–పాయింట్ల కర్తవ్యాలను కూడా నిర్దేశించింది. అందులో ఒకటి 'ట్రేడ్ యూనియన్ రంగంలో కర్తవ్యాలు' పత్రాన్ని సరికొత్తగా రూపొందించాలని చెప్పింది. 1983 నుండి ఈ రంగంలో వచ్చిన ప్రధాన మార్పులను దృష్టిలో పెట్టుకుని ఈ పని చేయాలని చెప్పింది.

## పార్టీ నిర్మాణం

మొత్తం పార్టీ సభ్యుల్లో 48 శాతం మంది ట్రేడ్ యూనియన్ రంగం నుండి వచ్చారని, పార్టీ సభ్యుల్లో వీరిదే అత్యధిక శాతం అని ఇటీవల జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభల్లో వెలువడిన వివరాలను బట్టి తెలిసింది. అయితే మన నాయకత్వంలోని ట్రేడ్ యూనియన్ రంగపు ప్రభావం, దాని సభ్యత్వంతో పోలిస్తే కార్మికవర్గంలో ఇంకా చెప్పాలంటే మన నాయకత్వంలోని వివిధ ట్రేడ్ యూనియన్ల సభ్యత్వంపై మన పార్టీ ప్రభావం నామ మాత్రంగా ఉంది. మన పోరాటాలను పార్టీ ప్రభావం కింద మార్చడానికి కార్మికుల్లో రాజకీయ చైతన్యం పెంచేందుకు చాలా పెద్ద కృషి జరగాలి.

ట్రేడ్ యూనియన్ రంగంలో పనిచేస్తున్న అనేక మంది పార్టీ నాయకులు ఈ కర్తవ్యంపై తగినంత శ్రద్ధ పెట్టడం లేదు. ఫ్రాక్షన్ కమిటీలు రెగ్యులర్‌గా, సక్రమంగా పనిచేయడం, ఈ కమిటీల్లో పార్టీ అభివృద్ధి గురించి రెగ్యులర్‌గా చర్చించడం, వీటితోపాటు పార్టీ రాష్ట్ర నాయకత్వ రెగ్యులర్ పర్యవేక్షణ ఉంటేనే ఈ కర్తవ్యం నెరవేరుతుంది.

### టియు రంగపు ముఖ్యమైన కర్తవ్యాలు

1. ఆధునిక వస్తూత్పత్తి రంగంలోనూ ఇతర కీలక రంగాల్లోనూ, వాటితోపాటు కాంట్రాక్టు కార్మికుల్లోనూ పార్టీ నిర్మాణ పనికి ప్రాధాన్యత నివ్వాలి.

2. నివాస ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికి వాడల్లోనూ, దిగువ మధ్యతరగతి ప్రాంతాల్లోనూ మతతత్వ ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు మన కార్యకలాపాలను విస్తరించాలి. అసంఘటిత రంగ కార్మికులను సంఘటిత పరచాలి.
3. గ్రామీణ ప్రాంతాల్లోకి మన ప్రభావం విస్తరించేందుకు గాను గ్రామీణ మాన్యువల్ కార్మికుల్లోని సెక్షన్లలో పనిని బలోపేతం చేయాలి.
4. కార్మికుల్లో మతతత్వ, అభివృద్ధి నిరోధక సిద్ధాంతాలను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రచించాలి. కార్మిక వర్గ ప్రాంతాల్లో ఈ పనికి సాంస్కృతిక, సామాజిక కార్యకలాపాలను జోడించాలి.
5. నిరంతర రాజకీయ పాఠశాలలు, శిక్షణ ద్వారా క్యాడర్ల, మిలిటెంట్ కార్యకర్తల రాజకీయ–సైద్ధాంతిక చైతన్యాన్ని ఒక పద్ధతి ప్రకారం పెంచాలి.
6. అన్ని యూనియన్ల నుండి, కేంద్రాలనుండి ప్రణాళికా ప్రకారం పార్టీ రిక్రూట్‌మెంట్ చేయాలి. మహిళలు, నిరాదరణకు గురైన గ్రూపులు, యువ కార్మికులకు ప్రాతినిధ్యం ఉండేట్లు చూడాలి.
7. పార్టీ కర్తవ్యాల అమలులో ట్రేడ్ యూనియన్ సబ్–కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలను పార్టీ కమిటీలు పర్యవేక్షించి, మార్గదర్శకత్వం వహించాలి.
8. ప్రస్తుత వాస్తవికతలు, సవాళ్లు ప్రతిబింబించే విధంగా 'ట్రేడ్ యూనియన్ రంగంలో కర్తవ్యాలు' పత్రాన్ని తాజాపరచాలి.

ఈ సవాళ్లను ఎదుర్కోవడం, ఈ కర్తవ్యాలను పరిపూర్తి చేయడం ద్వారా మనం మన పోరాటాలను సంఘటితం చేసుకుని కార్మికవర్గంలో మన ప్రభావాన్ని విస్తరించగలుగుతాము.

## కిసాన్

23వ పార్టీ మహాసభ కిసాన్ రంగం ముందుంచిన కర్తవ్యాలను ఈ రంగం కృతనిశ్చయంతో చేపట్టింది. 2020–21 రైతాంగ పోరాటం విజయం సాధించిన

సందర్భంలో.. రైతాంగం ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలపై శక్తివంతమైన, నిరంతరాయమైన ఉద్యమాలను గుర్తించడంలోనూ, ప్రారంభించడంలోనూ కిసాన్ రంగ నాయకులు తమ పనివిధానాన్ని గణనీయంగా మార్చుకోవాలని 23వ పార్టీ మహాసభ పిలుపునిచ్చింది.

గత మూడేళ్ల కాలంలో క్షేత్ర స్థాయిలో క్యాంపెయిన్లు, పోరాటాలు నడపడానికి చురుకైన కృషి జరిగింది. ఈ వైపు రాష్ట్రాలను నడిపించడానికి అఖిల భారత నాయకత్వం పెద్ద కృషి చేసింది. సమస్యలను గుర్తించడంలోనూ, క్యాంపెయిన్లు, సమావేశాలు, పోరాటాలు నిర్వహించడంలోనూ, నాయకులు పాల్గొనడంలోనూ స్పష్టమైన మెరుగుదల ఉంది. అనేక రాష్ట్రాల్లో రాష్ట్ర నాయకత్వాలు కూడా అటువంటి జోక్యం చేసుకున్నాయి. కానీ గ్రామాలకు వెళ్లడం, రైతుల మధ్య నివసించడం, తక్షణ స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్మించడం అనే పని మాత్రం అనుకున్నంతగా జరగడం లేదు, దేశమంతటా ఒకేలాగా కూడా జరగడం లేదు.

బిజెపి ప్రభుత్వ కార్పొరేట్-అనుకూల విధానాలు, నిర్ణయాలకు వ్యతిరేకంగా సమస్యల-ప్రాతిపదికపై కిసాన్ రంగం చేస్తున్న ఐక్య పోరాటాలు, అందులో అది నిర్వహిస్తున్న పాత్ర వల్ల అది విస్తృత సెక్షన్ల మన్ననలు పొందింది. ఇటువంటి పోరాటాల్లోకి పెద్ద సెక్షన్లను తీసుకురాగలిగింది. దీన్ని సంఘటితం చేయాలంటే ఈ పోరాటాల వెంట నిరంతరాయమైన, స్వతంత్ర, ఫలితాలూవచ్చే స్థానిక పోరాటాలు జరగాలి.

స్థానిక పోరాటాలను పక్కనబెట్టి అఖిల భారత పిలుపులపై ఎక్కుగా ఆధారపడినా లేక టోకెనిజం (ఏదో చేశామన్నట్లు చేయడం) లో కూరుకుపోయినా మొదటి రకం పోరాటాల వల్ల వచ్చిన ప్రయోజనాలు కూడా ఆవిరైపోతాయి. కిసాన్ రంగం ఈ విషయాన్ని గుర్తించింది. ఈ రెండింటి ప్రాధాన్యతను గుర్తించి వీటిమధ్య సమతుల్యత సాధించడానికి ప్రయత్నించింది.

బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు-వ్యతిరేక, కార్పొరేట్-అనుకూల, నయా-ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కిసాన్ రంగం గత మూడేళ్లుగా స్వతంత్ర, ఐక్య పోరాటాలను నిర్మించింది. మతతత్వ, నిరంకుశ, ఫాసిస్టిక్ శక్తులకు వ్యతిరేకంగా క్యాంపెయిన్ నిర్వహించింది. తన సంస్థాగత నిర్మాణాన్ని బలపరుచుకోడానికి కృతనిశ్చయంతో పనిచేసింది.

## 1. స్వతంత్ర చొరవ

### భూ హక్కుల కోసం, భూ కబ్జాలకు వ్యతిరేకంగా స్థానిక పోరాటాలు

తక్షణ రైతాంగ సమస్యలపై కిసాన్ రంగం వివిధ రాష్ట్రాల్లో స్థిరమైన పోరాటాలు చేసింది.

**కర్నాటక:** 2025 ఫిబ్రవరి 11–12 తేదీల్లో వ్యవసాయ కార్మిక రంగంతో కలిసి భారీ ధర్నా జరిగింది. చన్నరాయనపట్న (బెంగళూరు) లో 1,100 రోజుల నిరసన, భూ సేకరణకు వ్యతిరేకంగా బళ్లారిలో 800 రోజుల ఆందోళన ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తుమ్కూర్‌లో అటవీ భూమిలో సాగుచేసుకుంటున్న రైతులు అణచివేతను లెక్కచేయకుండా పోరాటం చేస్తున్నారు.

**తమిళనాడు:** హైటెన్షన్ వైర్ల కోసం, గెయిల్ పైప్‌లైన్ కోసం, వాటితోపాటు సాలెరాచెన్నయ్ 8–లేన్ హైవే కోసం భూ సేకరణకు వ్యతిరేకంగా జయప్రదమైన నిరసనాందోళన వల్ల రీఎలైన్‌మెంట్లు జరిగాయి, అధిక నష్టపరిహారం లభించింది.

**మహరాష్ట్ర:** అటవీ హక్కులు, భూ హక్కుల కోసం 2023లో నిర్వహించిన రెండు లాంగ్ మార్చ్‌ల వల్ల ప్రభుత్వం అటవీ హక్కులు కల్పించింది, పాక్షికంగా రుణ మాఫీ చేసింది.

**రాజస్థాన్:** పోరాటాల ద్వారా రైతులకు పంట బీమా పొందడంలో విజయం సాధించారు.

**కేరళ:** ప్రస్తుతం ఈ రాష్ట్రంలో "బీడు–భూమి రహిత కేరళ" పేరుతో పెద్ద క్యాంపెయిన్ జరుగుతోంది. తొలిదశలో జిల్లాకు ఒక పంచాయితీలో ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు.

**బీహార్:** ఇక్కడ ప్రస్తుత భూ పోరాటం ఇళ్లు లేనివారికి ఇళ్ల స్థలాలు ఇప్పించడం, భూస్వాముల హింసాకాండను ప్రతిఘటించడం పై దృష్టిపెట్టింది.

**గ్రేటర్ నోయిడా :** న్యాయమైన భూ పరిష్కారం కోసం రైతులు సాగిస్తున్న 130 రోజుల మిలిటెంట్ పోరాటంలో కిసాన్ రంగ కేంద్రం జోక్యం చేసుకుంది. దీని వల్ల సుమారు 27 గ్రామాల్లో కిసాన్ రంగ సభ్యత్వం చేరడం జరిగింది.

## అటవీ జంతువుల బెడదకు వ్యతిరేకంగా పార్లమెంటు మార్చ్

అటవీ సంరక్షణ చట్టంలో మార్పులు చేయాలని కోరుతూ 2024 సెప్టెంబర్ 25న పార్లమెంటు మార్చ్ కార్యక్రమం జరిగింది. ఏనుగుల కారిడార్లు, పులుల రిజర్వుల పేరుతో ప్రజలను నివాసాలనుండి ఖాళీ చేయించడానికి వ్యతిరేకంగా ఈ మార్చ్ జరిగింది. నివాసితుల తరలింపు వల్ల సంప్రదాయంగా అడవుల్లో నివసించేవారికీ, ఆదివాసీలకూ ప్రమాదం ఏర్పడింది.

## పంటలవారీ సమీకరణ

నిర్ధిష్టమైన పంటలవారీగా రైతులను సమీకరించడానికి చేసిన కృషి వల్ల కిసాన్ రంగ ప్రభావం సంప్రదాయ స్థావరాలను దాటి విస్తరించడానికి తోడ్పడింది. అయితే కొన్ని రాష్ట్రాలు పంటలవారీ సమీకరణ విషయంలో తటపటాయిస్తున్నాయి.

**రబ్బరు రైతుల సంక్షోభం:** రబ్బరు రైతులను ప్రభావితం చేస్తున్న టైర్ కార్టెల్ గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా రాజకీయ, న్యాయపరమైన పోరాటం ప్రారంభమైంది. అనేక నిరసన కార్యక్రమాలు జరిగాయి. కేరళలో రాజ్‌భవన్ మార్చ్ జరిగింది. అపోలో టైర్స్, ఎంఆర్ఎఫ్ టైర్స్ వద్ద ప్రదర్శనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో వేలాది మంది పాల్గొన్నారు. 2023 సెప్టెంబర్ 14న పార్లమెంటు మార్చ్ జరిగింది. కిసాన్ రంగం న్యాయపరంగా కూడా జోక్యం చేసుకుంది. కార్టెల్ రూపొందడంపై క్రింది స్థాయిలో అధ్యయనం జరిపింది. దాంతో కేరళ ప్రభుత్వం దీనిమీద దర్యాప్తు ప్రారంభించింది.

**చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు:** 2023 మార్చి 6న వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన చెరకు రైతులు పార్లమెంటు ముందు నిరసన ప్రదర్శన జరిపారు. కర్నాటక, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, మహరాష్ట్రల్లో కూడా ఇటువంటి సమీకరణలు జరిగాయి. తమిళనాడులో 43 పంచదార మిల్లుల్లో ఫెడరేషన్ బలంగా ఉంది. ఇక్కడ న్యాయపోరాటం ద్వారా, ఆందోళనల ద్వారా 408 కోట్ల రూపాయల ఎరియర్స్‌ను సాధించగలిగారు.

**ఆపిల్ రైతుల సమస్యలు:** 2023 ఏప్రిల్ 4న ఆపిల్ రైతులు తమ డిమాండ్ల సాధన కోసం పార్లమెంటు ముందు ఒక రోజు నిరసన ప్రదర్శన జరిపారు. 2024 జనవరిలో ఆపిల్ రైతుల ఫెడరేషన్ తొలి మహాసభ జరిగింది.

## సహకార రంగంలో ప్రమాదాలు

బిజెపి–ఆర్ఎస్ఎస్‌లు సర్కార్ భారతి, బహుళరాష్ట్ర సహకార సంఘాల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్‌పిఓ), కంపెనీలను ఉపయోగించుకుని ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్‌లలో ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నాయి. ఇది చాలా పెద్ద సవాలు విసురుతోంది. ముఖ్యంగా రుణ రంగంలో సహకార ఉద్యమం బాగా వేళ్లూనికుని ఉన్న కేరళలో ఇది పెద్ద సవాలుగా మారింది. పార్టీ ఈ సమస్యను ఎదుర్కొనాల్సి ఉంది.

## ప్రకృతి విపత్తులపై

త్రిపుర, అస్సాం, తమిళనాడుల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడూ, కేరళలోని వైనాడ్ సహకార నిధికీ కిసాన్ రంగం ఒక్కోదానికి 5 లక్షల రూపాయల నిధి ఇచ్చింది. వైనాడ్ సహాయ నిధికి కేరళ కిసాన్ విభాగం ఒక కోటి రూపాయలు ఇచ్చింది. వరదులు, కొండచరియలు విరిగి పడిన రాష్ట్రాలను కిసాన్ రంగ ఆఫీస్ బేరర్లు సందర్శించారు.

## రైతుల ఆత్మహత్యలపై

రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామాల నుండి వలస వచ్చే దినసరి కూలీల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. 2014 నుండి ఇప్పటి వరకు వీరి ఆత్మహత్యలు 4 లక్షలు దాటాయి. పశ్చిమ బెంగాల్‌లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను కిసాన్ రంగ నాయకులు పరామర్శించారు.

## త్రిపుర, కేరళ, పశ్చిమ బెంగాలకు సౌహార్ద్రత

త్రిపురలో ఎన్నికల అనంతర హింసాకాండకు వ్యతిరేకంగా 2023 మే 10–20 మధ్య భారత దేశవ్యాపితంగా త్రిపుర సంఘీభావ క్యాంపెయిన్ జరిగింది. 2024 డిసెంబర్ 11–21 మధ్య కేరళ సంఘీభావ క్యాంపెయిన్ జరిగింది.

## 2. వర్గ సంఘాల ఉమ్మడి కార్యాచరణ: కార్మిక-కర్షక మైత్రి దిశగా

కార్మికులు, రైతాంగం మధ్య ఐక్యత బలోపేతం చేయడం కోసం, ఐక్య పోరాటాలను కొనసాగించడం కోసం మూడు వర్గ రంగాలైన కిసాన్. ట్రేడ్ యూనియన్, వ్యవసాయ కార్మిక రంగాల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు ఈ మూడు రంగాలు నిరంతరాయంగా కృషి చేస్తున్నాయి. అయితే ఈ కృషి. క్రింద రాష్ట్రాలకూ, మరింత క్రింది స్థాయికీ ఆశించిన మోతాదులో వెళ్లడం లేదు. పార్టీ సాపేక్షంగా బలంగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది.

## వర్గ రంగాల కన్వెన్షన్, మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ రాలీ

మూడు వర్గ రంగాల పిలుపు మేరకు 2022 సెప్టెంబర్ 5న న్యూఢిల్లీ లోని తాల్కతోరా స్టేడియంలో ఒక సంయుక్త జాతీయ కన్వెన్షన్ జరిగింది. అనేక రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఉమ్మడి క్యాంపెయిన్ జరిగింది. 2023 ఏప్రిల్ 5న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో మజ్దూర్-కిసాన్ సంఘర్ష ర్యాలీ జరిగింది. ర్యాలీకి భారీగా తరలి వచ్చారు. ఇక్కడ సమీకరణ బాగున్నప్పటికీ 2018లో మనం చేసిన సమీకరణతో పోలిస్తే ఇది తక్కువగా ఉంది.

2022 ఆగస్టు 8న జిల్లాల్లో కార్పొరేట్-వ్యతిరేక నిరసన దినాన్ని విస్తృతంగా జరిపారు. 2022 ఆగస్టు 14 నాడు 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉమ్మడిగా అర్ధరాత్రి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

రైతు, వ్యవసాయకార్మిక రంగాలు, విద్యుత్ రంగానికి చెందిన కార్మికులతో కలిసి ఒక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సౌహార్థత, వారి పోరాటానికి మద్దతు తెలిపారు.

## విశాలాప్రాతిపదికపై ఐక్యతకు కృషి

2020-21లో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక రైతాంగ పోరాటం, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర ట్రేడ్‌యూనియన్ల మధ్య సమన్వయం పెరగడానికి దోహద పడింది. గత మూడేళ్లలో వివిధ క్యాంపెయిన్లు, నిరసన కార్యక్రమాలు ఈ ఐక్యతను మరింత బలపరిచాయి.

- ఆగస్టు 2022: మాజీ–సైనికులు, యువజన సంఘాలతో ఒక వారం (ఆగస్టు 7–14) పాటు జరిగిన క్యాంపెయిన్ బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ రైతు–వ్యతిరేక, యువత–వ్యతిరేక విధానాలను ఎండగట్టింది. అగ్నివీర్ పథకం బండారం బయటపెట్టింది.
- 2022 నవంబర్: రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున రాజ్‌భవన్ ర్యాలీలు జరిగాయి. దానికి ముందు రాష్ట్ర స్థాయి కన్వెన్షన్లు జరిగాయి. వీటిలో కేంద్ర నాయకత్వం పాల్గొన్నది.
- 2023 ఆగస్టు: న్యూఢిల్లీలో జరిగిన అఖిలభారత కిసాన్–మజ్దూర్ కన్వెన్షన్ 18వ లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపికి వ్యతిరేకంగా దేశవ్యాపిత నిరసన క్యాంపెయిన్లకు పిలుపునిచ్చింది. దేశ వ్యాపితంగా జరిగిన ట్రాక్టర్ ర్యాలీల్లో గణనీయమైన సంఖ్యలో పాల్గొన్నారు.
- 2023 మార్చి: న్యూఢిల్లీ లోని రామ్‌లీలా మైదానంలో జరిగిన కిసాన్ మహాపంచాయత్‌కు 20,000 మంది హాజరయ్యారు. వీరంతా మహిళా మల్లయోధుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.
- 2023 నవంబర్: మూడు రోజుల (నవంబర్ 28–28) లో జరిగిన మహాపడావ్ సందర్భంగా అనేక రాష్ట్రాల రాజధానుల్లో కార్మికులు, కిసాన్ సంయుక్త వేదికల మీద నిరసన కార్యక్రమాలు జరిగాయి. అయితే ఎన్నికలు జరిగే రాష్ట్రాలు మినహాయించబడ్డాయి. మహారాష్ట్రలో జిల్లా స్థాయి వరకు నిరసన కార్యక్రమాలు జరిగాయి.
- 2024 ఫిబ్రవరి 16: దేశవ్యాపితంగా ఈ రోజు జరిగిన పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌లో 391 జిల్లాల్లోని 2,563 కేంద్రాల్లో 1,49,454 మంది పాల్గొన్నారు.
- 2024 ఫిబ్రవరి 23: పంజాబ్–హర్యానా సరిహద్దులో యువ రైతు శుభకరన్ సింగ్‌ను చంపినందుకు నిరసనగా బ్లాక్ డే నిర్వహించారు. ఇందులో 215 జిల్లాల్లోని 1,412 కేంద్రాల్లో 47,870 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

- 2024 ఫిబ్రవరి 26: "వ్యవసాయాన్ని డబ్ల్యుటిఓ పరిధికి బయట ఉంచండి" అనే నినాదంతో దేశవ్యాపితంగా జాతీయ రహదారులపై ట్రాక్టర్ ర్యాలీలు జరిగాయి.
- 2024 మార్చి: రామ్‌లీలా మైదానంలో జరిగిన కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.
- 2025 జనవరి: హర్యానాలోని తోహానాలో (జనవరి 4న), పంజాబ్‌లోని మోగా (9 జనవరి)లో పెద్ద కిసాన్ మహాపంచాయత్‌లు జరిగాయి. ఉద్యమాన్ని చీల్చడానికీ, ఎస్‌కెఎం నాయకత్వంలోని పోరాటానికి ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈ మహాపంచాయత్‌లు జరిగాయి.

### స్వతంత్ర పోరాటాలు

ఐక్య పోరాటాల ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నాం. కానీ కొన్ని రాష్ట్రాల్లో స్వతంత్ర పోరాటాలు వెనకపట్టు పడుతున్నాయి. ఈ పని చేయకుండా మనం ముందుకు పోలేం. ఐక్య పోరాటాలకు నమ్మకమైన నాయకునిగా కూడా ఎదగలేం. సమస్యల ప్రాతిపదికపై ఐక్యత కోసం వివిధ వేదికల నుండి వస్తున్న పిలుపులు కొంతవరకు మన స్వతంత్ర కార్యాచరణను వెనక్కు నెట్టేస్తున్నాయి.

కొన్ని రాష్ట్రాల్లో కేంద్రం నుండి వచ్చే పిలుపులను, వివిధ వేదికల నుండి వచ్చే పిలుపులను రొటీన్‌గా అమలు చేస్తున్నాయే కానీ తక్షణ స్థానిక సమస్యలను గుర్తించి, శక్తివంతమైన, స్థిరమైన స్వతంత్ర పోరాటాలను ప్రారంభించడంలో బలహీనంగా ఉన్నాయి.

అయితే కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, కర్నాటక వంటి రాష్ట్రాల్లో రైతాంగం ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలపై స్వతంత్ర పోరాటాలు నడిపించారు, ఫలితాలు వచ్చే పోరాటాలు చేశారు.

## 3. మతతత్వానికి వ్యతిరేకంగా

సంఘ్ పరివార్ మతతత్వ విద్వేష ప్రచారం అన్ని గ్రామాలకు చొచ్చుకు పోతున్నది. వారి విచ్ఛిన్నకర ఎజెండాకు వ్యతిరేకంగా కిసాన్ రంగం కొన్ని క్యాంపెయిన్లు నిర్వహించింది. ఈ కృషిని ఇంకా బలోపేతం చేయాలి. సభ్యుల్లో క్రింది వరకు

తీసుకుపోవాలి. మతతత్వ సిద్ధాంతాన్ని ఎదుర్కోవాలంటే కేవలం ప్రచారం క్యాంపెయిన్లు చేసినంత మాత్రాన సరిపోదు. గ్రామ స్థాయిలో ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత ప్రభావాన్ని ఎదుర్కొనడానికి కిసాన్ రంగం గ్రామ స్థాయిలోని రైతుల సామాజిక, సాంస్కృతిక జీవనంలో తగిన రూపాలతో జోక్యం చేసుకోవాలి.

గోరక్షణ గ్రూపుల దాడుల విషయంలో కిసాన్ రంగం నిరంతరాయంగా జోక్యం చేసుకుంటున్నది. దాడుల బాధిత కుటుంబాలను ఆర్థికంగా కూడా ఆదుకుంటున్నది.

## కిసాన్ రంగం, సామాజి సమస్యలు

వివిధ రాష్ట్రాల్లో కుల వివక్ష, పీడిత సెక్షన్లపై అణచివేతలకు సంబంధించిన వివిధ సమస్యల్లో కిసాన్ రంగం జోక్యం చేసుకున్నది.

అటవీ హక్కులు, అటవీ రక్షణ చట్టానికి సవరణలు మొదలైన సమస్యలపై కిసాన్ రంగం స్వతంత్రంగానూ, సంయుక్త వేదికలద్వారానూ పనిచేసింది. గనులు, అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో గిరిజనులు, సంప్రదాయ అటవీ నివాసులను ఖాళీచేయించడం, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘించడం యదేచ్ఛగా జరిగిపోతున్నది. అందువల్ల ఈ సమస్యలను మరింత తీవ్రంగా చేపట్టాల్సి ఉంది.

క్రింది స్థాయిలో ఇటువంటి సమస్యలను చేపట్టడంలో స్థిరమనస్కంగా లేకపోవడం కొన్ని చోట్ల నిర్లక్ష్యం వహించడం జరుగుతున్నది అన్న మాట ఇప్పటికీ వాస్తవమే.

మహిళలకు సంబంధించిన అన్ని కార్యకలాపాల్లో కిసాన్ రంగం పాల్గొంటున్నది. చివరికి సరికొత్తగా ఏర్పడిన మణిపూర్ సంక్షోభంలో కూడా సరైన సమయంలో స్పందించింది. విస్తృత స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. పోరాటాల్లోకి మహిళలు మరింత ఎక్కువగా వస్తున్న విషయం స్పష్టంగా కనిపిస్తున్నది. మహరాష్ట్రలో ఇటీవల మహిళా రైతులు స్వతంత్రంగా నిర్వహించిన కన్వెన్షన్ గుర్తించదగినది.

కొన్ని రాష్ట్రాల్లో యువకులు కొత్తగా ఆకర్షితులవుతున్నారని నివేదించాయి. ముఖ్యంగా మూడు రైతువ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా విజయవంతమైన పోరాటం జరిగిన తరువాత ఈ పరిస్థితి ఉందని చెబుతున్నారు. అయితే అన్ని స్థాయిల్లోని నాయకత్వ

కమిటీల్లో వారి ప్రాతినిధ్యం అనేక రాష్ట్రాల్లో సంతృప్తి కరంగా లేదు. ఈ విషయంలో కొన్ని రాష్ట్రాలు చొరవ ప్రదర్శించాయి. ఇందులో కేరళ మంచి కృషి చేసింది.

## 4. నిర్మాణాన్ని బలపరుచుకోవడం

**కిసాన్ రంగ కేంద్రం:** అఖిల భారత కేంద్రం, రాష్ట్ర కేంద్రాలు, జిల్లా కేంద్రాల పనిని బలపరుచుకోవడం కీలకమైన కర్తవ్యం. నలుగురు కొత్త కామ్రేడ్స్‌ను చేర్చుకోవడం ద్వారా అఖిల భారత కేంద్రాన్ని బలోపేతం చేయడం జరిగింది. వీళ్లందరూ హిందీ మాట్లాడే ప్రాంతం నుండి వచ్చిన వారే. కేంద్రంలో పనిచేస్తున్న క్యాడర్‌కు కిసాన్ రంగం జీవించడానికి తగ్గ వేతనాలు ఇస్తున్నది. రాష్ట్రాలు, జిల్లా కేంద్రాల పని మెరుగైంది.

**సభ్యత్వంలో కొట్టొచ్చిన మెరుగుదల:** 2020–21 నుండి నాలుగేళ్లు కిసాన్ రంగం సభ్యత్వం స్థిరంగా పెరిగింది. నాలుగేళ్లలో దాదాపు 30 లక్షల సభ్యత్వం (29,47,681) పెరిగింది. ఇది చాలా గణనీయమైన పెరుగుదల. గత దశాబ్ద కాలంగా తగ్గిపోతున్న సభ్యత్వ నమోదును వెనక్కు మళ్లించగలిగింది. 2024లో సేకరించిన గణాంక వివరాల ప్రకారం కిసాన్ రంగానికి 431 జిల్లాల్లోని 57,180 గ్రామాల్లో సభ్యత్వం ఉంది. 10,000 కన్నా ఎక్కువ సభ్యత్వం ఉన్న జిల్లాలు 108 ఉన్నాయి.

అయితే సభ్యత్వంలో అసమానతలు కొనసాగుతున్నాయి. 46.1 శాతం సభ్యత్వం కేరళలోనే ఉంది. మూడు బలమైన యూనిట్లయిన కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లో 83.3 శాతం సభ్యత్వం ఉంది. మిగిలిన 24 యూనిట్లలో కేవలం 16.7 శాతం సభ్యత్వం మాత్రమే ఉంది.

గత ఆరేళ్లలో హిందీ మాట్లాడే ప్రాంతాల్లో సభ్యత్వం 22 శాతం పడిపోయింది. ఎలాగైనా దీన్ని వెనక్కు మళ్లించాలి.

కేరళ, తమిళనాడు, తెలంగాణాల్లో మాత్రమే స్థిరమైన నిర్మాణం, అభివృద్ధి ఉంది. పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో 2024–25లో సభ్యత్వంలో కొంత మెరుగుదల ఉంది. రాజస్థాన్‌లో నిరంతర పోరాటాలు జరుగుతున్నా, విజయాలు సాధిస్తున్నా సభ్యత్వం బాగా పడిపోయింది. రాజస్థాన్, హర్యానా, ఉత్తర ప్రదేశ, బీహార్‌లోనూ ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లోనూ కిసాన్ రంగం ప్రతిష్ట బాగా పెరిగినప్పటికీ అది నిర్దిష్టమైన సంస్థాగత సమీకరణగా మారలేదు.

గ్రామీణ యూనిట్ల పనిని మెరుగుపరచడంపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టినప్పటికీ పురోగతి నెమ్మదిగా ఉంది.

**స్వతంత్ర, ప్రజాతంత్ర పనివిధానం:** అనేక రాష్ట్రాల్లో జిల్లా స్థాయికి క్రింద కిసాన్ రంగ స్వతంత్ర పనివిధానం కనపడదు. అనేక రాష్ట్రాల్లో కిసాన్ రంగ నాయకులు అనేక పనులను ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. వాళ్లు పార్టీ నాయకులుగా కూడా ఉన్నారు. పార్టీ కార్యదర్శులు కిసాన్ రంగంలోని కీలక పదవుల్లో ఉండకూడదని గట్టిగా చెబుతున్నప్పటికీ అనేక జిల్లాలో ఇంకా అదే పద్ధతి కొనసాగుతోంది. కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, త్రిపుర, తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటకల్లో స్వతంత్ర కార్యాలయాలు ఉన్నాయి. అఖిల భారత కేంద్రానికి తనకంటూ ఒక కార్యాలయం లేదు. రాష్ట్రాలకు వెళుతున్న ఇంఛార్జులు అక్కడ తగిన సమయం గడుపుతున్నారు, సంస్థాగతమైన, ఉద్యమపరమైన సమస్యలను పరిష్కరించుకోవడంలో తోడ్పడుతున్నారు.

# 5. పార్టీ నిర్మాణం

## సబ్ కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలు

అనేక రాష్ట్రాల్లో సబ్ కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలు సక్రమంగా పనిచేయడం లేదు.

**పార్టీ సభ్యత్వం:** 2024లో సేకరించిన సమాచారం ప్రకారం 25 రాష్ట్రాల్లో 1,94,442 మంది పార్టీ సభ్యులు కిసాన్ రంగంలో పనిచేస్తున్నారు (కర్నాటక మినహా ఇతర వ్యవసాయ కార్మిక రంగ సభ్యత్వాన్ని ఇందులో చేర్చలేదు). మొత్తంగా చూసుకుంటే సంఖ్య రెండు లక్షలు దాటవచ్చు.

**పార్టీ విద్య:** రాజకీయ–సైద్ధాంతిక శిక్షణ లేకపోవడం, కొత్త సెక్షన్లను పార్టీలోకి తీసుకురాకపోవడం ఆందోళన కలిగించే అంశం. అన్ని రాష్ట్రాల్లో సామూహిక సంస్థాగత స్థాయిలో నిత్యం స్టడీ క్యాంపులు నిర్వహించడం మినహా కిసాన్ రంగంలో పార్టీ క్యాడర్‌కు రాజకీయ విద్య దాదాపు లేదు. కిసాన్ రంగం 2024 ఆగస్టు 27–31 మధ్య న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో అఖిల భారత హిందీ క్యాంపును పార్టీ నాయకత్వ క్యాడర్‌కు నిర్వహించింది. అఖిల భారత స్థాయిలో కిసాన్ క్యాడర్‌కు పార్టీ క్యాంపు

హిందీలో నిర్వహించడం ఇదే బహుశా ప్రథమం కావచ్చు. ఈ క్యాంపుకు 15 రాష్ట్రాల నుండి 109 మంది కార్యకర్తలు హాజరయ్యారు. క్యాంపు బాగా జరిగింది.

ఉత్తరా ఖండ్ కిసాన్ రంగ క్యాడర్‌కు మొదటి సారి పార్టీ తరగతులు నిర్వహించింది. ఇతర అనేక రాష్ట్రాల్లో కిసాన్ రంగ తరగతులు జరిగాయి. గానీ పార్టీ తరగతులు మాత్రం జరగలేదు.

**పూర్తికాలం కార్యకర్తలు**: 2024లో 25 రాష్ట్రాల్లో పూర్తి కాలం కార్యకర్తలు 1093 మంది ఉన్నారు. వారిలో ఒక్కొక్కరికీ నెలసరి అలవెన్స్ రూ. 1000 నుండి రూ. 23,300 వరకు ఉంది. కొన్ని రాష్ట్రాల్లో రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వకపోవడం అనేది ఒక లక్షణంగా మారింది. వేతనాలు చాలా వరకు పార్టీ చెల్లిస్తోంది. కిసాన్ రంగం పూర్తికాలం కార్యకర్తల నిధిని ఏర్పాటు చేయడం కోసం ప్రణాళిక వేస్తోంది. దాని వల్ల బలహీన రాష్ట్రాల్లో కనీస సంఖ్యలో పూర్తి కాలం కార్యకర్తలకు సహాయం చేసినట్లవుతుంది.

క్యాడర్‌ను గుర్తించడం, వారిని ప్రోత్సహించడం, వారిని పార్టీలోకి తీసుకురావడం అనే పని అనుకున్న స్థాయిలో జరగడం లేదు.

కిసాన్ రంగం నాయకులు, కార్యకర్తలు అన్ని స్థాయిల్లో ప్రజా పంథాను అనుసరించి తమ పని విధానాన్ని మార్చుకోవాలి. బ్యూరాక్రాటిక్, యాంత్రిక పనివిధానాన్ని, రోటీనిజాన్ని విడనాడాలి. జిల్లాలకు బాధ్యత వహించే రాష్ట్ర నాయకత్వం కనీసం 10 రోజుల పాటు క్షేత్రస్థాయిలో తిరగాలి, గ్రామాల్లో నివసించాలి. కిసాన్ రంగ క్యాడర్, నాయకులు నిర్దిష్ట పరిస్థితులను, వైరుధ్యాలను అధ్యయనం చేయాలి. సరైన నినాదాలు రూపొందించి, ధైర్యంతో కూడిన, సుస్థిరమైన పోరాటాలు ప్రారంభించాలి.

**కీలకమైన బలహీనత**

అనేక విషయాల్లో మనం ప్రసంశనీయమైన కృషి చేస్తున్నప్పటికీ పేద రైతులు, గ్రామీణ పేదలను కదిలించడంలో బలహీనత ఇప్పటికీ కొనసాగుతున్నది. ఈ కీలకమైన బలహీనతను ఎలా అధిగమించాలనే విషయంపై మనం తగినంత శ్రద్ధ పెట్టాల్సి ఉంది.

**రాజకీయ సమీక్షా నివేదిక ఈ అంశంపై ఇలా చెప్పింది:**

"గ్రామీణ ప్రాంతాల్లో పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల ఆధారంగా మనం వర్గపోరాటాలను ఎందుకు అభివృద్ధి చేయలేకపోతున్నామో తీవ్రంగా

పరిశీలించుకోవాలి. భూస్వాములు – ధనిక రైతులు – కాంట్రాక్టర్లు – బడా వ్యాపారుల కూటమి నేడు గ్రామీణ ధనికవర్గంగా ఏర్పడిందని మన తాజాపరచబడిన కార్యక్రమం పేర్కొన్నది. ఈ గ్రామీణ ధనిక కూటమి వివిధ రూపాల్లో చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనం గ్రామీణ పేదలు, రైతాంగంలోని సెక్షన్లను సమీకరించలేక పోతున్నాం.

"అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన మార్పులను మనం మరింతగా అధ్యయనం చేయాలి. తక్కువ వేతనాలు, ఇళ్ల స్థలాలు, కౌలు షరతులు, రుణాలపై అధిక వడ్డీలు, ట్రాక్టర్లకు పంటకోత మిషన్లకు అధిక ఛార్జీలు మొదలైన సమస్యలపై గ్రామీణ ధనికుల కూటమికి వ్యతిరేకంగా పోరాడేందుకు పేద రైతులు–వ్యవసాయ కార్మికులు–గ్రామీణ పేదలను ఐక్యపరిచే నినాదాలు, ఎత్తుగడలను రూపొందించాలి. (పేరా 16)

వ్యవసాయ సబ్–కమిటీ, వివిధ స్థాయిల్లోని పార్టీ కమిటీలు పేద రైతులు–వ్యవసాయ కార్మికులు– గ్రామీణ పేదల సమస్యలను గుర్తించి వాటిని చేపట్టి వాటి ప్రాతిపదికగా వారిని గ్రామీణ ధనికవర్గ కూటమికి వ్యతిరేకంగా పోరాడడానికి సమీకరించాలి.

## కర్తవ్యాలు

1. తక్షణ స్థానిక సమస్యలపైనా, రైతాంగ డిమాండ్లపైనా సుస్థిర పోరాటాలు నిర్వహించాలి. ఇది చేయాలంటే వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను లోతుగా అధ్యయనం చేసి ఎప్పటికప్పుడు తగిన మార్పులు చేస్తుండాలి.
2. పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలను గ్రామీణ ధనికవర్గ కూటమికి వ్యతిరేకంగా సమీకరించడంలో కీలకమైన బలహీనతను అధిగమించాలి.
3. బలహీన రాష్ట్రాల్లో ముఖ్యంగా హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో కిసాన్ రంగాన్ని బలోపేతం చేయాలి.

4. రైతుల్లో మతతతత్వానికి వ్యతిరేకంగా నిరంతర సైద్దాంతిక కృషికి ప్రణాళిక వేయాలి. ముఖ్యంగా గ్రామాల స్థాయిలో సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా ఈ కృషి జరగాలి. అన్ని రూపాల్లోని సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలి.
5. కిసాన్ రంగంలో క్షేత్ర స్థాయిలో నిరంతర రాజకీయ విద్య, శిక్షణ ద్వారా క్యాడర్ పునాదిని విస్తరించాలి.
6. రైతుల్లో ముఖ్యంగా పేద రైతులు, యువకులు, మహిళల్లో పార్టీని నిర్మించాలి. యువకులు, మహిళలను గుర్తించి వారిని అన్ని స్థాయిల్లో నాయకత్వ స్థానాల్లోకి ప్రమోట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.
7. నిరంతర సైద్ధాంతిక కృషి జరపడం ద్వారా మనం చేస్తున్న పోరాటాలను రాజకీయంగా స్థిరపరుచుకోవాలి.
8. అన్ని స్థాయిల్లో కిసాన్ రంగానికి చెందిన కార్యకర్తలు ఆ రంగానికే ప్రాధాన్యత ఇచ్చేట్లు చూడాలి.
9, పార్టీ సబ్-కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీల పనిని బలోపేతం చేయాలి.
10. ఈ రంగానికి చెందిన ప్రాథమిక యూనిట్లను బలపరుచుకుని, స్వతంత్ర పని విధానాన్ని పెంపొందించాలి.
11. కొత్త కేంద్ర కమిటీ కిసాన్ రంగ సమీక్షను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలి.
12. మూడు వర్గ రంగాల ఉమ్మడి కార్యకలాపాలను బలోపేతం చేయాలి.

# వ్యవసాయ కార్మికులు

## ప్రవేశిక

వ్యవసాయ కార్మిక రంగానికి సంబంధించిన కీలకమైన కర్తవ్యాలను 23వ పార్టీ మహాసభ గుర్తించింది. ఈ రంగానికి క్యాడర్‌ను అందించడం ద్వారా, అవసరమైన చోట వేతనాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఈ రంగం అభివృద్ధికీ, బలోపేతానికీ తోడ్పడాలని పార్టీ కమిటీలను ఆదేశించడం జరిగింది. అంతేకాకుండా భూ హక్కులు, ఇళ్లు, వేతనాలు, ఎంజిఎన్ రెగా వంటి కీలకమైన సమస్యలను గుర్తించి స్థానిక పోరాటాల అభివృద్ధికి కృషి చేయాలని కూడా ఆదేశించడం జరిగింది. వీటికి తోడు రాష్ట్ర స్థాయి సబ్-కమిటీలు, జిల్లా స్థాయి ఫ్రాక్షన్ కమిటీలు నిరంతరాయంగా

పనిచేసేట్లు చూడాలనీ, క్యాడర్‌కు క్రమపద్ధతిలో రాజకీయ పాఠశాలలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలనీ, వ్యవసాయ కార్మికోద్యమంలో భాగంగా దళితులు, ఆదివాసీలు, మహిళలను వేధిస్తున్న సామాజిక సమస్యలను చేపట్టాలని కూడా కోరింది.

గత మూడేళ్లుగా పార్టీ మహాసభ ఆదేశాలనూ, ఈ రంగపు అఖిల భారత మహాసభ ఆదేశాలనూ అమలు చేయడంలో గణనీయమైన పురోభివృద్ధి ఉంది. ఈ రంగం స్వతంత్ర కార్యకలాపాలు, పోరాటాలను చురుకుగా నిర్వహించింది. అదే సమయంలో ఇతర సంస్థలతో కలిసి ఉమ్మడి వేదికలను కూడా రూపొందించింది. ఆర్థిక, సామాజిక సమస్యలపై అనేక రకాల పోరాటాలను విజయవంతంగా నిర్వహించింది. రాష్ట్ర స్థాయిలో కార్యకలాపాలు ఊపందుకున్నాయి. దాంతో కొత్త జిల్లాలకు, సెక్షన్లకు సంస్థాగతంగా విస్తరించడం జరిగింది.

వ్యవసాయ కార్మిక రంగంలో పురోభివృద్ధిని పార్టీ కేంద్ర కమిటీ సమీక్షించింది. దాని పనిని మెరుగుపరుచుకునేందుకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అఖిల భారత కేంద్రం పని మెరుగుపడింది. కేంద్ర కౌన్సిల్, కేంద్ర వర్కింగ్ కమిటీ సమావేశాలు రెగ్యులర్‌గా జరుగుతున్నాయి. అనేక రాష్ట్ర కమిటీలు ఇప్పుడు రెగ్యులర్‌గా జరుగుతున్నాయి. అయితే అనేక సవాళ్లూ ఉన్నాయి. ముఖ్యంగా ప్రాథమిక యూనిట్లను బలోపేతం చేసుకోవడం లోనూ, భారీ ఎత్తున వర్గపోరాటాలు నిర్వహించడంలోనూ, స్థానిక, సమస్యల ప్రాతిపదికగా పోరాటాలలోకి సమర్ధవంతంగా సమీకరించడంలోనూ సవాళ్లు కొనసాగుతున్నాయి. వీటికి తోడు సభ్యులను రాజకీయంగా తర్ఫీదు ఇవ్వడంలో అదనపు కృషి చేయాల్సి ఉంది.

**ఈ రంగపు అఖిల భారత మహాసభ:** వ్యవసాయ కార్మిక రంగం 10వ అఖిల భారత మహాసభ 2023 ఫిబ్రవరి 15-18 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో జరిగింది. 684 మంది ప్రతినిధులు, 11 మంది పరిశీలకులు (575 మంది పురుషులు, 120 మంది మహిళలు) హాజరయ్యారు.

**ప్రధాన పోరాటాల అనుభవాలు**

జాతీయ స్థాయి సమస్యలపై స్వతంత్రంగానూ, ఇతర సంస్థలతో కలిసి అఖిల భారత స్థాయి సమీకరణలు జరిగాయి. అనేక కార్యకలాపాలు నిర్ణయాత్మక ప్రజా పోరాటాల రూపంలో కాకుండా క్యాంపెయిన్ల రూపంలో జరుగుతున్నాయి. జరిగిన కొన్ని కీలకమైన పోరాటాలు క్రింద ఇస్తున్నాం:

## భూ పోరాటాలు

గత మూడేళ్ల కాలంలో తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర యూనిట్లు, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలు, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భూ సమస్య మీద ఆందోళనలు జరిగాయి.

తెలంగాణాలో 13 కేంద్రాల్లో భూ పోరాటం జరిగింది. 165 మండలాల్లో సాగు భూమికోసం ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో ఇళ్ల స్థలాలు, సాగు భూమి కోసం, బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా 18 జిల్లాల్లోని 181 కేంద్రాల్లో పోరాటాలు జరుగుతున్నాయి. తమిళనాడులోని 20 జిల్లాల్లో భూ పోరాటాలు జరుగుతున్నాయి. కర్నాటకలోని 6 జిల్లాల్లో పోరాటాలు జరిగాయి. వీటిలో మూడు చోట్ల కన్వెన్షన్లు, ఒక రాష్ట్ర స్థాయి ఆందోళన ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్ ఖలిలో టిఎంసి గూండాల భూ కబ్జాకు వ్యతిరేకంగా, రాష్ట్ర కార్యదర్శిని అక్రమంగా అరెస్టు చేయడానికి నిరసనగా ఆందోళన వెల్లువెత్తింది. మహారాష్ట్రలో2024లో గ్రామ కంఠాల నుండి తొలగింపుకు నిరసనగా రెండు జిల్లాల్లో నిరవధిక ధర్నాలు, ఔరంగాబాద్, నాశిక్‌లలో ప్రజా సమీకరణ జరిగాయి. బీహార్‌లో రాష్ట్ర 'జల్ జీవన్, హర్యాలి' పథకానికి వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయి. ఈ పథకాల వల్ల జల వనరులున్న చోట ప్రభుత్వ భూముల్లో నివసించే ప్రజలను తొలగించే ప్రమాదం ఏర్పడింది.

## అటవీ భూమి కోసం పోరాటం

అనేక రాష్ట్రాల్లో అటవీ భూమి కోసం చురుకైన పోరాటాలు నిర్వహించింది. త్రిపురలో కిసాన్ రంగంతో కలిసి జరిపిన ఉమ్మడి పోరాటంలో 80,000 మంది గ్రామీణ ప్రజలను కదిలించారు. అటవీ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలన్న డిమాండ్‌తో ఈ పోరాటం జరిగింది. తెలంగాణా లోని 14 జిల్లాల్లోని 266 కేంద్రాల్లో పోడు భూమిపై హక్కు కోసం ఆదివాసీ సంఘంతో కలిసి పోరాటం కొనసాగిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్ర కమిటీ అటవీ భూముల సమస్యను చురుకుగా చేపట్టింది. ఆదివాసీ రంగం ఉన్న రాష్ట్రాల్లో దానితో సమన్వయం చేసుకుని అటవీ భూమిపై హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్నది.

భూ పోరాటాన్ని వ్యవసాయ కార్మిక రంగం ఒక్కటే నిర్వహించలేదు. పేద రైతులతో కలిసి ఉమ్మడి కృషి చేయాలి. ఆయా భూ పోరాటాలు ఎంత వరకు చేయడానికి అవకాశం ఉంది అనే అంచనాకు వచ్చే విషయంలోనూ, తగిన పోరాట రూపాలు ఎంచుకోవడంలోనూ పార్టీ కమిటీలు సహాయపడాలి.

## ఇళ్లకోసం పోరాటాలు

ఈ రంగానికి చెందిన కేరళ యూనిట్ ఇళ్లకోసం పెద్ద క్యాంపెయిన్ ప్రారంభించింది. 1,871 గ్రామాల నుండి 1.95 లక్షల మందిని సమీకరించింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం దాదాపు 5 లక్షల కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇచ్చింది. అనేక మందికి పట్టాలు ఇచ్చింది. త్రిపురలో ఇటువంటి క్యాంపెయిన్‌లో 16,794 మందిని సమీకరించారు. తెలంగాణాలో ఇళ్ల నిర్మాణం కోసం స్థలాల ఆక్రమణ కొనసాగుతోంది. 2023 ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లో ఐక్య పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జూన్ 18–27 తేదీల్లో రాష్ట్ర వ్యాపిత బస్ జాతా జరిగింది. దీనికి 12,027 మంది ప్రజలు హాజరయ్యారు. 45 కేంద్రాల్లో 6,000కు పైగా కుటుంబాల వారు ఇళ్ల స్థలాలను ఆక్రమించుకున్నారు.

## వేతన పోరాటాలు

వేతనాల పోరాటాల ప్రాముఖ్యత ఎంతో ఉన్నప్పటికీ మన కృషి తగిన ఫలితాలు సాధించలేకపోయింది. ఎక్కువ పోరాటాలు ప్రణాళిక ప్రకారం కాకుండా సద్యోజనితంగా (స్పాంటేనియస్‌గా) జరిగాయి. తెలంగాణాలో 24 జిల్లాల్లోని 425 గ్రామాల్లో వేతన పోరాటాలు జరిగాయి. 10,000 మంది వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. ఫలితంగా వేతనాలు పెంచుకోవడం జరిగింది. బీడీ కార్మికుల బోనస్ కోసం జయప్రదంగా జరిగిన పోరాటం వల్ల వారి కుటుంబాలకు రూ. 350 కోట్ల రూపాయలు – ఒక్కో కుటుంబానికి రూ. 30.000 నుండి 1.5 లక్షల వరకు అందాయి. పశ్చిమ బెంగాల్‌లో ఏడు జిల్లాల్లోని 950 గ్రామాల్లో వేతనాల పెంపుకోసం ఉద్యమాలు జరిగాయి. 3 నుండి 13 రోజుల పాటు సమ్మెలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో వేతనాలు పెంచుకున్నారు. త్రిపురలో 199 గ్రామాల్లో వేతనాల పెంపు కోసం కన్వెన్షన్లు జరిగాయి. 1,658 మంది వ్యవసాయ కార్మికులు హాజరయ్యారు. మహారాష్ట్రలోని నందూర్‌బర్ జిల్లాలో జరిగిన పోరాటం ఫలితంగా వ్యవసాయ కార్మికుల వేతనాలు రోజుకు రూ. 150 నుండి 250 కి పెరిగాయి. నిరంతరాయమైన పోరాటాల ఫలితంగా కర్నాటక ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ కార్మికుల కనీస వేతనాన్ని పెంచింది. రాజస్థాన్‌లోని ఫిలిబంగాలో 2022 ఏప్రిల్‌లో మహిళలతో సహా 1,000 మంది వ్యవసాయ కార్మికులు వేతనాల పెంపుకోసం సమ్మె చేశారు.

**ఎంఎన్ రెగా(గ్రామీణ ఉపాధి హామీ పథకం) పోరాటాలు**

ఎంఎన్ రెగా సమస్యలకు సంబంధించి నిరంతర క్యాంపెయిన్లు, పోరాటాలు జరిగాయి. అనేక రాష్ట్రాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి.

అఖిల భారత స్థాయిలో అనేక నిరసన కార్యక్రమాలను స్వతంత్రంగానూ, ఇతర సంస్థలతో కలిసి ఉమ్మడిగానూ చేపట్టడం జరిగింది. 2023 అక్టోబర్ 11న బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వ ఎంఎన్ రెగా–వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాపిత ఐక్య నిరసన కార్యక్రమాలు జరిగాయి. కేరళలో కెఎస్కెటియు–ఎంఎన్ రెగా కార్మిక సంఘం 2,193 ఉమ్మడి నిరసన కార్యక్రమాలు చేసింది. వీటిలో 1,22,178 మంది పాల్గొన్నారు. వీరిలో 59,348 మంది యూనియన్ సభ్యులు (34,412 మంది మహిళలు) ఉన్నారు. పశ్చిమ బెంగాల్లో 19 జిల్లాల్లోని 125 ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో 15,722 మంది పాల్గొన్నారు. పంజాబ్లోని 14 జిల్లాల్లో 29 బిడిపిఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు జరిగాయి. దేశ వ్యాపితంగా 225 జిల్లాల్లోని 20,000 గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి.

**గత మూడేళ్లలో:**

తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, త్రిపుర, మహారాష్ట్రలో పని, వేతనాల కోసం నిరంతరాయమైన పోరాటాలు జరిగాయి. రాజస్థాన్, హర్యానాలు ఎంఎన్ రెగా కార్యక్రమాలు చేపట్టాయి. తమిళనాడు పట్టణ ఉపాధి హామీ చట్టం కోసం సమీకరణలు జరిపింది. కొన్ని సానుకూల ఫలితాలు వచ్చాయి. పశ్చిమ బెంగాల్ ఇటీవల ఎంఎన్ రెగా పోరాటాలు చేపట్టింది. వీటికి ముగింపుగా 2023 సెప్టెంబర్ 25న కొల్కొతాలో భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి 16,240 మంది ప్రజల హాజరయ్యారు. త్రిపురలో ఎంఎన్ రెగాపై 15 రోజుల క్యాంపెయిన్ జరిగింది. ముగింపుగా 2024 సెప్టెంబర్ 26న అగర్తలాకు మార్చ్ జరిగింది. తెలంగాణాలో 2024 జూన్లో రాష్ట్ర కన్వెన్షన్ జరిగిన తరువాత పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ 753 పంచాయితీల్లో ప్రదర్శనలు జరిగాయి, రెండో రౌండ్లో మరో 199 పంచాయితీల్లో జరిగాయి. ఆంధ్ర ప్రదేశ్లో ఎంఎన్ రెగాకు కేంద్రం అధిక నిధులు కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ల ఎదుట, 382 గ్రామ సచివాలయాల ఎదుట ధర్నాలు జరిగాయి. తమిళనాడులో పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ 2023 జులై 25న 43 కేంద్రాల్లో ప్రదర్శనలు జరిగాయి. 2024 నవంబర్ 12న "బ్లాక్ దివాళి" నిరసన కార్యక్రమం నిర్వహిస్తూ 326 కేంద్రాల్లో నల్ల జెండాలు ఎగురవేయడం జరిగింది.

ఇందులో 20,000 మంది కార్మికులు పాల్గొన్నారు. దీని ఫలితంగా ప్రభుత్వం రూ 2,696 కోట్ల రూపాయల వేతన ఎరియర్స్‌ను కార్మికుల బ్యాంకు ఎకౌంట్లలో డిపాజిట్ చేసింది. రాజస్థాన్‌లో హనుమాన్‌ఘర్, శ్రీగంగానగర్ జిల్లాల్లో ఎంఎన్ రెగా సమస్యలపై గణనీయమైన పోరాటాలు జరిగాయి. ఉత్తర ప్రదేశ్, బీహార్‌లో నిరంతరం వెంటబడటం వల్ల  కొంత చొరవ ప్రదర్శించబడింది.

**కిసాన్, ట్రేడ్ యూనియన్ రంగాలతో ఉమ్మడి పోరాటాలు:**

గత మూడేళ్లుగా వ్యవసాయ కార్మికులు, రైతులు, కార్మికులను ఉమ్మడి పోరాటాల్లో ఐక్యం చేసేందుకు కృషి జరుగుతోంది. కేంద్ర రాష్ట్ర బడ్జెట్‌లకు, కార్పొరేట్-అనుకూల వ్యవసాయ విధానాలు, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా రెగ్యులర్ సమావేశాలు, ఉమ్మడి నిరసనలు జరిగాయి. విద్యుత్ ప్రయివేటీకరణ, స్మార్ట్ మీటర్లు పెట్టడంపై ప్రతిఘటన పెరిగింది.

2023 ఆగస్టు 5న ఢిల్లీలో పెద్ద కిసాన్ మజ్దూర్ రాలీ జరిగింది. దానికి ముందు ఈ రాలీ కోసం విస్తృత సన్నాహాలు చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కేంద్ర ట్రేడ్ యూనియన్లు (సిటియు) లు ఇచ్చిన పిలుపులకు ఈ రంగం చురుకుగా మద్దతిచ్చింది. మూడు రోజుల మహా పడావ్ (2023 నవంబర్ 26-28)కు కూడా మద్దతిచ్చింది. కార్మికులు, రైతుల అఖిల భారత కన్వెన్షన్ (2023 ఆగస్టు 24) లో పాల్గొన్నది.

**వ్యవసాయ కార్మిక సంఘం ఐక్య కార్యాచరణ**

2022 మే 16న వ్యవసాయ కార్మికుల అఖిల భారత కన్వెన్షన్ జరిగింది. దానికి 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. డిమాండ్ల పత్రాన్ని ఆమోదించారు. దాని ఆధారంగా 500 జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. పిడిఎస్, ఎంఎన్ రెగా, సామాజిక న్యాయం వంటి సమస్యలపై రెగ్యులర్‌గా సంయుక్త పోరాటాలు చేశారు. దేశ వ్యాపిత వేదిక నిర్మించే కృషిలో భాగంగా ఇది జరిగింది.  ఎస్‌కెఎం, సిటియులతో సమన్వయం జరుగుతోంది.

**సౌహార్ద్ర కార్యక్రమాలు**

ఈ రంగం వివిధ పోరాటాలకు సౌహార్ద్రత ప్రకటించింది. అవి:

- మణిపూర్ నిరసనలు (2023 జులై 25)

- లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మహిళా మల్లయోధుల నిరసన (2023 ఏప్రిల్ 27, జూన్ 1)

– కేరళ సౌహార్ద్ర దినం (2024 ఫిబ్రవరి 8)

– ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా పాలస్తీనియన్లకు మద్దతు

నిరంకుశ బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను ఈ కృషి ప్రతిబింబిస్తోంది.

**కుల పీడనకు వ్యతిరేకంగా పోరాటం :**

మన రంగం గతంలో సామాజిక సమస్యలను కొంతవరకు నిర్లక్ష్యం చేసింది. అయితే, ఇటీవలి కాలంలో, ఈ ధోరణిని వదిలించుకోడానికి కృషి జరుగుతోంది. కొన్ని రాష్ట్రాలు కుల పీడన సమస్యను చురుకుగా చేపట్టగా ఇతర రాష్ట్రాలు ఇప్పటికీ ఈ అంతరాన్ని పూడ్చడంలో వెనుకబడ్డాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి సంయుక్త కార్యాచరణ జరిగింది.

దళితుల సమస్యలపై జాతీయ స్థాయిలో రెండు సంయుక్త కన్వెన్షన్లు జరిగాయి. వాటి తరువాత రాష్ట్ర కన్వెన్షన్లు జరిగాయి. 2022 నవంబర్ 5న ఢిల్లీలో ఒక కన్వెన్షన్ జరిగింది. హైదరాబాద్‌లో రెండు రోజుల జాతీయ దళిత శిఖరాగ్ర సభ జరిగింది. అనేక సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. వీటికి తోడు 2023 డిసెంబర్ 4న ఢిల్లీలో ఒక బహిరంగ సభ జరిగింది. దానికి ముందు సంతకాల సేకరణ జరిగింది. రాజ్యసభ సమావేశాల సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మీద హోమ్ మంత్రి అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

బలహీన వర్గాల్లో ముఖ్యంగా దళితుల్లో అస్తిత్వ రాజకీయాలు పెరిగిపోవడం, మతతత్వ శక్తుల ప్రభావం పెరగడం మన ఉద్యమానికి పెద్ద సవాలుగా మారింది. గ్రామీణ కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించే సంస్థగా మన రంగం ఈ రెండు ప్రమాదకరమైన సిద్ధాంతాలను బలంగా ఎదుర్కోవాలి.

**మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం**

వ్యవసాయ కార్మికుల్లో హిందూత్వ సిద్ధాంతం రోజురోజుకీ విస్తరిస్తోంది. అందుకే బిజెపి అనేక గ్రామీణ ఎన్నికల్లో గెలుస్తోంది. హిందూత్వ సిద్ధాంతాన్ని ఉపయోగించుకుని దళితులను మైనారిటీలకు వ్యతిరేకంగా నిలుపుతున్నారు. గ్రామీణ పేదల్లో పట్టు సాధించేందుకు బిజెపి ఉప–కుల అస్తిత్వాలను ఉపయోగించుకుంటున్నది.

అయినప్పటికీ ఈ హిందూత్వ మతతత్వ పీడనను ఎదుర్కొనేందుకు మనం చేస్తున్న కృషి మాత్రం సాధారణంగానే ఉంది. వివిధ స్థాయిల్లో జరుగుతున్న స్టడీ క్యాంపుల్లో మతతత్వాన్ని పాఠ్యాంశాల్లో ఒకటిగా చేరుస్తున్నారు. దీనికి తోడు మన

క్యాడర్‌కు హిందూత్వ ప్రచారాన్ని ఎదుర్కొనే ఆయుధాలు సమకూర్చేందుకుగాను రాజకీయ, సైద్ధాంతిక సమస్యలపై సదస్సులు జరుపుతున్నారు. ఇది చాలదు. ఈ సవాలును ఎదుర్కొనేందుకు మరింత సీరియస్‌గా, స్థిరంగా, సమన్వయంగా కృషి జరపాలి. వ్యవసాయ కార్మికుల సామాజిక–సాంస్కృతిక జీవనంలో భాగంగా మారి ఈ కృషి జరపాల్సి ఉంది.

**మహిళా నాయకత్వాన్ని పెంపొందించడం**

వ్యవసాయ కార్మికల్లో ఎక్కువగా మహిళలు చేరుతుండడం గుర్తించ దగ్గ ధోరణిగా ముందుకు వచ్చింది. అయితే మహిళల వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. వారికి ప్రశూతి సదుపాయాలు లేవు. వారిపై లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయి.

ఆందోళనలు, పోరాటాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటుండగా అన్ని స్థాయిల్లో నాయకత్వంలో వారి ప్రాతినిధ్యం చాలా చాలా తక్కువగా ఉంది. అన్ని స్థాయిల్లో మహిళలకు మరింత ఎక్కువ ప్రాతినిధ్యం ఇచ్చేందుకు గట్టి చర్యలు తీసుకోవాలి.

**గ్రామీణ కూలి పనివారిని సమీకరించడం**

2024 జనవరిలో కేంద్ర కమిటీ, వ్యవసాయ కార్మిక రంగం పనిని సమీక్షించింది. గ్రామీణ భారతంలోని వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికులందరినీ సమీకరించాల్సిన అవసరం గురించి నొక్కి చెప్పింది. అనేక మంది వ్యవసాయ కార్మికులు ఏడాది అంతా అనేక రకాల కూలి పనులు చేస్తున్నారు. వ్యవసాయం మీద ఆధారపడుతూనే వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు ఒకదాని నుండి మరోదానికి మారుతున్నారు. మన రంగం ప్రజా పోరాటాల ద్వారా ఈ కార్మికులను సమీకరించాలి.

**నివాస ప్రాంతాల్లో పని, సాంఘిక సంక్షేమ సమస్యలు**

వ్యవసాయ కార్మికుల్లో తక్కువ వేతనాలు, విస్తారమైన నిరుద్యోగం ఉన్నందున వారు సంక్షేమ పథకాలపైనా, ప్రభుత్వ సర్వీసులపైనా ఎక్కువగా ఆధారపడుతున్నారు. అయితే ఆరోగ్యం, విద్య రానురాను ప్రయివేటీకరణ చెందుతుండడంతో పేదలు జీవించడం కష్టం అయిపోతున్నది. వితంతు పింఛన్లు, వృద్ధాప్య పింఛన్లు వంటివి క్రమంగా టార్గెటెడ్ (కొందరికి మాత్రమే ఇచ్చే) పథకాలుగా మారిపోతున్నాయి. దాని వల్ల గ్రామీణ భారత దేశంలో మెజారిటీ సెక్షన్లు ఈ పథకాలకు దూరమైపోతున్నారు. సంక్షేమ పథకాలను, ప్రభుత్వ సర్వీసులను రక్షించుకోవడం, విస్తరించుకోవడం మన రంగానికి కీలకమైన ప్రాధాన్యతగా ఉండాలి.

ఈ సంక్షేమ పథకాలు, అత్యధిక ప్రభుత్వ సర్వీసులూ నివాస ప్రాంతాల్లోనే అందిస్తున్నారు. గ్రామీణ ధనికులు తమ రాజకీయ సామాజిక సాంస్కృతిక ఆధిపత్యం ద్వారా మన వర్గంపై నియంత్రణ సాధిస్తున్నారు. గ్రామీణ పేదలను ఒక స్వతంత్ర శక్తిగా మార్చాలంటే వారి ఆర్థిక డిమాండ్లపై మాత్రమే కేంద్రీకరిస్తే సరిపోదు. మన రంగం వారి నివాస ప్రాంత జీవితాలకు చెందిన సమస్యలను చురుకుగా చేపట్టాలి. వారి సాంస్కృతిక, సామాజిక జీవనంలో పాల్గొనాలి. దీనికి తోడు మనం వారి మొత్తం పరిస్థితులు మెరుగుపరిచేందుకు గాను సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ, సాంఘిక సంస్కరణ కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి.

**నిర్మాణం**

**అఖిల భారత కేంద్రం:** ప్రస్తుతం అఖిల భారత కేంద్రంలో నలుగురు కామ్రేడ్స్ పని చేస్తున్నారు. సాధారణంగా చెప్పాలంటే వారికి ఇచ్చిన బాధ్యతలను వారు సంతృప్తికరంగా నిర్వహిస్తున్నారు. మరో ఇద్దరు కొత్త కామ్రేడ్స్‌ను చేర్చుకుని కేంద్రాన్ని బలోపేతం చేయాలి. కేంద్రం సమిష్టిగా పనిచేస్తున్నది. కేంద్రంలో పనిచేసే నాయకులు సమావేశాలకు హాజరు కావడం, క్రింది స్థాయి యూనిట్లను సందర్శించడంతోపాటు రాష్ట్రాల్లో కూడా గడుపుతున్నారు.

**రాష్ట్ర కేంద్రాలు:** అన్ని ప్రాంతాల్లోనూ సమర్ధవంతంగా, పూర్తిగా పనిచేసే రాష్ట్ర కేంద్రాలు లేకపోవడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నది. కేరళ, పశ్చిమ బెంగాల్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, త్రిపుర, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు రాష్ట్ర కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. ఇతర రాష్ట్రాల్లో బలహీనతలున్నాయి. ఈ రాష్ట్రాల్లో పూర్తి స్థాయి నిర్మాణం లేకుండా ఒకరిద్దరు కామ్రేడ్స్ మాత్రమే పనిని కానిచ్చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో కామ్రేడ్స్ కొరత, వనరుల కొరత ఒక పెద్ద సవాలుగా మిగిలి ఉంది.

**కమిటీ పనివిధానం:** కేంద్ర వర్కింగ్ కమిటీ, జనరల్ కౌన్సిల్ రెగ్యులర్‌గా సమావేశమవుతున్నాయి. ఎక్కువ రాష్ట్ర కమిటీలు నిరంతరాయంగా సమావేశాలు జరుపుతున్నాయి. ఈ సమావేశాలకు 70 నుండి 80 శాతం మధ్య హాజరు ఉంటోంది. అనేక రాష్ట్ర కమిటీ సభ్యులు, ముఖ్యంగా హిందీ రాష్ట్రాల్లో, ఈ రంగం కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం లేదు. ఇది రాష్ట్రాల సమిష్టి పని మీద ప్రతికూల ప్రభావం కలిగిస్తోంది.

ఈ రంగానికి 271 జిల్లాల్లో సభ్యత్వం ఉంది. 235 జిల్లాల్లో జిల్లా కమిటీలు ఏర్పడ్డాయి. జిల్లా కమిటీల పని ఇప్పటికీ ఆందోళన కరంగానే ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లో కేవలం రాష్ట్రానికి నాలుగైదు జిల్లాల్లో మాత్రమే రెగ్యులర్ సమావేశాలు, స్వతంత్ర పని జరుగుతోంది. రాష్ట్రాలు జిల్లా కమిటీల పనిని మెరుగుపరచడానికి ప్రాధాన్యత నివ్వాలి.

**గ్రామ యూనిట్లు:** ప్రస్తుతం దేశ వ్యాపితంగా 24,933 గ్రామ కమిటీలయితే ఉన్నాయి కానీ 13,025 కమిటీలు మాత్రమే చురుకుగా పని చేస్తున్నాయి. ఈ గ్రామ కమిటీలను బలోపేతం చేసుకోవడం, వాటిని సమర్ధవంతంగా పని చేయించడంపై నాయకత్వం కేంద్రీకరించడం లేదని ఇది తెలియజేస్తోంది. గ్రామ కమిటీలను నిర్మించి, సక్రమంగా పనిచేయించడంపై అన్ని రాష్ట్రాలు దృష్టి కేంద్రీకరించాలి.

**సభ్యత్వం:** గత కొన్ని సంవత్సరాలుగా ఒక్క 2023–24 మినహా ఈ రంగం సభ్యత్వం స్థిరంగా, క్రమంగా పెరుగుతూ వస్తున్నది. సభ్యత్వం 8,23,217 కు పెరిగింది. ఒక్క కేరళలో మినహా మిగిలిన రాష్ట్రాల్లో మహిళా సభ్యత్వం కచ్చితంగా ఎంతవుందో సంఖ్యలు లేవు.

మొత్తం సభ్యత్వంలో కేరళలోని మన రంగానికే 33.88 శాతం సభ్యత్వం ఉంది. దక్షిణ భారత దేశంలోని అయిదు రాష్ట్రాలు (కేరళ, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక) కలిపితే 67.02 శాతం సభ్యత్వం ఉంది. దీనికి పశ్చిమ బెంగాల్ సభ్యత్వం కూడా కలిపితే 89. 59 శాతం అవుతుంది. అంటే మొత్తం సభ్యత్వంలో 89.59 శాతం కేవలం ఆరు రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉంది. అదీ కాకుండా కేరళతో సహా అనేక రాష్ట్రాల్లో సభ్యత్వ స్క్రూటినీ సక్రమంగా లేదు.

వ్యవసాయ కార్మిక సంఘం కొన్ని కొత్త రాష్ట్రాలకు విస్తరించింది. నిరంతరాయంగా కృషి జరిపినప్పటికీ మనం ఝార్ఖండ్‌లో సంస్థను నిర్మించలేకపోయాం. గుజరాత్‌లో కూడా ఇటువంటి పరిస్థితే ఉంది. సానుకూల అంశం ఏమంటే ఈ రంగం అస్సాంలో కమిటీని ఏర్పాటు చేయగలిగింది.

**హిందీ రాష్ట్రాలు:** హిందీ మాట్లాడే ప్రాంతంలో బలం పెంచుకోడానికి వ్యవసాయ కార్మిక రంగం కృషి చేస్తోంది. రాష్ట్ర కమిటీలున్నప్పటికీ ఈ రంగం కొన్ని జిల్లాలకే పరిమితం అయిపోయింది. పంజాబ్, మహారాష్ట్రతో కలిపి ఈ ప్రాంతం మొత్తంలో సభ్యత్వం 10 మాత్రమే ఉంది. ఇది ఇక్కడున్న మొత్తం వ్యవసాయ కార్మికుల్లో చాలా చిన్న భాగం మాత్రమే. 75 జిల్లాలున్న ఉత్తర ప్రదేశ్‌లో కేవలం 16 జిల్లాల్లో మాత్రమే ఈ రంగం చురుకుగా ఉంది. మరో 12 జిల్లాల్లో ఆర్గనైజింగ్ కమిటీలున్నాయి.

హిందీ మాట్లాడే రాష్ట్రాల్లోని రాష్ట్ర కమిటీలు పునరుద్ధరించుకుని, విస్తరించి, నిర్మాణాన్ని బలపరుచుకోడానికి క్యాడర్‌ను ఇవ్వాలి.

**రాజకీయ విద్య:** ఈ రంగంలో రాజకీయ, సైద్ధాంతిక విద్య గరపడం అనేది రెగ్యులర్ కార్యక్రమంగా ఉంది. అఖిల భారత స్థాయిలో రెగ్యులర్‌గా రాజకీయ–సైద్ధాంతిక తరగతులు జరిగాయి. గత మూడేళ్లలో ఒక ఇంగ్లీషు భాషా పాఠశాల, ఒక హిందీ భాషా పాఠశాల జరిగాయి. రాష్ట్ర, జిల్లా స్థాయి తరగతులు నిరంతరాయంగా జరుగుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు ప్రాంతీయ తరగతులు కూడా నిర్వహించాయి. అయితే క్రింది స్థాయి తరగతులు అంత స్థిరంగా లేవు. గత సంవత్సరం కేరళ వివిధ స్థాయిల్లో 94,051 మంది కామ్రేడ్స్‌కి తరగతులు నిర్వహించింది.

**బులెటిన్:** ఇంగ్లీషు, హిందీల్లో ఈ రంగం ఒక బులిటెన్‌ను ప్రచురిస్తోంది. అయితే దాన్ని మరింత తరచుగా తేవాల్సిన అవసరం ఉంది. మరో ఆరు రాష్ట్రాలు కూడా బులెటిన్ ప్రచురిస్తున్నాయి.

**ఫ్రాక్షన్, సబ్–కమిటీలు:** గతంలో కిసాన్, వ్యవసాయ కార్మిక రంగాలకు మార్గదర్శకత్వం వహించేందుకు ఒక సంయుక్త వ్యవసాయ సబ్–కమిటీ పనిచేసేది. 2024 జనవరిలో కిసాన్, వ్యవసాయ కార్మిక రంగాలకు ప్రత్యేక కేంద్ర ఫ్రాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. గత ఏడాది కాలంలో రెండు ఫ్రాక్షన్ కమిటీ సమావేశాలు జరిగాయి. అదే విధంగా తమిళనాడు, త్రిపుర మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు ఫ్రాక్షన్ కమిటీలను ఏర్పాటు చేశాయి. కొన్ని ఫ్రాక్షన్ కమిటీలు వ్యవసాయ కార్మికుల్లో పార్టీ నిర్మాణం గురించి చర్చించాయి. కానీ అత్యధిక ఫ్రాక్షన్ కమిటీలు సంస్థ మహాసభల ముందు మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్నాయి.

**పార్టీ సభ్యత్వం:** అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ కార్మిక కుటుంబాల నుండి, లేక వ్యవసాయ కార్మిక రంగంలో పనిచేసే కుటుంబాల నుండి ఎంతమంది సభ్యులు వచ్చారో నిర్దిష్టమైన లెక్కలు లేవు. తెలంగాణా ఆంధ్ర ప్రదేశ్‌లలోని మొత్తం సభ్యుల్లో ఈ రంగం నుండి వచ్చిన వారు 25 శాతం మంది ఉన్నారు. తమిళనాడులో 20,000 మంది ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో 20,425 మంది, త్రిపురలో 4,000 మంది ఉన్నారు. అదే విధంగా కేరళలో 1,02,363 మంది పార్టీ సభ్యులు వ్యవసాయ కార్మికరంగంలో పనిచేస్తున్నారు. ఇది రాష్ట్ర మొత్తం సభ్యత్వంలో 18.12 శాతం. పోరాటాల సమయంలో కొత్త ఆగ్జిలరీ సభ్యులను రెగ్యులర్‌గా గుర్తించకపోవడం పెద్ద బలహీనత.

**పూర్తికాలం కార్యకర్తలు:** మన రంగానికి పూర్తికాలం కేటాయించే నాయకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కేరళలో 391 మంది పూర్తికాలం కార్యకర్తలున్నారు. ఇది ఆ రాష్ట్రంలో సంఘ బలంలో ప్రతిబింబించింది. పశ్చిమ బెంగాల్‌లో 61 మంది, తమిళనాడులో 43 మంది పూర్తికాలం కార్యకర్తలున్నారు. ఈ రాష్ట్రాల్లో విస్తరిస్తున్న కృషితో పోలిస్తే ఈ సంఖ్యలు చాలా తక్కువ. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా పరిస్థితి కూడా ఇదే. ఆ రాష్ట్రాల్లో 103, 92 మంది చొప్పున పూర్తి కాలం కార్యకర్తలున్నారు. ఇతర రాష్ట్రాల్లో ముఖ్యంగా బలహీన రాష్ట్రాల్లో వీరి సంఖ్య ఆందోళన కలిగించేంత తక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో కొత్త నాయకులను రిక్రూట్ చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయ కార్మిక రంగంలో రిక్రూట్ చేసుకునే కొత్త క్యాడర్‌ను పార్టీ గుర్తించాలి. ఉత్తరాది రాష్ట్రాల్లో చాలా తక్కువగా, క్రమం లేకుండా వేతనాలివ్వడం పెద్ద సమస్యగా ఉంది. దీన్ని వెంటనే పరిష్కరించాలి. భవిష్యత్తులో పార్ట్ టైమ్ సభ్యులను కూడా తీసుకోవడం ముఖ్యం. భవిష్యత్తులో పూర్తికాలం బాధ్యతలు తీసుకునే మహిళలు, యువతీయువకులైన క్యాడర్‌ను గుర్తించడానికి కృషి చేయడం అవసరం.

## భవిష్యత్తు కర్తవ్యాలు

ఈ అవగాహన ఆధారంగా పార్టీకి సంబంధించిన క్రింది కర్తవ్యాలు నిర్వహించాలి.:

1. వ్యవసాయ కార్మిక రంగంపై కేంద్ర కమిటీ చేసిన సమీక్ష ఆధారంగా వ్యవసాయ కార్మిక, గ్రామీణ కార్మికుల సంస్థ అనేక రకాల గ్రామీణ కార్మికులను తన ప్రభావం లోకి తెచ్చుకోవాలి. అన్ని స్థాయిల్లో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే పార్టీ కమిటీలు ఈ నిర్ణయాన్ని అమలు పరచడానికి తగిన చర్యలు తీసుకోవాలి.
2. వర్గ సమస్యలైన వేతనాలు, భూమి, ఇళ్ల స్థలాలు వంటి వాటిపై స్థిరమైన స్థానిక పోరాటాలు నిర్మించడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. వీటితో పాటు ఎంఎన్ రెగా సమస్యలను కూడా తీసుకుని పోరాటాలు నిర్వహించాలి.
3. సామాజిక న్యాయం, సామాజిక భద్రత సమస్యలను చేపట్టి సామాజికంగా పక్కకు నెట్టివేయబడిన ఈ సెక్షన్లను సమీకరించాలి. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల నిర్ధిష్ట సమస్యలపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టాలి.
4. వ్యవసాయ కార్మికుల్లో మతతత్వ సిద్ధాంత ప్రభావాన్ని తిప్పి కొట్టాలి. గ్రామీణ పేదల్లోకి సంఘ్ పరివారం చొరబడకుండా ఉండేందుకుగాను సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యకలాపాలు చేపట్టాలి.

5. సబ్‌-కమిటీలు, ఫ్రాక్షన్‌ కమిటీలు రెగ్యులర్‌గా సమావేశాలు జరిపి ఈ రంగానికి కేటాయించిన పార్టీ సభ్యులు చురుకుగా పనిచేసేట్లు చూడాలి. పార్టీ మార్గదర్శకత్వంలో పార్టీ రిక్రూట్‌మెంటుకు, రాజకీయ విద్యకు నిర్ధిష్ట ప్రణాళికలు రూపొందించాలి.
6. ప్రస్తుతం వ్యవసాయ కార్మిక రంగానికి ఎటువంటి కార్యకలాపాలు లేని రాష్ట్రాల్లో ఈ రంగానికి క్యాడర్‌ను కేటాయించి రంగంలో పని జరిపించేందుకు పార్టీ కమిటీలు తక్షణ చర్యలు తీసుకోవాలి.
7. ఆయా పార్టీ కమిటీలు ఈ రంగానికి తగినంత మంది క్యాడర్‌ను కేటాయించాలి. సంస్థ తనంత తానుగా సరిపడ వనరులు సమకూర్చుకోలేని చోట వాటికి ఆర్థిక సహకారం అందించాలి.
8. వలస కార్మికులను వారి స్వస్థలాల్లోనూ, వారు వలస వచ్చిన ప్రాంతాల్లోనూ సమీకరించడానికి ఆయా పార్టీ కమిటీలతో సమన్వయం చేసుకుని పనిచేయాలి.

## మహిళలు

మహిళా ప్రజా సంఘం (డబ్ల్యుఎంఓ) పార్టీ 23వ మహాసభ రాజకీయ తీర్మానం ఇచ్చిన ఆదేశాన్ని అమలు చేయడానికి ప్రయత్నించింది. (1) అన్ని స్థాయిల్లో బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రభుత్వ ప్రధాన ప్రమాదానికి వ్యతిరేకంగా, హిందూత్వ సిద్ధాంతం, విధానాలు, కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాడడం. (2) నయా-ఉదారవాద విధానాల దాడిని ప్రతిఘటించడం. నయా-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని మతతత్వానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంతో అనుసంధానించడం. (3) సామాజిక సమస్యలపై ప్రజా పోరాటాలను నిర్మించడం.

### ఈ కాలంలో కొత్త సవాళ్లు

గత మూడేళ్లలో బిజెపి ప్రభుత్వం మహిళల జీవితాల్లో- ఆర్థిక, సామాజిక రంగాలు రెంటిలోనూ సంక్షోభాన్ని తీవ్రతరం చేసింది. సామాజిక సంబంధాల్లో పితృస్వామిక ధోరణులు బలపడ్డాయి. మరోవైపు కార్పొరేట్‌ అనుకూల విధానాలు మహిళలను పెద్ద ఎత్తున దెబ్బతీశాయి. హిందూత్వ శక్తులు మహిళలను మతం ప్రాతిపదికగా విడదీయడానికి ప్రయత్నించాయి. ముఖ్యంగా అవి ముస్లిం మహిళలపై అత్యంత క్రూరంగా దాడులు చేశాయి. అదే సమయంలో హిందూత్వ మనువాది విధానాలు కుల తత్వాన్ని కూడా పెంచి పోషించాయి. మెజారిటీ మహిళలపై కులతత్వ,

లైంగిక దాడులు పెరిగాయి. ఆర్‌ఎస్‌ఎస్ తన విచ్ఛిన్నకర మతతత్వ, కులతత్వ విభజన కోసం మతాన్ని దుర్వినియోగ పరిచి మహిళలను పెద్ద ఎత్తున సమీకరించింది. మహిళల్లో హిందూత్వకూ, హిందూ మత నమ్మకానికీ తేడాలేనట్లు ప్రచారం చేసింది. మూఢనమ్మకాలు, ఛాందసవాదాన్ని పెంచి పోషించింది. ఇది మహిళా ప్రజా సంఘానికి కొత్త సవాళ్లు విసిరింది.

మహిళపై తీవ్రమైన దాడి చేసిన నయా–ఉదారవాద విధానాలను అమలు జరపడంతోపాటు బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం మరోవైపు తను మహిళలకు మేలు చేసే విధానాలు అమలుచేస్తున్నానని చెప్పుకునేందుకు ఉజ్వల యోజన, అయిదు కిలోల ఆహారధాన్యాల పథకం, లేక లాడ్లీ బెహన్ వంటి నగదు బదిలీ పథకాలు వంటి ఎంపికచేసిన, అరకొర పధకాలు అమలు చేసింది.

## ముఖ్యమైన కార్యకలాపాలు

మహిళా ప్రజా సంఘం జాతీయ మహాసభ 2023 జనవరిలో జయప్రదంగా జరిగింది. ఇందులో పైన పేర్కొన్న రాజకీయ పరిస్థితుల్లో మహిళల్లో పనిచేయడానికి రూపొందించిన మార్గదర్శనం ఈ కర్తవ్యాల అమలుకు సహాయ పడింది.

ఈ కాలంలో లోక్ సభ, అనేక రాష్ట్రాల శాసన సభలకు ఎన్నికలు జరిగాయి. అనేక రాష్ట్రాల్లో మహిళా కార్యకర్తలు ఎన్నికల్లో పనిచేశారు.

లోక్ సభ ఎన్నికలకు ముందు మహిళా ప్రజా సంఘం రెండు ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహించి “బిజెపి సర్కార్ హటావో, మహిళా బచావో, సంవిధాన్ బచావో” అనే నినాదంతో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళలను సమీకరించింది. మొదటిగా, 2023 అక్టోబర్‌లో లోక్ సభ ఎన్నికలకు ముందు ఢిల్లీలో 7,000 మంది మహిళలతో ఒక అఖిల భారత రాలీ నిర్వహించింది. దీనికి ముందు అఖిల భారత స్థాయిలో జాతాలు, సైకిల్/స్కూటర్ రాలీలు, పాటలు వీధినాటికలు, ఇంటింటికి కరపత్రాల పంపకం, వీధి చివరి సమావేశ కార్యక్రమాలు నిర్వహించింది. మహిళా ప్రజా సంఘం ‘మోడీ సర్కార్, యాంటీ ఉమెన్ సర్కార్’ శీర్షికతో ఒక చిన్న పుస్తకం తీసుకు వచ్చింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం దశాబ్ద కాలంగా అనుసరిస్తున్న మహిళా–వ్యతిరేక విధానాలను ఎండగట్టింది. ఈ పుస్తకాన్ని ఇంగ్లీషులోనూ, హిందీలోనూ, ఇతర ప్రాంతీయ భాషల్లోనూ వేల కాపీలు అమ్మారు.

రెండోది, మోడీ ప్రభుత్వం వల్ల నేరుగా బాధితులైన మహిళల అనుభవాలను తెలియజేస్తూ ఒక జాతీయ కన్వెన్షన్ నిర్వహించారు. దీనికి 1000 మందికి పైగా

హాజరయ్యారు. మత, కుల, వర్గ హింసాకాండకు గురైన వారి నిర్ధిష్ట కేసులను ఈ కన్వెన్షన్‌లో వివరించారు. మహిళా బాధితులకు వేదికను గనుక ఇస్తే అది సభికులతో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరుస్తుందనీ, ఇది దీర్ఘకాలిక ప్రభావం కలిగిస్తుందని దీనివల్ల అర్థమైంది.

లోక్ సభ, అనేక రాష్ట్రాల శాసన సభ ఎన్నికల్లో మహిళా కార్యకర్తలు ఎన్నికల పనిలో నిమగ్నమవడమే కాక, కొన్ని ప్రాంతాల్లో మహిళా కార్యకర్తలే ఇంటింటి ప్రచారంలో పెద్ద పాత్ర నిర్వహించారు. మహిళలకు ఉద్దేశించిన పథకాల ప్రభావం మహిళా ఓటర్లపై చాలా పెద్దగా ఉందని ఎన్నికల పనిపై మహిళా ప్రజా సంఘం చేసిన సమీక్షలో తేలింది. వాళ్లు లబ్దిదారులు కానిచోట కూడా తమ వంతుకూడా వస్తుందన్న ఆశ మహిళా ఓటర్లపై ప్రభావం చూపింది. లబ్ది దారులకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ గణాంక వివరాలను బిజెపి ఎన్నికల్లో మహిళా ఓటర్లను కలుసుకోడానికి నేరుగా ఉపయోగపెట్టుకుందని తేలింది. ఇటువంటి "లబ్దిదారుల" వల్ల కలిగే ప్రభావాన్ని పార్టీ సరైన రీతిలో అంచనా వేసి ఈ సమస్యను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి.

## ఆర్థిక సమస్యలపై పోరాటాలు

చౌక ధరల్లో ఆహారధాన్యం అందించాలని నిరంతరాయంగా చేసిన కార్యక్రమాలు, పోరాటాలు క్షేత్ర స్థాయిలో మహిళలకు కొంత ఉపశమనం కల్పించడానికి తోడ్పడ్డాయి. జిల్లా, తహసిల్/బ్లాక్/మండల కేంద్రాల స్థాయిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఖాళీ కంచాలు కొట్టడం, ఖాళీ గ్యాస్ సిలిండర్ బొమ్మలు పట్టుకోవడం వంటి సృజనాత్మక కార్యక్రమాల వల్ల ధరల పెరుగుదల తీవ్రతపైకి ప్రజల దృష్టిని ఆకర్షించడం జరిగింది. 2022లో దేశ వ్యాపితంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించి లక్షలాది మంది సంతకాలతో కూడిన అర్జీలను రాష్ట్రపతికి కొరియర్ చేయడం జరిగింది. అధిక ధరలకు వ్యతిరేకంగా, రేషన్ ధాన్యం కోసం జాతీయ స్థాయిలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సంతకాలతో కూడిన అర్జీలను గవర్నర్, జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు లక్షలు సేకరించారు. జాతీయ విధాన సమస్యలను స్థానిక అవసరాలకు లింకు చేసి సాధించగల డిమాండ్లు రూపొందించడానికి ఇది ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

కేవలం సాధారణ డిమాండ్లతో కాకుండా నిర్ధిష్ట సమాచారం ఆధారంగా పోరాటాలు నిర్వహించే పద్ధతిని పాటించడం కూడా మంచి ప్రభావం కలిగించింది. వివిధ సమస్యలపై మహిళా ప్రజా సంఘం నిర్ధిష్టమైన సమాచారం సేకరణపై కేంద్రీకరించింది. ఎంఎఫ్ఐ రణం ప్రభావం మహిళలపై ఎలా ఉంది అన్న విషయమై మహిళా ప్రజా సంఘం దేశ వ్యాపితంగా జరిపిన సర్వే దీనికి ఒక ఉదాహరణ. మహిళా ప్రజా సంఘం కార్యకర్తలు 19 రాష్ట్రాల్లో 5,000 మంది మహిళలను కలిసి దీని గురించి సర్వే చేశారు. రానున్న రోజుల్లో ఈ తక్షణ సమస్యపై సర్వేలో వెల్లడైన వివరాలను ప్రచురించడం, ఢిల్లీలో జాతీయ ప్రజా న్యాయస్థానంలో ఉపయోగించడం జరుగుతుంది.

మహిళల కోసం చేపట్టబడిన వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రభావాన్ని అధ్యయనం చేయడంలో ఈ సర్వే అనుభవం తోడ్పడుతుంది. తద్వారా ఈ పథకాల వెనుక ఆలోచన, వాటి అమలు, వాటిలో లోపాలు, మహిళలు ఈ పథకాలను బాగా ఉపయోగించుకునేట్లు చేయడం వంటి అంశాలపై వివిధ స్థాయిల్లో జోక్యం చేసుకోవచ్చు. అనేక కొత్త పథకాలు ప్రారంభించినప్పుడు ఇతర సాంఘిక సంక్షేమ ప్రయోజనాల్లో కోతపెడుతున్నారన్న విషయాన్ని తెలియజెప్పడానికి కూడా ఈ సర్వే చేయడం అవసరం.

మహిళా ప్రజా సంఘం, స్వయం సహాయ గ్రూపులను ఆర్గనైజ్ చేయడానికీ, వివిధ పోరాటాల్లో వారిని పాల్గొనేట్టు చేయడానికీ ప్రయత్నించింది. ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిషా, తమిళనాడు, తెలంగాణా వంటి రాష్ట్రాల్లో మనం ఈ సెక్షన్ మహిళల్లో జోక్యం చేసుకోగలిగాం. ఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాల్లో ఇంటి పనివారిని సమీకరించే కృషి జరుగుతోంది. కానీ, పట్టణాల్లో ఇంటిపనివారిని సమీకరించడం ముఖ్యంగా కరోనా మహమ్మారి తరువాతి కాలంలో కష్టమైపోయింది. ఈ కర్తవ్యంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.

2023 నవంబర్‌లో ఎంఎన్ రెగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంతకాల సేకరణ జరిగింది. సంతకాలను బిడిఓలకు సమర్పించడం జరిగింది. మహిళా ప్రజా సంఘానికి ఎంఎన్ రెగా కార్మికులతో సంబంధాలున్న జిల్లాలను 13 రాష్ట్రాలు గుర్తించాయి. వీరి డిమాండ్లపై పోరాటాలు నిర్వహించవచ్చునని కూడా గుర్తించాయి. ఎంఎన్ రెగా కృషిలో స్థిరత్వం లేదు కాబట్టి దీనిపై సమీక్షించి కృషిని ముందుకు తీసుకుపోవాలి.

గ్రామీణ పేద మహిళలకు ఇళ్ల స్థలాలు మరో ముఖ్యమైన సమస్య. తెలంగాణాలో దీనిపై పార్టీ నిర్వహించిన ఐక్య పోరాటంలో మహిళా ప్రజా సంఘం

చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. ఇళ్ల స్థలాల పోరాటంలో మహిళా కార్యకర్తలు ముందు పీఠిన ఉన్నారు.

## హింసకు వ్యతిరేకంగా

లైంగిక, గృహ హింసకు వ్యతిరేకంగా పోరాడ్డం మహిళా ప్రజా సంఘానికి అఖిల భారత స్థాయిలో కేంద్రీకృత కర్తవ్యంగా ఉంది. దీనికి సంబంధించి రెండు కేసుల అనుభవాలను ఇక్కడ చెప్పాల్సిన అవసరం ఉంది. మొదటిది, మహిళా మల్ల యోధుల నిరసన. వారికి అఖిల భారత స్థాయిలో సద్యోజనిత (స్పాంటేనియస్) మద్దతు లభించింది. మహిళా ప్రజా సంఘం ముఖ్యంగా హర్యానా కమిటి ఇందులో ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. రెండోది, పశ్చిమ బెంగాల్‌లో ఆర్‌జి కార్ అత్యాచారం కేసులో జరిగిన పట్టువదలని పోరాటం. ఇక్కడ కూడా మహిళా ప్రజా సంఘం ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. యువజన, విద్యార్థి సంఘాలతో కలిసి మహిళా కార్యకర్తలు కూడా పట్టువదలని కృషితో అపూర్వ రీతిలో ప్రజలను సమీకరించారు. సంస్థాపరమైన సమీకరణలను బలోపేతం చేసుకుంటూనే మరోవైపు సద్యోజనిత పోరాటాలకు మద్దతివ్వడం ఎంత అవసరమో ఈ రెండు అనుభవాలు చెబుతున్నాయి.

వివిధ రాష్ట్రాలో అనేక వ్యక్తిగత కేసులు చేపట్టడం జరిగింది. అనేక రాష్ట్రాలో లీగల్ ఎయిడ్ కేంద్రాలు నడుస్తున్నాయి.

## బిజెపి–ఆర్ఎస్ఎస్ హిందూత్వకు వ్యతిరేకంగా

మైనారిటీలు లక్ష్యంగా సాగే మతతత్వ హింసాకాండకు సంబంధించిన కేసుల్లో మహిళా ప్రజా సంఘం చురుకుగా జోక్యం చేసుకుంటున్నది. ఈ కాలంలో ఢిల్లీ విభాగం ఈ విషయంలో చేసిన కృషి, మైనారిటీ మతం నుండి కార్యకర్తలు అభివృద్ధి చెందడానికి ఉపయోగపడింది. ఉత్తర ప్రదేశ్‌లో మతతత్వ హింసాకాండకూ, 'లవ్ జిహాద్', బలవంతపు మతమార్పిడుల పేరుతో మైనారిటీలపై సాగుతున్న దాడులకూ వ్యతిరేకంగా మహిళా ప్రజా సంఘం ప్రజాభిప్రాయాన్ని సమీకరించడంలో చురుకుగా పనిచేసింది.

మణిపూర్‌లో భయానకమైన హింసాకాండ సమయంలో మహిళా ప్రజా సంఘానికి చెందిన ఒక బృందం ఆ రాష్ట్రాన్ని సందర్శించింది. లైంగిక దాడులకు గురైనవారికి సౌహార్ద్రత తెలుపుతూ మహిళా ప్రజా సంఘం నిధులు సేకరించింది. మణిపూర్ కమిటీ నిర్వహించిన సహాయ చర్యలకు సహాయం అందించింది.

ఈ కేసులన్నిటిలోనూ తెలిసిన విషయం ఏమంటే, సమయానికి జోక్యం చేసుకోవాలి, బాధితులకు వెనువెంటనే సహాయం సేకరించి అందించాలి.

2022లో మహిళా ప్రజా సంఘం అన్ని కులాలు, మతాలకు చెందిన మహిళలను సమీకరించి 'ఐక్యతా' కన్వెన్షన్లు నిర్వహించింది. మహిళల్లో ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు ఒక మెరుగైన, మరింత సమర్ధవంతమైన వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

మూఢనమ్మకాలు, అపసవ్య ఆచారాలకు వ్యతిరేకంగా ప్రజా సైన్సు ఉద్యమంతో కలిసి మహిళా ప్రజా సంఘం సంయుక్త క్యాంపెయిన్ నిర్వహించింది. కొన్ని రాష్ట్రాల్లో మహిళల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించింది. ఈ క్యాంపెయిన్‌ను ముందుకు తీసుకు పోవాలి.

సావిత్రిబాయ్ ఫూలే జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, అంతర్జాతీయ మానవ హక్కుల దినం వంటి నిర్దిష్ట దినాలను నిర్వహిస్తూనే సామాజిక న్యాయం కోసం, ఆర్ఎస్ఎస్–బిజెపి మనువాదీ సిద్ధాంతానికి వ్యతిరేకంగా కార్యక్రమాలను చేపట్టడం మన క్యాంపెయిన్‌లో ఒక ముఖ్య భాగంగా ఉండాలి.

కొన్ని రాష్ట్రాల్లో మహిళలు పెద్ద ఎత్తున పోగయ్యే మతపరమైన పండుగలు, ఇతర సామాజిక ఉత్సవాల సమయంలో మహిళా ప్రజా సంఘం జోక్యం చేసుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఇలాంటి సమయాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, మంచినీళ్లు అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ దిశలో మరింత ఎక్కువ చైతన్య పూర్వకమైన కృషి జరగాల్సి ఉంది.

మహిళా ప్రజా సంఘం కొత్త సెక్షన్లలోకి వెళ్లడానికి ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలపై కృషి జరగాలి. ఈ కృషిని మరింత పెంచాల్సిన అవసరం ఉంది.

## నిర్మాణం

ప్రతి మూడు మాసాలకు ఒకసారి కేంద్ర ఆఫీస్–బేరర్స్, జాతీయ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. కేంద్ర స్థాయిలో కేంద్ర బృందం పనిచేస్తున్నది. ఇది సమయాన్ని బట్టి సమావేశమవుతుంది. కేంద్రం అన్ని ప్రధాన మైన సమస్యల సందర్భంగానూ జోక్యం చేసుకుంది. రాష్ట్రాలతో నిత్యం, సజీవమైన సంబంధాలు కొనసాగిస్తోంది. దీనివల్ల అవసరమైనప్పుడు జోక్యం చేసుకోడానికి వీలు కలుగుతోంది. అయితే కేంద్రంలో సరిపడ్డంతమంది పూర్తి కాలం కార్యకర్తలు లేరు. అలా ఉంటేనే కేంద్రం పని బలోపేతం అవుతుంది.

యూనిట్ స్థాయి పనిని చురుకుగా చేయించాలని తీసుకున్న నిర్ణయం మిశ్రమ ఫలితాల నిచ్చింది. ఈ విషయంలో కేరళలో మంచి సానుకూల అనుభవం వచ్చింది. ఈ రాష్ట్రంలో 28,000 యూనిట్లలో యూనిట్ స్థాయి పని రెగ్యులర్‌గా జరుగుతోంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణాల్లో కొంత మెరుగుదల ఉంది. ఇతర రాష్ట్రాల్లో యూనిట్ స్థాయి పని చేయిండం ఇంకా లోపభూయిష్టంగానే ఉంది. క్రింది స్థాయిలోని కార్యకర్తల ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్య పరిస్థితుల వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. యూనిట్ కమిటీలను చురుకుగా పనిచేయించడం సంస్థకు ప్రాధాన్యతాంశంగా ఉంది. కొత్త క్యాడర్‌ను ఎడ్యుకేట్ చేసుకుని, పనిలో దించడానికి ప్రత్యేక కృషి చేయాలి. యువతులపై ముఖ్యంగా కేంద్రీకరించి వారిని మహిళా ప్రజా సంఘం క్యాడర్‌గా అభివృద్ధి చేసుకోవాలి.

క్యాడర్ సైద్ధాంతిక స్థాయిని పెంచేందుకుగాను మహిళా ప్రజా సంఘం నాలుగు పాఠ్యాంశాలతో కూడిన రాజకీయ తరగతులను నిర్వహించింది. ఇందులో మతతత్వాన్ని ఎలా ఎదుర్కొనాలి అనే పాఠ్యాంశం కూడా ఉంది. 23 రాష్ట్రాల్లో నాయకత్వ క్యాడర్‌కు ఈ–తరగతులు జరిగాయి. మహిళా ప్రజా సంఘం తీసుకున్న తీసుకున్న ముఖ్యమైన కార్యక్రమాల్లో ఇదొకటి. దీని వల్ల క్యాడర్‌కు బాగా ఉపయోగం జరిగిందని అభిప్రాయం వచ్చింది.

మహిళా ప్రజా సంఘం తన పరిశోధనా కేంద్రం, దాని ట్రస్ట్ పనిని మెరుగుపరిచింది. మహిళా ప్రజా సంఘం ఢిల్లీ లోని తన కేంద్ర కార్యాలయ ప్రాంగణాన్ని విస్తరించుకుంది.

## సభ్యత్వం

సభ్యత్వంలో ఒక సానుకూల అభివృద్ధి ఉంది. 2021లో సభ్యత్వం 8.46 శాతం పెరిగింది. పశ్చిమ బెంగాల్, త్రిపురల్లో నిర్బంధ కాండ వల్ల సభ్యత్వం కోటి కన్నా తగ్గిపోయింది కాస్తా ఇప్పుడు ఆ రెండు రాష్ట్రాల్లో పరిస్థితులు మెరుగుపడ్డంతో అది కోటిని దాటింది. రాష్ట్రాలో సంఘం అసమాన అభివృద్ధి ఇప్పటికీ కొనసాగుతోంది. సభ్యత్వ చార్ట్‌లో ఇది కనిపిస్తుంది.

## ఇతర మహిళా సంఘాలతో ఐక్య పోరాటాలు

హిందూత్వ శక్తులను ఎదుర్కోవడంలో కొన్ని మహిళా గ్రూపులు సంకోచం వ్యక్తం చేస్తున్నందున విస్తృతమైన, స్థిరమైన ఐక్య పోరాటాల నిర్మాణం కష్టమైపోతున్నది.

సమస్యల ప్రాతిపదికపై రకరకాల సంఘాలు కలిసి వస్తున్నాయి. వామపక్ష ధోరణిగల మహిళా ప్రజా సంఘాలతో సంప్రదింపులకూ, కలిసి కార్యక్రమాల నిర్వహణకూ కృషి సాగుతోంది. అయితే, ఈ కాలంలో ఇతర మహిళా సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు పెద్దగా జరగలేదు. ఈ దిశలో కృషి కొనసాగించాలి.

## ప్రజా సంఘం కర్తవ్యాలు

బిజెపి–ఆర్ఎస్ఎస్‌లు మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగం చేయడాన్ని ఎదుర్కోవడంలో గత మూడేళ్ల అనుభవాలు చూస్తే ఈ సమస్యను మహిళా ప్రజా సంఘం తన రోజువారీ పనిలో భాగంగా మరింత బలంగా ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది. అదే కాకుండా, మతత్వానికి వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని మహిళలపై నయాఉదారవాద విధానాల ప్రభావాలకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో లింకు చేయడం వల్ల వచ్చే సానుకూల అనుభవాలను మరింత ముందుకు తీసుకుపోవాలి.

23వ పార్టీ మహాసభ ఇచ్చిన కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి ఎంతో కృషి జరిగినప్పటికీ, సబ్–కమిటీల పని, గ్రామీణ పేద మహిళల్లో మరింత స్థిరంగా పనిచేయడం, కార్యకర్తల విద్య అభివృద్ధి వంటి వాటిపై మరింత శ్రద్ధ పెట్టాలని పై నిర్మాణ సమీక్ష తెలియజేస్తోంది. సాధించగల డిమాండ్లపై క్షేత్ర స్థాయి పోరాటాలు, సంస్థాగత కన్సాలిడేషన్ అనేవి సంస్థ పునాదిని విస్తరించుకోడానికి అవసరం. యూనిట్ కమిటీలను పనిచేయించడంపై శ్రద్ధ పెట్టడంలో సానుకూల ప్రభావం ఉన్నప్పటికీ దీన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. రాష్ట్ర, జిల్లా కేంద్రాలను బలోపేతం చేసుకోవడం కూడా చాలా ముఖ్యమైన కర్తవ్యం. అంగీకృత సమస్యలపై ఇతర మహిళా సంఘాలతో ఐక్య పోరాటాలు నిర్మించాలి.

## పార్టీ, మహిళా ప్రజా సంఘం

ఈ కాలంలో మహిళల సబ్–కమిటీ 7 సార్లు సమావేశమయ్యింది. ప్రధానంగా (1) పార్టీ నిర్మాణం (2) ఫ్రాక్షన్ కమిటీ పనివిధానం (3) ప్రజా సంఘం లేదా పార్టీకి సంబంధించిన ఏవైనా సమస్యలు (4) పై వాటిలో దేనిపైనయినా పొలిట్ బ్యూరోకు నోట్స్ సమర్పించడం…ఈ అంశాలపై చర్చ జరిగింది. మూడేళ్లలో ఫ్రాక్షన్ కమిటీ రెండు సార్లు సమావేశమైంది. ఫ్రాక్షన్ కమిటీ ఏడాదికి కనీసం రెండు సార్లన్నా సమావేశం కావాలి.

**రాష్ట్ర సబ్–కమిటీలు/ఫ్రాక్షన్ కమిటీలు :** చాలా రాష్ట్రాల్లో మహిళా సబ్–కమిటీలు/లేక ఫ్రాక్షన్ కమిటీ సమావేశాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి హాజరవుతున్నప్పటికీ ఈ సమావేశాల నివేదికలను రాష్ట్ర కమిటీలకు సమర్పించకపోవడం జరుగుతున్నది. పార్టీతో సమన్వయంలో ఇదో పెద్ద అంతరంగా ఉన్నది. దీనివల్ల ఈ సమావేశాల్లో లేవనెత్తబడుతున్న సమస్యలు పరిష్కారం కావడం లేదు, అలాగే మహిళల్లో చేస్తున్న కృషిలో వస్తున్న అనేక రాజకీయ అనుభవాలు రాష్ట్ర కమిటీ మొత్తం అవగాహనగా మారడం లేదు. మహిళా ఫ్రాక్షన్ కమిటీ జరిగిన తరువాత ఆ సమావేశం నోట్‌ను ఫ్రాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకత్వానికి ఇవ్వడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు.

## పార్టీ నిర్మాణం

పార్టీలోకి మహిళలను రిక్రూట్ చేసుకోడానికి మహిళా సబ్–కమిటీ, రాష్ట్ర ఫ్రాక్షన్ కమిటీలు చైతన్యవంతమైన కృషి చేస్తున్నాయి. ఫ్రాక్షన్ కమిటీ సమావేశాల్లో వచ్చిన కొన్ని సమస్యలు ప్రస్తావించాల్సి ఉంది. పశ్చిమ బెంగాల్‌లో శాఖ స్థాయిలోనూ, స్థానిక స్థాయిలోనూ మహిళలను రిక్రూట్ చేసుకోవడంలో ఇంకా కొంత అయిష్టత కనిపిస్తోంది. పంచాయితీ ఎన్నికల్లో మహిళా కార్యకర్తలు ధైర్యంగా పోరాడినప్పటికీ ఈ పరిస్థితి ఉంది. హిందీ మాట్లాడే అన్ని రాష్ట్రాల్లోనూ మహిళా పార్టీ సభ్యుల శాతంలో కొంచెం పెరుగుదల ఉంది. కానీ ఉత్తర ప్రదేశ్, బీహార్‌లలో అతి తక్కువ శాతం ఉంది. ఈ రాష్ట్రాల్లో మహిళల శాతం వరుసగా 9.6, 8 ఉంది. మరీ ముఖ్యంగా బీహార్‌లో వర్గ, ప్రజా సంఘాల్లో మహిళల సభ్యత్వం గణనీయంగా ఉన్నప్పటికీ వారిని పార్టీలోకి తీసుకునేందుకు చైతన్యవంతమైన కృషి జరగడం లేదు.

రాష్ట్రాల ఫ్రాక్షన్ నివేదికల ప్రకారం పార్టీలోకి ప్రధానమైన రిక్రూట్ మెంట్ మహిళా ప్రజా సంఘం ద్వారానే జరుగుతోందన్న విషయం గుర్తించుకోవాలి. కర్నాటక వంటి కొద్ది రాష్ట్రాలు మినహా ఇతర వర్గ/ప్రజా సంఘాల నుండి రిక్రూట్‌మెంట్ నామమాత్రంగా ఉంది.

ప్రత్యేక మహిళా శాఖల ఏర్పాటు సమస్యను రాష్ట్రాలకు వదిలి వేసినప్పటికీ పురుషులు, మహిళలు కలిసి ఉన్న శాఖల్లో టైమింగ్‌ను మహిళలకు అనుకూలంగా మార్చే విషయంలో పురోభివృద్ధి చాలా తక్కువగా ఉంది. మహిళలు హాజరుకావాలంటే సాయంత్రం పొద్దుపోయాక పెడితే వారికి వీలుగా ఉంటుంది. కలిసి ఉన్న శాఖల్లో ఇప్పటికీ మహిళా శాఖా కార్యదర్శుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది.

## మహిళా జన బాహుళ్యంలో పార్టీ సభ్యుల పని

మహిళా ప్రజా సంఘంలోని మహిళా పార్టీ సభ్యులు ప్రజా పంథాను చాలావరకు బాగానే అమలు చేస్తున్నారు. అయితే, మహిళా సభ్యులతోనూ, మహిళా జనబాహుళ్యంతోనూ సజీవమైన, స్థిరమైన సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అనేక పోరాటాలు చేసిన మహిళల్లో కూడా ఒక బలహీనత కొనసాగుతోంది. మహిళల్లో పార్టీ పునాది నిర్మాణానికి మహిళా పార్టీ సభ్యుల కృషిలో ఈ బలహీనత కొనసాగుతోంది. మహిళా ప్రజా సంఘం సభ్యత్వంతో మహిళా పార్టీ సభ్యుల సంఖ్యను సరిపోలిస్తే పెద్ద అఖాతం కనిపిస్తుంది. ప్రతి మహిళా ప్రజా సంఘం యూనిట్ నుండి కనీసం ఇద్దరు కొత్త సభ్యులను పార్టీలోకి రిక్రూట్ చేసుకోవడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు. మాస్ సభ్యత్వ బాహుళ్యాన్ని ఎలా రాజకీయంగా తర్ఫీదు చేసుకోవాలి అన్నది మరో సమస్య.యూనిట్ స్థాయిలో, క్షేత్ర స్థాయిలో శిక్షణ పొందిన రాజకీయ మహిళలు లేకపోవడం మరో లోపం. ఈ లోపాన్ని సరిదిద్దడంపై మరిత శ్రద్ధ పెట్టాలి.

మహిళల్లో రాజకీయ పునాదిని పెంచడానికి మరో ముఖ్యమైన లింకు ఏమంటే, స్థానిక/గ్రామీణ నివాస ప్రాంతాల్లో సమన్వయంతో కూడిన పని చేయడం. ఇక్కడ వివిధ ప్రజా/వర్గ సంఘాల మహిళా సభ్యులు నివసిస్తుంటారు. ఈ విషయంలో పురోగమనం సున్నా. ఎన్నికల్లో మినహా ఇక్కడ సమన్వయం చాలా తక్కువగా ఉంటోంది. ట్రేడ్ యూనియన్ ఆధారిత వర్కింగ్ వుమెన్ సంఘాలతో సమన్వయానికి సంబంధించి ఈ కాలంలో పరిస్థితి మరింత దిగజారింది. మహిళా ప్రజా సంఘంలో పనిచేస్తున్న కేంద్ర నాయకులు కృషి చేసినప్పటికీ ఈ కాలంలో సమన్వయం తగ్గిపోయింది. రాష్ట్రాల స్థాయిలో ఉన్న ఆ మాత్రం సమన్వయం మీద కూడా దీని ప్రతికూల ప్రభావం పడింది. మహిళల్లో పార్టీ పునాదిని నిర్మించాలంటే కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఇటువంటి సమన్వయం ఉంటేట్లు చూడాలి.

## స్వతంత్ర పనివిధానం

ఈ ప్రజా సంఘం స్వతంత్ర పని విధానంలో పురోగతి ఉంది. వివిధ స్థాయిల్లో పార్టీ జోక్యం చేసుకోవడం, చివరికి ఆఫీస్–బేరర్లకు సంబంధించిన నిర్ణయాలు కూడా చేయడం వంటి పాత పద్ధతులు అన్ని రాష్ట్రాల్లోనూ సరిదిద్దబడ్డాయి. వివిధ స్థాయిల్లో ప్రధాన ఆఫీస్–బేరర్లను మహిళా సబ్–కమిటీ/ఫ్రాక్షన్ కమిటీతో సంప్రదించి ఖరారు చేయడం జరుగుతోంది. ఈ విషయంలో సానుకూల మార్పు వచ్చింది.

అయితే, కొన్ని రాష్ట్రాల్లో ముఖ్యంగా హిందీ మాట్లాడే ప్రాంతంలో పార్టీలో దీనికి వ్యతిరేకమైన ధోరణి బయలు దేరింది. ఇక్కడ మహిళా సంస్థను నిర్లక్ష్యం చేయడం లేకుంటే, చాలా తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం చేస్తున్నారు. రాజస్థాన్, బీహార్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో పార్టీకి మహిళల మద్దతుతో మంచి ఓట్లు వచ్చిన నియోజకవర్గాల్లో కూడా మహిళా ప్రజా సంఘం సభ్యత్వం చాలా తక్కువగా ఉండడమో లేక లేకపోవడమో ఈ ధోరణికి ఒక ఉదాహరణ.

హిందీ ప్రాంత రాష్ట్రాల్లో మహిళల్లో పార్టీ పని చేయాల్సిన అవసరాన్ని కనీసం కూడా గుర్తించడం లేదు. ఈ రాష్ట్రాల్లోని మహిళా ఫ్రాక్షన్ ఈ అఖాదాన్ని పూడ్చడానికి ప్రయత్నించాలి.

ప్రజా సంఘాలు నిర్ణయించిన ప్రజా కార్యక్రమాల్లో సమన్వయం అనేది మరో సమస్య. ఏ ఇతర కార్యక్రమం అడ్డువచ్చినా మహిళా సంఘాన్నే కార్యక్రమాన్ని మార్చుకోమని కోరడం జరుగుతోంది. ఈ సమస్యపై మరింత సమన్వయం అవసరం.

మహిళా పార్టీ సభ్యులకు పని అప్పగించడం అనేది మరో కొనసాగుతున్న సమస్య. మహిళా పార్టీ సభ్యులు ప్రజా సంఘంలో చేసే పనిని రాజకీయ కృషిగా చూడకపోవడం, లేక తక్కువ విలువ ఇవ్వడం జరుగుతోంది. ఇది కూడా మహిళా కార్యకర్తల అంచనాపై ప్రభావం కలిగిస్తోంది. దాంతోపాటు మహిళా కార్యకర్తలను అంచనా వేసేటప్పుడు వాళ్లు బాధ్యత వహిస్తున్న ఇంటి పనిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. 23వ పార్టీ మహాసభలో ఈ సమస్యలను లేవనెత్తడం జరిగింది. కానీ పురోగతి మాత్రం చాలా తక్కువగా ఉంది.

చాలా రాష్ట్రాల్లో ప్రజా సంఘాలు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కార్యాలయాల్లో పనిచేస్తున్నాయి. జిల్లా స్థాయిలో ఇది అన్ని చోట్లా సాధ్యం కాదు. జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక కార్యాలయాలు ఉంటేట్లు కేరళ శ్రద్ధ తీసుకుంది. ఈ కృషిలో కావలసిన వనరులను మహిళలే స్వతంత్రంగా వసూలు చేసుకోవడం గుర్తించ దగ్గ అంశం.

## కాడర్ అభివృద్ధి, పూర్తికాలం కార్యకర్తలు

ఈ మూడేళ్ల కాలంలో వెయ్యిమందికి పైగా మహిళా కార్యకర్తలు మహిళా ప్రజా సంఘంలోనూ, పార్టీలోనూ పని చేశారు. వారిలో ఎక్కువ మంది కేరళలో ఉన్నారు. మహిళా ప్రజా సంఘ కేంద్రం ఇచ్చిన సహకారం వల్ల మహిళా పూర్తికాలం కార్యకర్తల సంఖ్య తొమ్మిది రాష్ట్రాల్లో 15 మంది నుండి 11 రాష్ట్రాల్లో 23 మందికి

పెరిగింది. ముఖ్యంగా హిందీ మాట్లాడే ప్రాంతంలోనూ, అస్సాం, మణిపూర్‌లలో పెరిగింది. కేంద్రంలో ముగ్గురు పూర్తికాలం కార్యకర్తలున్నారు. హిందీ మాట్లాడే ప్రాంతంలో రాష్ట్ర స్థాయిలో పూర్తికాలం కార్యకర్తలుండాలన్న లక్ష్యంతో కేంద్రం సహాయం చేస్తోంది. అయితే జిల్లా స్థాయిలో కూడా చాలా మంది పనికి వచ్చే కార్యకర్తలున్నారు, కాకపోతే ఆర్థిక సహకారం లేకపోవడం వల్ల వారు పనిచేయడం కష్టమైపోతున్నది. సంఘం కోసం పూర్తికాలం పని చేస్తున్న మహిళలు చాలా మంది ఉన్నారు. అయితే వారు పూర్తికాలం కార్యకర్తలుగా "అధికారికంగా" గుర్తింపుకు నోచుకోవడం లేదు. దానివల్ల వారిని ఈ జాబితాలో చేర్చలేదు. లభించిన కొన్ని వివరాల ప్రకారం : కేరళల్లో మహిళా ప్రజా సంఘం/పార్టీలో 550 మంది మహిళా పూర్తికాలం కార్యకర్తలు వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారు. దేశంలోనే ఇది అత్యధిక సంఖ్య. తమిళనాడులో 77 మంది పూర్తికాలం పనిచేస్తున్నారు, మరో 71 మంది అలవెన్స్‌తో పనిచేస్తున్నారు. మొత్తం 148 మంది. త్రిపురలో వీరి సంఖ్య 67. పశ్చిమ బెంగాల్‌లో మహిళా పూర్తికాలం కార్యకర్తల సంఖ్య 35 నుండి 51కి పెరిగింది. తెలంగాణాలో 31 నుండి 42కి పెరిగింది. ఆంధ్ర ప్రదేశ్‌లో 30 మంది ఉన్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో చూస్తే, ఢిల్లీలో అయిదుగురు మహిళా పూర్తికాలం కార్యకర్తలు, మహిళా ప్రజా సంఘం నుండి అలవెన్స్ తీసుకుంటున్న మరో ఆరుగురు మహిళలు ఉన్నారు.

చాలా తీవ్రమైన ప్రతికూల పరిస్థితుల్లో కూడా మహిళా కార్యకర్తలు ఉద్యమాన్ని, పార్టీని రక్షించడంలో గొప్ప పాత్ర నిర్వహించారన్నది వాస్తవం. పార్టీ జన సమీకరణల్లో మహిళలు పెద్ద భాగం ఉంటున్నారు. వీరిని ప్రధానంగా మన మహిళా కార్యకర్తలు సమీకరిస్తున్నారు. ఇలా అనేక సానుకూల పరిణామాలు ఉన్నాయి.

యువ మహిళా కార్యకర్తలను అభివృద్ధి చేసుకోడానికి జరిగిన కృషి కొద్దిపాటి విజయం మాత్రమే సాధించింది.

మహిళా కార్యకర్తల కోసం పార్టీ మూడు రోజుల కేంద్ర పాఠశాల నిర్వహించింది. 100 మంది నాయకత్వ కార్యకర్తలు హాజరయ్యారు. మంచి స్పందన వచ్చింది. మహిళా కార్యకర్తలకు పార్టీ ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.

**ఇతర సమస్యలు**

కేంద్ర కమిటీ మహిళలపై ఆమోదించిన పెర్‌స్పెక్టివ్ పత్రాన్ని (2005) ఇప్పటి గణాంకాలతో తాజాపరచాల్సి ఉంది. ఈ కాలంలో పత్రాన్ని చాలా సార్లు రిపోర్టు

చేయడం జరిగింది. కానీ పార్టీ పాఠ్యాంశాల్లో దాన్ని ఒకటిగా ఇప్పటికీ చేర్చలేదు. ఈ పని చేయాలి.

మహిళలకు సంబంధించిన సమస్యలను పార్టీ నేరుగా చేపట్టాలన్న నిర్ణయాన్ని కేవలం తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కర్నాటకలో మాత్రమే అమలు చేశారు.

దిద్దుబాటు ఉద్యమంలో చెప్పినట్లు పార్టీలో పితృస్వామిక ధోరణులకు వ్యతిరేకంగా చైతన్య పూర్వకంగా పోరాడాలి.

## యువజనులు

గత మూడేళ్ల కాలంలో యువజనుల పరిస్థితుల్లో పెద్ద మార్పేమీ లేదు. ఆర్థిక అస్థిరత, నిరుద్యోగం, విద్యకు దూరం చేయడం కొనసాగుతున్నాయి. నిరుద్యోగం ఒక పెద్ద సంక్షోభంగా ఉంది. దాన్ని రూపుమాపడానికి ఎటువంటి నిర్ధిష్ట చర్యలు లేవు. ఉపాధి కోసం గ్రామాల నుండి పట్టణాలకు వలసలు పెరుగుతూనే ఉన్నాయి. దాని వల్ల దేశ వ్యాపితంగా వలస కార్మికులు పెరిగిపోయారు. ప్రభుత్వ ఉద్యోగ రిక్రూట్‌మెంటులో సంక్షోభం యువతను వెంటాడుతున్నది. ప్రస్తుతం దేశంలో యువత ఒక లోతైన సంక్షోభ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నది. ఈ సంక్షోభం ఆర్థిక పరమైనదే కాదు, సైద్ధాంతికపరమైనది కూడా. ఎందుకంటే, యువతలో పెరుగుతున్న అసంతృప్తిని ఉపయోగించుకోడానికి అభివృద్ధి నిరోధక శక్తులు ప్రయత్నిస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో యువజన రంగం కార్యక్రమాలు నిర్వహిస్తున్నది, వివిధ రకాల క్యాంపెయిన్లు చేపడుతున్నది.

**నిరుద్యోగానికి వ్యతిరేకంగా పోరాటం**

2022 నవంబర్ 3న నిరుద్యోగానికి వ్యతిరేకంగా న్యూఢిల్లీలో పార్లమెంటు మార్చ్ నిర్వహించారు. ఇందులో దాదాపు 5,000 మంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15న అనేక రాష్ట్రాల్లో అఖిల భారత డిమాండ్స్ డే నిర్వహించారు. అందుబాటులో విద్య, అందరికీ ఉపాధి వంటి డిమాండ్లతో ఇది జరిగింది. అనేక రాష్ట్రాల్లో నిరసనలు జరిగాయి. కొన్ని రాష్ట్రాల్లో అవి కేవలం అలంకార ప్రాయంగా జరిగాయి. కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర, తమిళనాడుల్లో నిరుద్యోగానికి వ్యతిరేకంగా నిరంతరాయమైన పోరాటాలు జరిగాయి. ఈ రాష్ట్రాల్లో నిరంతరాయంగా క్యాంపెయిన్లు, కార్యక్రమాలు జరిగాయి. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, మహారాష్ట్ర, అస్సాం వంటి రాష్ట్రాల్లో అనేక క్యాంపెయిన్లు చేపట్టారు. నిరుద్యోగానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించే

ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కర్నాటకలో కాలానుగతంగా కార్యక్రమాలు నిర్వహించారు.

అగ్నిపథ్ పథకం ప్రకటించిన తరువాత అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ కీలక పాత్ర వహించే రాష్ట్రాల్లో దానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు జరిగాయి. ఈ పథకం ప్రకటించిన వెంటనే తక్షణ ప్రతిస్పందనగా ఢిల్లీలో విద్యార్థి రంగంతో కలిసి ఒక సంయుక్త నిరసన ప్రదర్శన జరిగింది. అయితే, ఈ కార్యక్రమానికి యువజన రంగం చొరవ చూపలేదన్న విషయాన్ని గుర్తించుకోవాలి. అగ్నిపథ్‌పై సద్యోజనిత నిరసన వెల్లువెత్తడంతో అప్పుడు యువజన రంగం జోక్యం చేసుకుంది.

యువజన రంగంలో కృషి గురించిన సమీక్ష (2023 ఆగస్టు) ఇలా పేర్కొంది: "సంఘం సంఘటితంగా పనిచేయడం మాట అటుంచితే, క్షేత్ర స్థాయిలో మనం పద్ధతి ప్రకారం సమీకరించడం చేయకపోవడం వల్ల పోరాటం నిలబడలేకపోతున్నది." నిరుద్యోగానికి వ్యతిరేకంగా దేశవ్యాపిత ఉద్యమాన్ని నిర్మించే అవకాశం వచ్చినప్పటికీ యువజన రంగం దాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేకపోయింది.

## మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం

2023 జనవరి 30 : దేశవ్యాపితంగా మతసామరస్య దినాన్ని పాటించారు.

2024 జనవరి 30: గాంధీని గాడ్సే హత్యచేసిన దినాన్ని స్మరించుకుంటూ లౌకిక విలువలను పెంపొందించే శపథంతో దేశ వ్యాపితంగా కార్యక్రమం జరిగింది.

2025 జనవరి 26 : భారత దేశంలోని బహుళత్వాన్ని చాటుతూ, మతతత్వ విద్వేషాన్ని ఎదుర్కొనాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ వివిధ రాష్ట్రాల్లో కార్యక్రమాలు జరిగాయి.

బంగ్లా దేశ్‌లో అస్థిరత ఏర్పడ్డంతో పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో యువజన రంగం సామాజిక సామరస్యాన్ని చాటుతూ కార్యక్రమాలు చేపట్టింది.

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం

అన్ని రాష్ట్రాల్లో మాదక ద్రవ్యాలకు బానిసలు కావడం అనేది ఒక పెద్ద సమస్యగా మారింది. యువజనుల్లో మాదక ద్రవ్యాల సేవనం పెరుగుతున్నది. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోక పోవడం, నివారణ చర్యలు తీసుకోకపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించింది. మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా లభించడం వల్ల తీవ్రమైన సామాజిక, ఆర్థిక పర్యసానాలు ఏర్పడుతున్నాయి.

తమిళనాడులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, అవేర్‌నెస్ కార్యక్రమాలు జరిగాయి. వేలాది మందిని సమీకరించారు. త్రిపురలో మాదక ద్రవ్యాలకు బానిసలవ్వడం వల్ల వచ్చే ప్రమాదాలను వివరిస్తూ నిరంతరమైన ఉద్యమాలు జరిగాయి. కేరళ, తెలంగాణాల్లో కూడా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా కొన్ని కార్యక్రమాలు చేశారు. మాదక ద్రవ్య సంబంధిత సమస్యలు పెరుగుతున్న ఇతర రాష్ట్రాల్లో కూడా ఇటువంటి చొరవ తీసుకోవాలి.

యువజన రంగంలో పనిపై కేంద్ర కమిటీ సమీక్ష (2023 ఆగస్టు) ఇలా పేర్కొంది: "బిజెపి ప్రభుత్వ మొత్తం యువజన–వ్యతిరేక విధానాలు లేక యువజనుల బ్రతుకులు ఛిద్రం చేస్తున్న కార్పొరేట్–మతతత్వ కూటమికి సంబంధించిన పెద్ద సమస్యలు ముందుకు వచ్చి అవి కాస్తా అందరికీ అర్థమయ్యే డిమాండ్లు, నినాదాల రూపం తీసుకుని, వాటిని తమ డిమాండ్లుగా క్రింది స్థాయిలోని సాధారణ యువజన బాహుళ్యం పరిగణించకపోతే విశాల ప్రాతిపదిక గల పోరాటాలు సమర్థవంతంగా ముందుకు రాబోవని ఈ కాలంలో మనం చేసిన పోరాటాలు మనకు పాఠాలు నేర్పుతున్నాయి."

## సహాయ కార్యక్రమాలు

కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, త్రిపురతో సహా అనేక రాష్ట్రాల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయ, సేవా కార్యక్రమాల్లో యువజన రంగం చురుకైన పాత్ర నిర్వహించింది. నిత్యావసరాలు పంచడం, పునరావాసానికి తోడ్పడం, అక్కడికక్కడ సహాయం అందించడానికి వాలంటీర్లను సమీకరించడం వంటి పనులు నిర్వహించింది. వైనాడ్‌లో మట్టిపెళ్లలు విరిగిపడిన ప్రమాదంలో బాధితులకు సహాయం అందించడంలో కేరళ యువజన రంగం కమిటీ గొప్ప చొరవ తీసుకుంది. పునరావాసం కోసం 20 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసింది.

## దళిత, గిరిజన యువత:

గిరిజన, దళిత, మైనారిటీ యువతలో సమర్థవంతంగా చొరబడేందుకు నిర్దిష్టమైన ప్రణాళికలు తయారు చేయాలని 22వ పార్టీ మహాసభ రాజకీయ, నిర్మాణ నివేదిక యువజన రంగాన్ని ఆదేశించింది. ఈ దిశలో యువజన రంగం చొరవ తీసుకుంది. దళిత గిరిజన యువత ఎదుర్కొంటున్న వివక్ష సమస్యను చేపట్టింది.

కొన్ని రాష్ట్రాలలో దళిత, గిరిజన యువత ఎదుర్కొంటున్న వివక్షకు వ్యతిరేకంగా యువజన రంగం ఇతర ప్రజా సంఘాలతో కలిసి కార్యక్రమాలు చేపట్టింది.

కుల వివక్ష, నిరుద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం వంటి సమస్యలపై చర్చించేందుకు చండీగర్‌లో అఖిల భారత దళిత యువజన కన్వెన్షన్ జరిగింది.

ముంబయిలో జరిగిన అఖిల భారత గిరిజన యువజన కన్వెన్షన్ గిరిజన భూ హక్కులు, విద్య, ప్రభుత్వ నిర్లక్ష్యం వంటి సమస్యలపై చర్చించింది.

ఈ చొరవ తీసుకున్నప్పటికీ క్రింది స్థాయిలో వీటిని అమలు చేయడంలో లోపాలు ఉన్నాయి.

## లింగ సమానత్వంపై పోరాటం

కొన్ని రాష్ట్రాల్లో లింగ వివక్షకు వ్యతిరేకంగా వివిధ స్థాయిల్లో నిరంతర కార్యక్రమాలు చేపట్టారు. లింగ వివక్షకు సంబంధించిన ఘటనలపై తక్షణ ప్రతిస్పందనగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

పశ్చిమ బెంగాల్‌లో ఆర్‌జి కార్ ఘటనపై యువజన రంగం తక్షణం ప్రతిస్పందించి దేశవ్యాపిత నిరసన పిలుపునిచ్చింది. రాష్ట్ర వ్యాపితంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బాధితురాలికి న్యాయం జరగాలన్న డిమాండుతో జరిగిన ఉద్యమంలో పశ్చిమ బెంగాల్ యువజన రంగం రాష్ట్ర కమిటీ ముఖ్యమైన పాత్ర నిర్వహించింది.

లింగపరమైన న్యాయం కోసం జరిగిన వివిధ క్యాంపెయిన్లలో ముఖ్యంగా వరకట్నానికి వ్యతిరేకంగా కేంద్రీకరించబడిన పోరాటంలో కేరళ యువజన రంగం ముందు పీఠిన ఉంది.

ట్రాన్స్ జెండర్ల పట్ల వివక్ష, అందరినీ కలుపుకొనే విధానాలు, మరింత సమానత్వంతో కూడిన సమాజం వంటి అంశాల్లో యువజన రంగం మరింత సానుకూల చొరవ తీసుకోవలసిన అవసరం ఉంది.

## అఖిల భారత యువతుల కన్వెన్షన్

అఖిల భారత యువతుల కన్వెన్షన్ 2023 ఫిబ్రవరి 25, 26 తేదీల్లో న్యూ ఢిల్లీలో జరిగింది. యువజన రంగానికి చెందిన వివిధ కమిటీలు, కార్యక్రమాల్లో యువతులు పాల్గొనడం చాలా తక్కువగా ఉంది. ఈ కన్వెన్షన్‌లో కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులతోపాటు 156 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొత్త పరిణామాలు, సవాళ్లు

చాలా కాలం తరువాత గుజరాత్‌లో యువజన రంగం కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ కాలంలో అండమాన్, లక్ష ద్వీప్‌ల యూనిట్ల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ప్రస్తుతం అవి పనిచేస్తున్నాయి. సిక్కింలో రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి గానీ ఫలించలేదు.

యువజన రంగం లేని రాష్ట్రాల్లో సంస్థాగత కమిటీలు ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్న కర్తవ్యాన్ని నిర్వర్తించలేకపోయాం. జార్ఖండ్‌లో యువజన రంగం కార్యకలాపాలు ఈ కాలంలో బలహీన పడ్డాయి, 2023–24లో సభ్యత్వమే చేర్పించలేదు. మధ్య ప్రదేశ్‌లో యువజన రంగానికి చిన్న సంస్థాగత నిర్మాణం ఉన్నప్పటికీ చురుకుగా పనిచేయడం లేదు, అభివృద్ధి లేదు. ఉత్తరాఖండ్‌లో గతంలో సంస్థ చురుకుగా ఉండేది కానీ నేడు ఇనాక్టివ్ అయింది.

హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో సంస్థ పరిస్థితి గురించి చర్చించి అక్కడ సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే ఉద్దేశ్యంతో న్యూ ఢిల్లీలో ఆ రాష్ట్రాల యువజన రంగం నాయకుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఇటు వంటి ప్రయత్నాలు కొనసాగించాల్సి ఉంది.

## సభ్యత్వం, ప్రాథమిక యూనిట్లు

గత మూడేళ్లలో యువజన రంగం మొత్తం సభ్యత్వం దాదాపు స్తబ్దంగా ఉంది. రాష్ట్రాల వారీ చూస్తే వ్యత్యాసాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో సభ్యత్వం పెరిగింది, మరికొన్ని రాష్ట్రాల్లో తగ్గింది. ప్రస్తుతం మొత్తం సభ్యత్వంలో 90 శాతం కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లోనే ఉంది.

రాష్ట్రాల ఫ్రాక్షన్ కమిటీలు, యువజన రంగం రాష్ట్ర కమిటీలు ఏడాది ప్రారంభంలోనే సమయంలో పూర్తయ్యే, ప్రణాళికా యుతమైన సభ్యత్వ క్యాంపెయిన్‌కు చొరవ తీసుకోవాలి.

అనేక రాష్ట్రాల్లో యువజన రంగం ప్రాథమిక యూనిట్లను ఏర్పాటు చేయలేదు. యువజన రంగం స్థానిక సమస్యలను చేపట్టలేకపోతున్నది, స్థిరమైన ఉద్యమాలు నిర్మించలేకపోతున్నది. యువజన రంగం క్రింది స్థాయిలో ప్రాథమిక యూనిట్లను ఏర్పాటు చేయలేకపోవడానికి ఇది ఒక ప్రధాన కారణం. శాఖలు, స్థానిక స్థాయిల్లో ప్రాథమిక యూనిట్లు ఏర్పాటు చేయాలి.

మన ప్రభావాన్ని క్రింది స్థాయిలో సంఘటితపరచడంలో ప్రాథమిక యూనిట్లు ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తాయి. యువజన రంగం ప్రాథమిక యూనిట్లను పనిచేయించడం ప్రధానాంశంగా చేసుకోవాలి, స్థానిక సమస్యలను చేపట్టాలి.

## ఐక్య పోరాటాలు

వివిధ ఇతర వర్గ, ప్రజా సంఘాలతో కలిసి ముఖ్యంగా నిరుద్యోగం, దళితులు, గిరిజనులపై దాడులు వంటి వాటికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను నిర్మించడం యువజన రంగం ప్రధాన కర్తవ్యాల్లో ఒకటి.

యువజన రంగం వివిధ ఇతర ప్రజా సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు చేస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో ఈ ఐక్య పోరాటాలు సమర్థవంతగా జరుగుతున్నాయి. కానీ దేశ వ్యాపిత ఐక్య ఉద్యమాలు నడపడంలో స్థిరత్వం లేదు. రాష్ట్రాల్లో ఐక్య పోరాటాలను స్థిరంగా నడపాలంటే మరింత నిర్మాణాత్మక వైఖరి కావాలి.

విద్యార్థి, ట్రేడ్ యూనియన్ రంగాలతో కలిసి నిరుద్యోగానికి వ్యతిరేకంగా సమర్థవంతమైన ఐక్య ఉద్యమాలు చేపట్టాలన్న కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో బలహీనత ఉంది. యువజనులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నప్పటికీ, సరైన ఐక్య ఉద్యమాలు నిర్వహించడంలో అభివృద్ధి లేదు అని సమీక్షా పత్రం సరిగ్గానే పేర్కొంది.

## ఇతర వామపక్ష యువజన సంఘాలు

ఐక్య ఉద్యమాలను బలోపేతం చేసేందుకు గాను ఇతర వామపక్ష యువజన సంఘాలను ఒకచోటికి తెచ్చేందుకు మన యువజన రంగం చొరవ తీసుకుని కృషి చేసింది. అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా న్యూఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇతర వామపక్ష యువజన సంఘాలతో కలిసి ఐక్య ఉద్యమం అభివృద్ధి చేయడంలో ఎదురవుతున్న సవాళ్లను ఓపికగా అధిగమించాలి.

## ఇతర బిజెపి–వ్యతిరేక యువజన సంఘాలతో కలిసి పోరాడ్డం

బిజెపి విధానాలను వ్యతిరేకిస్తున్న సంఘాలను ఏకం చేసేందుకూ, కీలకమైన సామాజిక–రాజకీయ సమస్యలపై పనిచేస్తున్న యువజన గ్రూపులను ఒక తాటి మీదకు తెచ్చేందుకుగాను “ఇండియా” యువజన ఫ్రంట్ అనే బిజెపి–వ్యతిరేక యువజన సంఘాల వేదిక ఏర్పడింది. నిరుద్యోగం, విద్య, పౌర హక్కులు వంటివాటిని చర్చించడంపై ఇండియా యువజన ఫ్రంట్ కేంద్రీకరించింది. జంతర్ మంతర్ వద్ద పెద్ద సభ జరిగింది.

దానిలో మన యువజన రంగం చురుకైన పాత్ర నిర్వహించింది. కొన్ని రాష్ట్రాల్లో ఇండియా యుజన ఫ్రంట్ కార్యకలాపాలు కొన్ని జరిగాయి.

## కొన్ని ముఖ్యమైన పరిమితులు

కొన్ని రాష్ట్రాల్లో యువజన రంగం సాంస్కృతిక వేదికలు, రీడింగ్ రూమ్స్, ఆరోగ్య కేంద్రాలు వంటి సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నది. కానీ రాజకీయ కార్యకలాపాల్లో పెద్దగా పాల్గొనడం లేదు. మరోవైపు ఇతర రాష్ట్రాల్లో సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా కొరవడ్డాయి. ఈ రంగం అభివృద్ధి చెందాలంటే ఈ రెండు అంశాలను సమతూకంగా నిర్వహించడం కీలకం.

స్వతంత్ర పనివిధానం లేకపోవడం మరో ప్రధానమైన పరిమితి. అనేక రాష్ట్రాల్లో యువజన రంగానికి స్వంత కార్యాలయం లేదు. దానికి బదులు పార్టీ ఆఫీసుల్లోనే పనిచేస్తున్నాయి. దాని వల్ల కార్యక్రమాలు, సమావేశాలు కూడా అక్కడే జరుపుతున్నారు. ఇది యువజన రంగం స్వతంత్ర పనివిధానినికి పెద్ద సవాలుగా ఉంది. ఈ ఏర్పాటు వల్ల యువజన రంగం అనేది పార్టీ విభాగమే కాని స్వతంత్ర, ప్రజాస్వామిక ప్రజా సంఘం కాదన్న పాత భావం కొనసాగుతున్నది.

## రాజకీయ విద్య

2024 లోక్ సభ ఎన్నికలకు ముందు హిందీ మాట్లాడే రాష్ట్రాల కోసం ఒక రాజకీయ పాఠశాల నిర్వహించారు. కార్యకర్తలకు కీలకమైన సైద్ధాంతిక, నిర్మాణ అంశాల్లో ఎడ్యుకేట్ చేసేందుకు ఎక్కువ రాష్ట్రాల్లో రాజకీయ పాఠశాలలు నిర్వహించారు. ఈ కృషి జరిగినప్పటికీ వివిధ స్థాయిల్లో రాజకీయ చైతన్యం తక్కువ స్థాయిలో ఉంది. కార్యకర్తలకు పద్ధతి ప్రకారం విద్య గరపడానికీ, జాతీయ స్థాయి నుండి క్రింది స్థాయి వరకు వారిని సమీకరించడానికీ నిర్మాణాత్మక శిక్షణా కార్యక్రమాల అవసరం ఎంతైనా ఉంది.

## అఖిల భారత కేంద్రం

యువజన రంగం అఖిల భారత కేంద్రంలో పనిచేయడానికి అయిదుగురు సభ్యులను ఎంపిక చేశారు. మరో ఇద్దరు సభ్యులు కేంద్రం పనికి సహకరిస్తున్నారు. వారిని కేంద్ర నుండి పనిచేసే పూర్తికాలం యువజన కార్యకర్తలుగా తయారు చేయడంలో కొన్ని పరిమితులు, లోపాలు ఉన్నాయి. యువజన రంగం పాత కార్యాలయాన్ని

అమ్మేశారు. దాంతో ఈ రంగానికి శాశ్వత స్థలం లేకుండా పోయింది. యువజన రంగం కేంద్రం పనిని మెరుగు పరుచుకునేందుకు గాను దానికి కొత్త కార్యాలయ అవసరం ఉంది.

## పార్టీ నిర్మాణం

గత పార్టీ మహాసభ తరువాత కేంద్ర పార్టీ ఫ్రాక్షన్ కమిటీ సమావేశాలు 14, ఇంకా రెండు ఫ్రాక్షన్ సమావేశాలు (యువజన రంగం అఖిల భారత కమిటీలో అందరూ పార్టీ సభ్యులే ఉన్నారు) జరిగాయి. ఈ సమావేశాల్లో రాజకీయ పరిస్థితులు, చేపట్టాల్సిన కార్యకలాపాలు, పార్టీకీ యువజన రంగానికీ మధ్య సమన్వయం మొదలైన ఎజెండాలు పెట్టుకుని చర్చించారు.

పార్టీ కేంద్ర కమిటీ 2023 ఆగస్టు 4-6 తేదీల్లో జరిపిన సమావేశంలో యువజన రంగంపై సమీక్ష జరిపింది. రాష్ట్ర, జిల్లా స్థాయి ఫ్రాక్షన్ కమిటీల ఏర్పాటు ప్రాముఖ్యతను గురించి సమీక్ష చెప్పింది. కానీ, దాని తరువాత కూడా అనేక రాష్ట్రాలు, జిల్లాల్లో ఫ్రాక్షన్ కమిటీలు ఏర్పాటు కాలేదు. దీనిపై తక్షణం దృష్టి పెట్టాలి. ఫ్రాక్షన్ కమిటీలు ఏర్పాటైన రాష్ట్రాల్లో కూడా అవి దాదాపు పనిచేయడం లేదని గుర్తించడం జరిగింది. ఈ లోపాన్ని తక్షణం సరిదిద్దుకోవాలి.

కొన్ని రాష్ట్రాల్లో పార్టీ సాధారణ బలహీనత వల్ల, యువ క్యాడర్ లేకపోవడం వల్ల యువజన క్యాడర్‌ను పార్టీ రోజువారీ కార్యకలాపాలకు వాడుకోవాలన్న ఒత్తిడి వస్తోంది. కానీ దీని వల్ల వ్యతిరేక ఫలితాలు వస్తాయి. ఎందుకంటే, అటువంటి క్యాడర్ అటు యువజన రంగాన్ని నిర్మించడం మీద దృష్టి కేంద్రీకరించలేరు, లేక దీర్ఘకాలంలో పార్టీని బలోపేతమూ చేయలేరు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో యువజనుల్లో పార్టీ నిర్మాణం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని గ్రహించాం. ఈ రెండు ధోరణులు కూడా పార్టీ బలోపేతానికి ఉపయోగపడవు.

పార్టీలో యువజనుల సంఖ్యలో ఎటువంటి అభివృద్ధీ లేదని 2024 పార్టీ సభ్యత్వ స్క్రూటినీ నివేదిక తెలిపింది. అనేక రాష్ట్రాల్లో యువజన సభ్యులు తగ్గిపోవడం చాలా ఆందోళన కలిగించే ధోరణి. ఈ తగ్గుదలను ఆపి, పార్టీలో క్రమంగా యువజనుల సంఖ్యను పెంచడం ఫ్రాక్షన్ కమిటీల కర్తవ్యం.

బలమైన యువజన ఉద్యమాన్ని నిర్మించాలంటే స్థానిక సమస్యలను చేపట్టడం అత్యవసరం. స్థానిక సమస్యలను చేపట్టాల్సిన ప్రాముఖ్యతపై సమీక్షా నివేదిక ఈ విధంగా పేర్కొంది: "ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన యువజనోద్యమాన్ని నిర్మించాల్సిన తక్షణ అవసరాన్ని పరిపూర్తి చేయాలంటే స్థిరమైన స్థానిక పోరాటాలు నిర్వహించడం ముఖ్యమైన ప్రాధాన్యతగా ఉండాలి. ఇది గత కొన్ని పార్టీ మహాసభలో వచ్చిన నిర్ధారణ మాత్రమే కాదు, ముఖ్యంగా యువజనోద్యమంలో వాస్తవంగా ఎదురవుతున్న లోపాలు దీని అవసరాన్ని చెబుతున్నాయి. యువజనోద్యమ లక్షణం స్థానికమైనదే..."

పార్టీ కమిటీలు యువజన రంగాన్ని దగ్గరినుండి మార్గదర్శనం చేయాలి, ఒక సమతుల్యమైన వైఖరి తీసుకోవాలి, యువజన రంగం స్థానిక పోరాటాలకు ప్రథమ ప్రాధాన్యత నిచ్చే విధంగా సహాయపడాలి.

ఉద్యమాల పట్ల, సానుకూలమైన సాంఘిక సంక్షేమ కార్యకలాపాల పట్ల సర్వతోముఖ వైఖరి తీసుకోవడం అనే దాన్లోనే యువజన రంగం బలహీనత ఉందని సమీక్షా నివేదిక చెప్పింది. యువజన రంగాన్ని ముందుకు నడిపే స్థిరమైన స్థానిక పోరాటాల అవసరాన్ని గురించి కూడా చెప్పింది. నిర్మాణ పరంగా చూస్తే యువజన రంగానికి సంబంధించి ప్రాథమిక యూనిట్ కమిటీలు నిర్మించలేకపోవడం అత్యంత కీలకమైన బలహీనత. దీన్ని తక్షణం సరిదిద్దుకోవాలి. యువజన రంగంలో పార్టీ నిర్మాణం క్రింది స్థాయి నుండి ప్రారంభించాలి.

## కర్తవ్యాలు

సమీక్షలో నిర్దిష్టంగా చెప్పిన అంశాలు ఇప్పటికీ ఆచరణయోగ్యమైనవే:

1. యువజన రంగం స్వతంత్రంగా, ప్రజాస్వామ్యయుతంగా పనిచేసేట్లు చూడాలి.
2. యువజనులు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలపై స్థానిక పోరాటాలను పట్టువిడువకుండా నడపాలి.
3. యువజన రంగ ప్రాథమిక యూనిట్లను నిర్మించే దిశగా యూత్ క్యాడర్‌ను గైడ్ చేయాలి.
4. యువజన క్యాడర్‌కు క్రమబద్ధమైన రాజకీయ–సైద్ధాంతిక విద్య గరపాలి. ముఖ్యంగా యువజనులను ఆకర్షించేందుకుగాను ప్రస్తుత భారతీయ సందర్భంలో సోషలిస్టు విజన్ గురించి ప్రచారం చేయాలి.

5. యువజనుల తక్షణ సమస్యలు, ఆందోళనలపై జరిగే పోరాటాలు జయప్రదం కావాలంటే హిందుత్వ సవాళ్లను ఎదుర్కోవలసిన అవసరం ఉందన్న విషయం తెలిసేట్లు రెంటినీ లింకు చేయాలి.
6. రక్తదానం, అక్షరాస్యత కార్యక్రమం, సాంస్కృతిక క్రీడా కార్యకలాపాలు, ప్రకృతి విలయాల్లో సహాయ చర్యలు, ప్రజా గ్రంధాలయాను నెలకొల్పడం వంటి యువతకు ఆసక్తికరమైన కార్యకలాపాలను ప్రోత్సహించాలి.

**వీటితోపాటు పార్టీకి సంబంధించిన మరికొన్ని కర్తవ్యాలు:**

1. యువజన రంగానికి తగిన క్యాడర్‌ను కేటాయించేట్లు పార్టీ కమిటీలు చూడాలి. అటువంటి క్యాడర్ తమ ప్రధానమైన పనిని యువజన సంఘానికి మాత్రమే కేటాయించాలి, ఇతర పనులకు మళ్లించకూడదు.
2. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఫ్రాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలి. అవి రెగ్యులర్‌గా పనిచేసేట్లు రాష్ట్ర కమిటీలు చూడాలి.
3. ఆయా రాష్ట్రాల్లో యువతులు, యువ దళితులు, ఆదివాసీలు, మైనారిటీలను పార్టీలో చేర్చుకునేట్లు ఫ్రాక్షన్ కమిటీల ద్వారా పార్టీ చూడాలి.
4. యువజన సంఘం నిరుద్యోగ సమస్యను స్వతంత్రంగా చేపట్టాలి, అదే సమయంలో ట్రేడ్‌యూనియన్లు, విద్యార్థి సంఘాల సహకారం తీసుకోవాలి. ఈ మూడు రంగాల మధ్య సమన్వయం ఉండేట్లు పార్టీ చూడాలి.

## విద్యార్థి

23వ పార్టీ మహాసభ విద్యార్థి రంగానికీ, పార్టీకీ కీలకమైన కర్తవ్యాలను నిర్దేశించింది. విద్యార్థి రంగానికి సంబంధించిన ఆందోళన, సామాజిక, రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణపరమైన అంశాలను సమర్ధవంతంగా తీర్చిదిద్దే విషయంపై కేంద్రీకరించడం జరిగింది. విద్యార్థి రంగానికి ప్రాధాన్యతలు నిర్దేశిస్తూనే పార్టీ స్వతంత్ర పాత్రను బలోపేతం చేయడంపై కేంద్రీకరించింది. రోజువారీ సమస్యలపై స్థిరమైన స్థానిక పోరాటాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులతో బలమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవడానికి కృషి జరిగింది. క్రింది స్థాయిలో విశాలమైన ఐక్యత సాధించడానికి ప్రయత్నాలు జరిగాయి. దాంతోపాటు ఇతర విద్యార్థి గ్రూపులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సంరక్షకులతో కలిసి ఐక్య కార్యాచరణ జరిగింది.

## విద్యపై దాడులు

బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) విద్యా వ్యవస్థలో వ్యాపారీకరణ, మతతత్వీకరణ, కేంద్రీకరణను మరింత బలపరిచింది. ఇది విద్యలో, ముఖ్యంగా విద్యనభ్యసించే ఖర్చులు పెంచడం ద్వారా, అసమానతలు పెంచింది. ఈ విధానాల వల్ల దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, విద్యార్థినులు పెద్దగా దెబ్బతిన్నారు. పాఠ్య పుస్తకాలను తిరిగి రాయడం, అహేతుకమైన, అశాస్త్రీయమైన భావాలను ప్రవేశపెట్టడం, వాస్తవాలకు బదులు పుక్కిటి పురాణాలను ప్రవేశ పట్టడం పెరిగింది. బడ్జెట్ కోతల వల్ల విద్యా సంస్థల్లో ప్రాథమిక సదుపాయాలు కుప్పకూలిపోయాయి. దాంతో ప్రభుత్వ విద్యాలయాల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గింది. మరోవైపు నీట్, క్యూట్ వంటి పరీక్షలు విద్య కేంద్రీకరణకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

## మారుతున్న ధోరణులు

విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులు విద్యార్థుల ధోరణులు, ప్రవర్తనపై ప్రభావం చూపుతున్నాయి. పనిచేస్తూ చదివే విద్యార్థుల సంఖ్య పెరిగింది. మరోవైపు క్యాంపస్‌లలో విద్యార్థుల సంఖ్య తగ్గిన విషయం మనం గమనించాం. దూర విద్య, ఆన్‌లైన్ కోర్సులు –నాసిరకమే అయినా– పెరిగాయి. ఆధునిక టెక్నాలజీతో పెరిగిన కొత్త తరం విద్యార్థులు – జనరేషన్ జెడ్, జెనరేషన్ ఆల్ఫా– ప్రపంచ వ్యాపితంగా కనెక్ట్ అయి ఉన్నారు. సమస్యలను త్వరగా అర్థం చేసుకోగలుగుతున్నారు. మరింత ఓపెన్–మైండెడ్‌గా ఉన్నారు. భవిష్యత్ తరాలు కూడా ఇదే దిశలో పురోగమిస్తారు.

ఆధునిక తరం విద్యార్థులతో వ్యవహరించాలంటే పార్టీ, విద్యార్థి రంగం కూడా వారి సైకాలజీని అర్థం చేసుకోవాలి. ఆరోగ్య సంరక్షణ, మానసిక ఆరోగ్యం, ఉద్యోగ భద్రత, పౌర హక్కులు, ఉచిత వై–ఫై, కృత్రిమ మేధ, వాతావరణ ఉద్యమాలు వంటి తగిన సామాజిక సమస్యలపై కేంద్రీకరించాలి.

## ప్రధాన కార్యకలాపాలు, పోరాటాలు

**అఖిల భారత మహాసభ:** కరోనా మహమ్మారి తరువాత విద్యార్థి రంగ 17వ అఖిల భారత మహాసభ హైదరాబాద్‌లో జరిగింది. 620 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు.

**విద్య కోసం మార్చ్ : అఖిల భారత జాతా:** 2022 ఆగస్టు 1వ తేదీ నుండి సెప్టెంబర్ 15వ తేదీ వరకు "మార్చ్ ఫర్ ఎడ్యుకేషన్" పేరుతో ఒక దేశవ్యాపిత జాతా జరిగింది. ఇది దేశంలోని అయిదు వైపులనుండి ప్రారంభమైంది. "విద్యను రక్షించండి, రాజ్యాంగాన్ని రంక్షించండి, భారత దేశాన్ని రక్షించండి" అనే నినాదంతో జాతా నడిచింది.

ఒకటిన్నర నెలపాటు జరిగిన జాతా విద్య ప్రయివేటీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించే ఎన్ఇపి వంటి విద్యా-వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాలమైన వేదిక ఏర్పాటుకు దారితీసింది.

**ఫెల్లోషిప్పులు, స్కాలర్షిప్పుల కోసం నిరసన ప్రదర్శనలు:** మౌలానా అజాద్ జాతీయ ఫెల్లోషిప్ (ఎంఎఎన్ఎఫ్) దాంతోపాటు సావిత్రిబాయ్ ఫూలే ఫెల్లోషిప్, పిఎంఆర్ఎఫ్ వంటి ఇతర ఫెల్లోషిప్పులను ఎత్తివేయడానికి నిరసనగా దేశవ్యాపిత నిరసన ప్రదర్శనలు చేపట్టారు. హాస్టల్స్ కొరత, మహరాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణాల్లో ఎస్సి/ఎస్టీ స్కాలర్షిప్‌ల ఎత్తివేతకు నిరసనగా కూడా ప్రదర్శనలు జరిగాయి.

జెఎన్యు, టిఐఎస్ఎస్, హెచ్సియులతోపాటు పాండిచ్చేరి యూనివర్శిటీల్లో ఎన్ఇపికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణలు జరిగాయి. విద్యకు నిధులు సమకూర్చే విధంగా కార్పొరేట్‌లపై పన్ను వేయాలని క్యాంపెయిన్ నిర్వహించారు. కోవిడ్ మహమ్మారి సందర్భంగా కూడా శతకోటీశ్వరుల సంపద ఎలా పెరిగిందీ, సామాన్య ప్రజలు ఎలా బాధలు పడ్డారో ఈ క్యాంపెయిన్‌లో వివరించారు. లోక్ సభ ఎన్నికలకు ముందు ప్రత్యామ్నాయ విద్యా విధానంపై ఒక చిన్న పుస్తకం ప్రచురించారు. దీన్ని అనేక ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేశారు.

విద్యార్థి యూనియన్లకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అనేక క్యాంపస్‌లలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. లైంగిక వేధింపులకు గురై నిరసనకు దిగిన మహిళా రెజర్లకూ, త్రిపురలో హింసాకాండకు గురైన బాధితులకూ సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించారు. గాజాపై ఇజ్రాయిల్ దాడికి నిరసనగా ప్రదర్శనలు, సౌహార్ద్ర సమావేశాలు నిర్వహించారు. క్యూబాకు సౌహార్ద్రత తెలుపుతూ విద్యార్థి రంగం అక్కడికి మందులు పంపింది.

## ఉమ్మడి వేదికలు, ఐక్య కార్యాచరణలు

రాజకీయ, సైద్ధాంతిక విబేధాలను అధిగమించడానికి నిర్మాణాత్మక, సద్యోజనిత ఐక్య పోరాటాలకు ప్రస్థుత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ప్రస్థుతం విద్యపై దాడులు జరుగుతున్న తరుణంలో ఐక్య విద్యార్థి వేదిక అవసరం ఎంతైనా ఉంది.

అడ్డంకులు ఉన్నప్పటికీ 16 విద్యార్థి సంఘాలను ఒకచోట చేరుస్తూ 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' అనే దాన్ని ఏర్పాటు చేయడానికి విద్యార్థి రంగం ప్రయత్నించింది. ఈ వేదిక ద్వారా 2024 జనవరి 12వ తేదీన పార్లమెంటుకు ఒక ఐక్య ప్రదర్శన జరిగింది. ఢిల్లీలో జరిగిన ఈ ప్రదర్శన "విద్యను రక్షించండి, ఎన్ఇపిని తిరస్కరించండి, 'ఇండియా'ను రక్షించండి, బిజెపీని తిరస్కరించండి అన్న నినాదంతో జరిగింది.

ఈ ఐక్య కార్యాచరణ చెన్నయ్, కొల్‌కొతా వరకు విస్తరించింది. విద్యార్థి గొంతును దేశ వ్యాపితంగా వినిపించింది. అనేక క్యాంపస్‌లలో వామపక్ష, పురోగామి విద్యార్థుల ఐక్యత విద్యార్థి సంఘ ఎన్నికల్లో గెలుపునకు తోడ్పడింది.

## సభ్యత్వం

విద్యార్థి రంగం సభ్యత్వం అసమతుల్యంగా ఉంది. అయిదు రాష్ట్రాలు – కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడులో మొతం సభ్యత్వంలో 93 శాతం ఉంది. రాజస్థాన్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, త్రిపురల్లో కలిపి మొత్తం సభ్యత్వంలో 6 శాతం ఉంది. మన సభ్యత్వలోని గణనీయమైన భాగం దేశంలోని కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉందని సభ్యత్వంలో ఈ అసమానతలు తెలియజేస్తున్నాయి. విద్యార్థి రంగం అఖిల భారత విద్యార్థి ఉద్యమ లక్షణాన్ని ప్రతిబింబించాలంటే తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలి.

## విద్యార్థి యూనియన్ ఎన్నికలు

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, ఇంగ్లిష్, ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ (ఇఎఫ్ఎల్‌యు), పాండిచ్చేరీ విశ్వవిద్యాలయం వంటి సెంట్రల్ యూనివర్శిటీల్లో విద్యార్థి యూనియన్ ఎన్నికల్లో మన విద్యార్థి రంగం విజయం సాధించడం అనేది ఒక బలమైన రాజకీయ ప్రకటన కిందకు వస్తుంది. ప్రజాతంత్రయుతంగా ఎన్నికలు జరిగిన మొత్తం ఏడు యూనివర్శిటీలకుగాను నాలుగు యూనివర్శిటీల్లో విద్యార్థి రంగం విద్యార్థి యూనియన్లలో నాయకత్వ శక్తిగా ఎదిగింది. మీడియా నుండి, మితవాద శక్తుల నుండి దాడులు జరిగినప్పటికీ విద్యార్థి రంగం గణనీయమైన కళాశాలలు, యూనివర్శిటీ క్యాంపస్‌లలో విజయం సాధించింది. మనం పాండిచ్చేరి యూనివర్శిటీకి చెందిన అండమాన్ క్యాంపస్‌లో రెండు సీట్లు గెలుచుకున్నాం.

## ఉద్యమ అంచనా

గత మూడేళ్లలో దేశంలోని అనేక క్యాంపస్‌లలో అనేక పోరాటాలు చేశారు. చేయాల్సింది ఇంకా చాలా ఉంది.

కేరళలో విద్యార్థి రంగ యూనిట్ అత్యంత బలమైనది. అది దాదాపు రాష్ట్రంలోని అన్ని క్యాంపస్‌లలో ఉంది. విద్యార్థుల్లో పెద్ద ప్రభావం కలిగి ఉంది.

పశ్చిమ బెంగాల్‌లో ఇప్పటివరకు వామపక్ష ఉద్యమంలోగానీ, దాని హద్దుల్లో గానీ లేని విద్యార్థులను ఆకర్షించి విస్తరించడం కోసం విద్యార్థి రంగం ప్రయత్నిస్తోంది. మన పనివిధానంలోని ధోరణులు మార్చుకోవడం ద్వారా టిఎంసి ప్రభుత్వం విధించిన తీవ్రమైన నిర్బంధాలను అధిగమించడానికి ప్రయత్నిస్తోంది.

హిమాచల్ ప్రదేశ్‌లో స్థానిక క్యాంపస్ సమస్యలపై ఉద్యమాలు జరుగుతున్నాయి. రాజస్థాన్‌లో గ్రామీణ ప్రాంతాలపై పెట్టిన కేంద్రీకరణ ఉపయోగపడింది. ఢిల్లీలో విస్తరించింది. రికార్డుస్థాయి సభ్యత్వం చేరడంలో ఇది కనిపించింది. అంతే కాకుండా ఉత్తర ప్రదేశ్, బీహార్, హర్యానాలకు ఇది ఒక నమూనాగా కూడా ఉంది.

మహారాష్ట్రలో మన సంస్థ విస్తరణకూ, పట్టణ ప్రాంతాల్లో మనం సంస్థ సంఘటితపడడానికీ సవాళ్లు ఎదురవుతున్నాయి. గుజరాత్‌లో అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయి. పంజాబ్, జార్ఖండ్, బీహార్, చత్తీష్‌ఘడ్‌లలో నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలి. బీహార్‌లో కూడా పెద్ద అవకాశాలు ఎదురుచూస్తున్నాయి. ఒడిషా రాష్ట్ర కమిటీ ఏర్పాటు క్రమంలో ఉంది.

యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లో దైనందిన విద్యార్థి సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థి రంగం కొత్త యూనిట్‌ను ప్రారంభించారు. అక్కడ మనం జిల్లా, యూనివర్శిటీ కమిటీలను కూడా ప్రారంభించాం.

"కార్యకర్తల సంస్థ" స్థానం నుండి విద్యార్థి బాహుళ్యానికి ప్రాతినిధ్యం వహించే సంస్థగా రూపాంతరం చెందడం ప్రధానమైన సవాలు. చెదురుమదురు కార్యక్రమాల నుండి విస్తారమైన విద్యార్థులు పాల్గొనే గణనీయమైన ఉద్యమాలు నిర్వహించే విధంగా కార్యకలాపాల్లో మార్పు రావాలి.

ప్రజాసంఘపు స్వతంత్ర లక్షణాన్ని కొనసాగిస్తూనే కొత్త క్యాడర్‌ను తయారు చేసుకోవడం కీలకమైన సవాలు. కొత్త క్యాడర్ విద్యాపరమైన విధానాలతోపాటు విశాలమైన జాతీయ, అంతర్జాతీయ విషయాలపై పనిచేసేట్లు మనం నిరంతర కృషి చేయాలి.

## స్వతంత్ర, ప్రజాస్వామిక పనివిధానం

ప్రజాసంఘం దైనందిన కార్యకలాపాల్లో పార్టీ జోక్యం చేసుకోకూడదు అన్న కొల్‌కొతా ప్లీనం మార్గదర్శనాన్ని చాలా వరకు రాష్ట్ర స్థాయిలో అమలు చేయడం జరుగుతోంది. అయితే, జిల్లా, స్థానిక కమిటీల అనుభవాలు బాగాలేవు. పై స్థాయిలో స్వతంత్ర పనివిధానం అమలు చేస్తున్నప్పటికీ స్థానికంగా బలహీనతలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో. ఇక్కడ విద్యార్థి రంగాన్ని స్వతంత్రమైనదిగా పాదుకొల్పడం ఒక సవాలుగానే ఉంది.

కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థి రంగ క్యాడర్‌ను అనేక బాధ్యతలు చూడమంటున్నారు. ఇది విద్యార్థి రంగంలో వారి పనిని నీరుగారుస్తుంది. దీని వల్ల వాళ్లు విద్యార్థి రంగాన్ని నిర్మించే పనిపై కేంద్రీకరించలేరు గనుక ఈ రకమైన వైఖరిని విడనాడాలి.

సంస్థల ప్రాతిపదికగా పనిచేయడం, వాటి ఆధారంగా యూనిట్లు ఏర్పాటు చేయడం కష్టతరంగా ఉన్న చోట ప్రాంతాల ప్రాతిపదికగా యూనిట్లను జయప్రదంగా ఏర్పాటు చేశారు. వీటిని విద్యార్థి రంగం అఖిల భారత కేంద్రం వద్ద రిజిస్టరు చేశారు. క్యాంపస్‌ల వారీ యూనిట్లను రెగ్యులర్‌గా పని చేయించడం, స్వతంత్రంగా పనిచేయించడానికి ప్రాధాన్యతనివ్వాలి.

## పార్టీ నిర్మాణం

విద్యార్థి రంగానికి కేంద్ర ఫ్రాక్షన్ కమిటీ ఉంది. అనేక రాష్ట్రాల్లో ఫ్రాక్షన్ కమిటీలున్నాయి. అయితే వాటి పనిని మెరుగుపరచాల్సి ఉంది.

క్యాంపస్ ఉద్యమాల్లో పాల్గొనే విద్యార్థులను నిబద్ధత గలిగిన క్యాడర్‌గా మార్చుకోవడంలో కీలకమైన బలహీనత ఉంది. వారికి నిరంతర సైద్ధాంతిక, రాజకీయ విద్యను అందించడంలో కూడా లోపాలున్నాయి. కొన్ని ఎడ్యుకేషనల్ క్యాంపులు

నిర్వహించినప్పటికీ స్థిరమైన కృషి జరగడం లేదు. విద్యార్థి పార్టీ సభ్యుల అభివృద్ధి కోసం నిర్దిష్టమైన ప్రణాళిక అవసరం.

పార్టీ కమిటీలు విద్యార్థి శాఖలు సక్రమంగా నడిచేట్లు చూడాలి. ఆగ్జలరీ గ్రూపులు ఏర్పాటు చేసేట్లు కూడా చూడాలి. విద్య పూర్తిచేసుకుని క్యాంపస్ విడిచి వెళ్లిపోవడంతోనే నిష్క్రియకు లోనైన మాజీ విద్యార్థి కార్యకర్తలను సంస్థతోపాటు అంటిపెట్టుకుని ఉంచుకునేందుకు ప్రణాళిక రూపొందించాలి.

కీలక జిల్లా క్యాంపస్‌లను గుర్తించాలి, ప్రాధాన్యతనివ్వాలి. విద్యార్థి రంగం బలపడడానికి పార్టీ సహాయం అందించాలి.

విద్యార్థి రంగంలో పనిచేస్తున్న పూర్తికాలం కార్యకర్తలను చేరదీయాలి, వారి సైద్ధాంతిక నిబద్ధతను అభివృద్ధి చేయాలి. పూర్తి కాలం కార్యకర్తలకు సరైన వేతన విధానం ఉండాలని, అలవెన్సులు రెగ్యులర్‌గా ఇస్తుండాలని కొల్‌కొతా ప్లీనం నొక్కి చెప్పింది. విద్యార్థి రంగానికి ఇది మరింత అవసరం.

పశ్చిమ బెంగాల్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున మన కార్యకలాపాల్లో పాల్గొంటున్నప్పటికీ వారిలో కావలసినంతమందిని పార్టీ సభ్యులుగా తీర్చిదిద్దడం జరగడం లేదు. ఈ అంశాన్ని వెంటనే చేపట్టి లోపాన్ని సరిదిద్దుకోవాలి. ఈ కర్తవ్యం పూర్తి చేయాలంటే పార్టీ కమిటీల నిరంతరాయ, స్థిరమైన పర్యవేక్షణ అవసరం.

క్యాంపస్‌లలో విద్యార్థి రంగం బలంగా ఉన్న కేరళలో పార్టీ నిర్మాణం మీద పార్టీ కేంద్రీకరించాలి. పార్టీ రాష్ట్ర కమిటీ చొరవ తీసుకుని విద్యార్థి రంగంలో కనిపిస్తున్న కొన్ని తప్పుడు ధోరణులను సరిచేయడానికి ప్రయత్నించింది.

మనకు గట్టి విద్యార్థి సంస్థలున్న తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్‌లలో మన విద్యార్థి రంగం క్యాడర్, నాయకత్వం నాణ్యత పెంచడానికి పార్టీ చర్యలు తీసుకోవాలి.

## విద్యార్థి రంగం అభివృద్ధి : పార్టీ బాధ్యత

అనేక రాష్ట్రాల్లో విద్యార్థి రంగం అభివృద్ధి చెందకపోవడం, తన ప్రభావాన్ని విస్తరించకపోవడం ఆందోళన కలిగించే విషయం. హిందీ మాట్లాడే ప్రాంతంలో రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, కొంతవరకు ఢిల్లీ మినహా ఇతర అన్ని రాష్ట్రాల్లోనూ

విద్యార్థిరంగం నామమాత్రంగా ఉంది లేక స్తంభించిపోయి ఉంది. అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో సభ్యత్వం నామమాత్రం. బీహార్‌లో ఎదుగూబొదుగూ లేకుండా ఉంది. హర్యానా, మధ్య ప్రదేశ్‌లలో కూడా అంతే. ఇతర రాష్ట్రాల్లో చూస్తే పంజాబ్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ లలో అభివృద్ధి లేదు. ఒడిషాలో సంఘాన్ని పునరుద్ధరించడానికి రాష్ట్ర కమిటీ కొన్ని  చర్యలు తీసుకుంది. కానీ పురోగతి పరిమితంగానే ఉంది.

విద్యార్థి రంగాన్ని ప్రాథాన్యతా రంగంగా మనం నిర్మాణ నివేదికలో పేర్కొన్నాం, అంటే ప్రస్తుత విద్యార్థిరంగ పరిస్థితిని మనం సరైన దిశగా మార్చాలి. విద్యార్థి రంగాన్ని అభివృద్ధి చేసే విషయమై చర్చలు జరిపి ప్రణాళికలు రూపొందించాల్సిన బాధ్యత పార్టీ రాష్ట్ర కమిటీలపై ఉంది. విద్యార్థి రంగం బలహీనంగా ఉన్న, అసలు లేకున్న రాష్ట్రాల్లో దీన్ని మరింత తీవ్ర విషయంగా చూడాలి. సరైన విద్యార్థి క్యాడర్‌ను గుర్తించి వారు ఆర్గనైజర్స్ పాత్ర నిర్వహించేట్లు సహాయపడడం మొదటి చర్య. విద్యార్థి సంఘ యూనిట్లను ఏర్పాటు చేయడానికీ, వాటికి ఊతం ఇవ్వడానికీ పార్టీ కమిటీలు కృషి చేయాలి. పార్టీ ప్రాథమిక కృషి చేస్తే అప్పుడు విద్యార్థి రంగ అఖిలభారత కేంద్రం జోక్యం చేసుకుని సహాయపడగలదు.

విద్యా వ్యవస్థ లక్షణం మారిపోతున్న పూర్వరంగంలో ఆ మార్పుల వల్ల వచ్చే సవాళ్లను ఎదుర్కొనే విధంగా పార్టీ దానికి సహకరించాలి.

## కర్తవ్యాలు:

1. ప్రయివేటు విద్యారంగంలోని పెద్ద భాగం విద్యార్థులు విద్యార్థి ఉద్యమానికి దూరంగా ఉంటున్నారు. ఈ విద్యార్థులతో సంబంధాలు ఏర్పాటు చేసుకోడానికి కొత్త నిర్మాణ రూపాలను రూపొందించాలి. నివాస ప్రాంతాల్లో విద్యార్థులను ఆర్గనైజ్ చేయడంలో వచ్చిన అనుభవాలు ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులను చేరడానికి ఉపయోగపడే ఒక మార్గం. అటువంటి విద్యార్థుల్లో పనిచేసేందుకు విద్యార్థి రంగానికి పార్టీ సహకరించాలి.
2. క్యాంపస్‌ల ప్రజాస్వామ్యీకరణ, విద్యార్థి సంఘాల నిరంతర ఎన్నికల కోసం విశాలమైన ప్రచారం చేపట్టాల్సిన అవసరం ఉంది.

3. హిందూత్వ మతతత్వ శక్తులు పాఠ్యాంశాలను మతతత్వం గావిస్తున్న తరుణంలో విద్యార్థుల్లో సైద్ధాంతిక పోరాటం నిర్వహించడం ప్రాధాన్యతాంశంగా చేపట్టాలి.
4. విద్యార్థుల్లో నిర్వహించే సైద్ధాంతిక పోరాటంలో వర్తమాన, భారతీయ పరిస్థితులకు తగిన సోషలిస్టు విజన్ గురించి ప్రచారం చేయడం ఒక భాగంగా ఉండాలి.
5. విద్యార్థుల్లో పెద్ద సెక్షన్ సాంస్కృతిక కార్యకలాపాలవైపు ఆకర్షితులవుతున్నారు. హిందూత్వ మతతత్వ శక్తులు తమ సాంస్కృతిక జోక్యం ద్వారా విద్యార్థుల మెదళ్లను పాడుచేస్తున్నాయి. విద్యార్థి సంఘం పురోగామి విలువలను ప్రచారం చేయడం కోసం సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించాలి.

***

మీ రాజకీయ అవగాహన కోసం...

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
# ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| 1. | 24వ మహాసభ రాజకీయ తీర్మానం | | - 20/- |
| 2. | కార్యక్రమం నిబంధనావళి | | - 80/- |
| 3. | గతి తార్కిక భౌతికవాదం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 20/- |
| 4. | చారిత్రక భౌతిక వాదం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 20/- |
| 5. | రాజకీయ అర్ధశాస్త్రం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 40/- |
| 6. | కమ్యూనిస్టు ఉద్యమం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 30/- |
| 7. | సామాజిక తరగతులు | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 30/- |
| 8. | పార్టీ నిర్మాణం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 20/- |
| 9. | పార్టీ కార్యక్రమం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 15/- |
| 10. | భారతదేశంలో పట్టణీకరణ సమస్యలు - పరిష్కారాలు | | - 40/- |
| 11. | పార్టీ - నిర్మాణ కర్తవ్యాలు | భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) డాక్యుమెంట్లు | - 200/- |
| 12. | పార్టీ - ప్రజాసంఘాలు | భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) డాక్యుమెంట్లు | -200/- |
| 13. | పార్టీ నిర్మాణ, నివేదిక, తీర్మానం | (కలకత్తా ప్లీనం 2015 డిసెంబర్ 27-31) | - 75/- |
| 14. | నయా ఉదారవాద విధానాలు | | |
| | కర్మిక వర్గ సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులుఅధ్యయన బృందం నివేదిక | | - 15/- |
| 15. | పట్టణ సమస్యలు - మధ్య తరగతి | అధ్యయన బృందం నివేదిక | - 15/- |
| 16. | వ్యవసాయ రంగంలో మార్పులు | అధ్యయన బృందం నివేదిక | - 30/- |
| 17. | పట్టణ ప్రాంత సమస్యలు, మధ్యతరగతి | | - 15/- |
| 18. | 18వ లోక్‌సభ ఎన్నికల సమీక్ష | | - 10/- |
| 19. | జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై నివేదిక | | - 15/- |
| 20. | వ్యవసాయ కార్మిక రంగంలో కృషి - సమీక్ష | | - 20/- |
| 21. | వ్యవసాయ రంగంలో మార్పులు | అధ్యయన బృందం నివేదిక | - 30/- |
| 22. | 23వ మహాసభ రాజకీయ తీర్మానం | | - 25/- |
| 23. | సైద్ధాంతిక తీర్మానాలు | | - 20/- |
| 24. | ప్రజాపునాది విస్తరణకు పటిష్ట నిర్మాణం | | - 50/- |